

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

గురువారం | 15 ఫిబ్రవరి 2018 | విజయవాడ

సంపుటి 11 | సంచిక 111
| పేజీలు 12+12 | వెల: రూ. 5.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర రుతువు, మాఘమాసం, బహుళ పక్ష తిథి : అమావాస్య రా.2.02, శ్రవణం ఉ.7.26, వర్జ్యం రా.11.47 నుంచి 1.31 వరకు, రాహుకాలం: మ.1.30 నుంచి 3.00 వరకు; దుర్ముహూర్తం: ఉ.10.00 నుంచి 10.48 వరకు, తిరిగి మ.2.48 నుంచి 3.36 వరకు, సూర్యోదయం : ఉ.6.47 గం; సూర్యాస్తమయం: సా. 6.14 గం.

నవ్యాంధ్రకు పల్ప్ పేపర్



- రాష్ట్రంలో అతిపెద్ద కాగిత పరిశ్రమ
- ఏర్పాటుకు ముందుకొచ్చిన ఏపీపీ
- రెండున్నరవేల ఎకరాల భూమి కేటాయించండి
- ముఖ్యమంత్రిని కోరిన సంస్థ ప్రతినిధులు
- చంద్రబాబు సానుకూల స్పందన

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన కాగితం తయారీ సంస్థ ఆసియా పల్ప్ పేపర్ రాష్ట్రంలో అడుగు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసిన ఏపీపీ ప్రతినిధులు భారతదేశంలోనే అతి పెద్ద కాగిత తయారీ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేందుకు తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. పెద్దఎత్తున ముడి పదార్థాలను దిగుమతి చేసుకునేందుకు, చైనా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని తూర్పు తీరంలో వున్న ఏపీలో తమ సంస్థను నెలకొల్పాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఇందుకోసం ఏదైనా నౌకా తీరానికి సమీపంలో రెండున్నర వేల ఎకరాల భూమిని కేటాయించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరారు. ముఖ్యమంత్రి దీనికి సానుకూలంగా స్పందిస్తూ కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టు పరిసరప్రాంతాలను పరిశీలించాల్సిందిగా సూచించారు. తమకు భూమిని కేటాయించిన రెండున్నరేళ్లలోనే ఉత్పత్తిని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రికి ఏపీపీ ప్రతినిధులు వివరించారు. రోజుకు సరాసరి 4 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ పరిశ్రమను నెలకొల్పుతామని ఇందులో నాలుగో వంతు దేశీయ విపణికే కేటాయిస్తామని చెప్పారు.

జర్మనీకి చెందిన ఆగ్రో కెమికల్స్ సంస్థ బేయర్ ఆంధ్రప్రదేశ్ రైతులకు పంట రక్షణ, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, డిజిటల్ ఫార్మింగ్ వంటి అంశాలలో సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ముఖ్యమంత్రితో తమ ప్రతిపాదనలు ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. సన్న, చిన్నకారు రైతుల సంక్షేమమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, ఇప్పటికే సాగులో సాంకేతికతను మేళవించి ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని ముఖ్యమంత్రి వారికి చెప్పారు. భూసార పరిక్షల్లో అధునాతన పరికరాలు, సీసీ కెమేరాలు, డ్రోన్ల సాయాన్ని తీసుకుంటున్నామని తెలిపారు. మామిడి పంటకు ప్రఖ్యాతిగాంచిన చిత్తూరు జిల్లాలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సమగ్ర ప్రతిపాదనలతో నెలరోజుల్లోగా వస్తే ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. అటు వివిధ సిమెంట్ కంపెనీల ప్రతినిధులు ముఖ్య మంత్రితో సమావేశమయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ నిర్మాణ పనులకు ప్రస్తుతం అందిస్తున్న ధరలకే మరో ఏడాది పాటు సిమెంట్ సరఫరా చేస్తామని ప్రతినిధులు ముఖ్య మంత్రికి వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుకు ఇంకాస్త ధర తగ్గించే ప్రయ త్నం చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సూచించారు. ప్రభుత్వానికి అందించే సిమెంట్‌ను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు ఈనెల 22న జరి గే ఫ్రేమ్‌వర్క్ అమర్చే పనులను ప్రారంభించాల్సిందిగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా మోటర్స్ ఎండీ కూఖ్యున్ షిమ్ ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

జూన్ 2న 200 అన్న క్యాంటీన్లు

- ఒకేసారి ప్రారంభిస్తామన్న మంత్రి నారాయణ
- మొదటి విడతగా లక్ష జనాభా దాటిన 33 మునిసిపాలిటీల్లో క్యాంటీన్లు
- అన్న క్యాంటీన్లకు సొంత భవనాలు
- రాజధాని ప్రాంత రోడ్లు, ఉద్యోగుల ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్‌కు పూర్తి
- రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ

2 లో

పంజాబ్ నేషనల్ బ్యాంకులో
భారీ కుంభకోణం
రూ. 11 వేల కోట్లు స్వాహా



- కుదేలైన బ్యాంకు ఈక్విటీ షేరు
- ముంబై శాఖలో అక్రమ లావాదేవీలు
- 1.8 బిలియన్ డాలర్ల మోసాన్ని గుర్తించిన బ్యాంక్
- వీటి విలువ రూ. 11,000 కోట్లు
- కొందరు ఖాతాదారులకు ప్రయోజనం
- దర్యాప్తు ఏజెన్సీలకు ఫిర్యాదు చేశామన్న బ్యాంకు
- మరిన్ని బ్యాంకుల్లోనూ ఇలాగే జరిగి ఉండవచ్చన్న అనుమానాలు

ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగు చూసింది. ముంబై బ్రాంచ్‌లో 1.8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.11వేల కోట్లు) మేర మోసపూరిత లావాదేవీలు జరిగినట్టు స్వయంగా పీఎన్‌బీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమాచారం అందించింది. మోసపూరిత, అనధికారిక లావాదేవీలు కొందరు ఖాతాదారుల ప్రయోజనాల కోణంలో జరిగినట్టు గుర్తించామని పేర్కొంది. ఈ లావాదేవీల ఆధారంగా ఆయా ఖాతాదారులకు విదేశాల్లో రుణాలు జారీ అయినట్టు వివరించింది. దీనిపై దర్యాప్తు జరిపి నిందితులను పట్టుకునేందుకు వీలుగా దర్యాప్తు ఏజెన్సీలకు నివేదించామని, స్వచ్ఛమైన, పారదర్శక బ్యాంకింగ్ సేవలకు కట్టుబడి ఉన్నామని పంజాబ్ నేషనల్ బ్యాంకు తెలిపింది. కాగా, దీని ప్రభావం ఇతర రుణదాతలపైనా పడే అవకాశముందని బ్యాంకు తెలిపింది.



6 లో

బోళ్ల బుల్లిరామయ్య ఇకలేరు
అనారోగ్యంతో మృతి చెందిన కేంద్ర మాజీ మంత్రి



- ఆయన వయసు 92 సంవత్సరాలు
- ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి
- నాలుగు సార్లు ఏలూరు ఎంపీగా విజయం
- వాజ్‌పేయి మంత్రివర్గంలో సేవలు
- సంతాపం ప్రకటించిన చంద్రబాబు,లోకేష్

టీడీపీ ఎమ్మెల్యే చింతమనేనికి
రెండేళ్ల జైలు శిక్ష

- 2011లో మంత్రి వట్టి వసంత కుమార్‌పై దాడి చేసిన చింతమనేనికి జైలు
- విచారణ అనంతరం జైలు శిక్ష
- మరో రెండు కేసుల్లోనూ శిక్ష
- వెంటనే బెయిల్ మంజూరు



ఏలూరు, సూర్య ప్రతినిధి : పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు భీమడోలు కోర్టు జైలు శిక్ష విధించింది. 2011లో రచ్చబండ కార్యక్రమంలో అప్పుడు మంత్రిగా ఉన్న వట్టి వసంత కుమార్‌పై దాడి కేసులో టీడీపీ ఎమ్మెల్యేకు ఈ శిక్ష పడింది. మంత్రి, ఆయన గన్‌మెన్‌పై దాడికి సంబంధించి వేర్వేరుగా నమోదైన మూడు కేసుల్లోనూ చింతమనేనికి కోర్టు జైలు శిక్ష విధించింది. సెక్షన్ 353 కింద ఆరు నెలల జైలు శిక్షతో పాటు. రూ. 1000 జరిమానా, సెక్షన్ 506 కింద రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా, నేరసవరణ చట్టంలోని సెక్షన్ 2 క్లాజ్ 2 కింద ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధించింది. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు మూడు కేసుల్లోనూ కలిపి మొత్తం రెండేళ్ల జైలు శిక్షను భీమడోలు కోర్టు విధించింది. అయితే ఆయన బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు భీమడోలు

మిగతా 6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

వేగంగా ఎల్ఈడీలు



- సాధ్యమైనంత త్వరగా లైట్ల బిగింపు
- ఎస్సీ కాలనీల నుంచే ప్రారంభించాలి
- పనులపై రోజూ వీడియో కాన్ఫరెన్స్
- డ్యాష్ బోర్డుకు సమాచారం అనుసంధానం
- ఏపీ ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్

వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో ఎల్ఈడి లైట్ల ఏర్పాటు పై చర్చ జరిగింది. ఈఈఎస్ఎల్ ద్వారా తూర్పుగోదావరి, చిత్తూరు, అనంతపురం, కడప, విజయనగరం జిల్లాలోని గ్రామాల్లో ఎల్ఈడి లైట్ల ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 5237 గ్రామాల్లో ఎల్ఈడి లైట్లను ఈఈఎస్ఎల్ ఏర్పాటు చేయనుంది. ఇప్పటి వరకూ 1,56,773 ఎల్ఈడి లైట్లను ఈఈఎస్ఎల్ అమర్చింది. 256 గ్రామ పంచాయతీల్లో నూటికి నూరు శాతం ఎల్ఈడి లైట్లను ఈఈఎస్ఎల్ పూర్తి చేసింది. 1,56,773 ఎల్ఈడి లైట్ల ను 1576 సిసిఎమ్ఎస్ బాక్సుల ద్వారా ఈఈఎస్ఎల్ అనుసంధానం చేసింది. ఫిబ్రవరి 15వ తారీఖు నుండి ప్రతి రోజు 10 వేల బల్బుల స్టాక్ అందుబాటులోకి

మిగతా 6లో

అమరులకు మతం రంగా?

- ఒవైసీ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందన
- ప్రకటనలు చేసేవారికి ఆర్మీ గురించి తెలియదు
- జీఓసీ నార్తర్న్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ దేవరాజ్ అంబు ప్రతిస్పందన

అంతా ఇంతే!



నోట్లన్నీ బ్యాంకుల్లో దాచుకోమన్నారు, ఇప్పుడు బ్యాంకుల్లోనే కుంభకోణాలు జరిగితే ఎలా అంటున్నాడు

ఉత్సాహంగా ప్రజా సంకల్పయాత్ర



- ప్రజల కష్టాలను అడిగి తెలుసుకుంటున్న వైసీపీ అధినేత జగన్
- తమ కష్టాలు వెళ్లబోసుకున్న వేరుశనగ రైతులు
- ప్రతి ఒక్కరినీ ఆదుకుంటానని జగన్ హామీ
- చంద్రబాబుపై విమర్శలు

వివరాలు లోపలి పేజిలో

ట్రంప్ అసంతృప్తి



5 లో

- అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై ఇండియా అధిక సుంకం వసూలు చేస్తోంది
- ఇదే కొనసాగితే మేమూ అదే పని చేస్తాం: ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక
- హార్లీ డేవిడ్‌సన్ బైకులపై భారత్ అధిక సుంకాలు
- అదే విషయాన్ని ప్రస్తావించిన ట్రంప్

ఇక సినిమాలకు గుడ్‌బై

- రాజకీయాలకే అంకితమని కమలహాసన్ ప్రకటన
- త్వరలో రానున్న రెండు సినిమాలే ఆఖరు
- ప్రజా సేవలోనే ప్రాణాలు వదులుతా
- కాషాయ రాజకీయాలకు వ్యతిరేకం
- నా రాజకీయాలు నలుపు



బోస్టన్: ఎన్నో అద్భుత పాత్రలతో కళామతల్లికి సుదీర్ఘ కాలం సేవలు అందించి, ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న నట కమలం, పద్మ భూషణుడు, ప్రముఖ నటుడు, 63 ఏళ్ల కమలహాసన్ భవిష్యత్తులో సినిమాలు చేయబోనని సంచలన నిర్ణయం ప్రకటించారు. తమిళనాడు ప్రజల కోసం రాజకీయాల్లోకి రావాలని తీసుకున్న నిర్ణయమే అంతిమమని, వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి వస్తున్నట్టు కమల్ రెండు నెలల క్రితమే ప్రకటించారు. ఈ నెలలో పార్టీ పేరు, సిద్ధాంతాలను ప్రకటించనున్నారు. 'త్వరలో విడుదల కానున్న రెండు సినిమాలు మినహా ఇకపై నాకు ఏ సినిమా ఉండదు' అని బోస్టన్‌లోని హార్వర్డ్ యూనివర్సిటీలో 'ఇండియా టుడే న్యూస్ చానల్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కమల్ పేర్కొన్నారు. ఓటమి ఎదురైనా రాజకీయాల్లోనే కొనసాగుతారా? అన్న ప్రశ్నకు 'నిజాయతీగా

మిగతా 6లో

సూర్య
హైదరాబాద్
గురువారం
15 ఫిబ్రవరి 2018

'టెట్' లోపాలపై మంత్రి గంటా ఆగ్రహం

అమరావతి, సూర్య ప్రతినిధి : ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహణ కేంద్రాల కేటాయింపుల్లో పొరపాట్లు చోటుచేసుకోవడంపై రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఏ జిల్లా నుంచి అభ్యర్థి దరఖాస్తు చేస్తే ఆ జిల్లా కాకుండా ఒక మూల నుంచి మరో మూలకు విసిరేయడం ఏమిటని గట్టిగా నిలదీశారు. పరీక్ష కేంద్రాలను మార్చుకునేందుకు అంతర్రాష్ట్ర విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ అవకాశం కల్పించినా రాష్ట్రంలోనే దూర ప్రాంతాలకు వేసిన వారి గురించి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. తొలిసారి ఆన్‌లైన్‌లో టెట్ పరీక్ష నిర్వహిస్తున్నందున ఏ చిన్నపాటి పొరపాటుకు తావివ్వొద్దని పదేపదే చెబుతున్నా అలసత్వం కనబరుస్తుండడం సరికాదని హెచ్చరించారు. టెట్ నిర్వహణ లోపాలు, ఇతర అంశాలపై గురువారం విజయవాడలో మంత్రి గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం జరపాలని నిర్ణయించారు. ఈనెల 21 నుంచి మార్చి మూడో తేదీ వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్‌కు సంబంధించి ఇబ్బందులు తొలగిపోయాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. హాల్‌టిక్కెట్లలో తప్పిదాలపై అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వస్తోన్న విషయాన్ని మంత్రి గంటా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరీక్షా కేంద్రాల కేటాయింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ఏంటని మంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దరఖాస్తులో ఆప్షన్లు పెట్టకపోయినా కొందరు విద్యార్థులకు పక్క రాష్ట్రాల్లో, మరికొందరికి రాష్ట్రంలోనే వందల కిలోమీటర్ల దూరంలో పరీక్షా కేంద్రాలను కేటాయింపు ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను దక్కించుకున్న ప్రైవేటు సంస్థ సమర్థతపైనా ఫిర్యాదులు వస్తుండడంతో ఈ విషయాన్ని గురువారం జరిగే సమీక్షలో తీవ్రంగా చర్చిస్తామని మంత్రి గంటా శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు.




పీఎంఎస్‌కేవై కింద రూ.వెయ్యి కోట్లు!

- రాష్ట్రంలో 11 ప్రాజెక్టులు
- యూసీలు వెంటనే ఇవ్వండి
- ప్రాజెక్టుల పూర్తిపై డెడ్‌లైన్ల ఖరారు
- మంత్రి హరీశ్ ఆదేశం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతిని.: సత్వర సాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ) కింద తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. గురువారం ఢిల్లీలో కేంద్ర జలవనరుల మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో మంత్రి పాల్గొననున్నారు. ఈ మేరకు బుధవారం నాడు జలసౌధలో ఉన్నతాధికారులతో హరీష్ రావు సమీక్షించారు. కేంద్రం మంజూరు చేసిన నిధుల వ్యయానికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లను వెంటనే జారీ చేయాలని సంబంధిత సి.ఇ లను మంత్రి కోరారు. పలు ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సంబంధించి మంత్రి హరీశ్ రావు డేడ్ లైన్లు ఖరారు చేశారు. వచ్చే జూన్ వరకు భీమా ,నీల్వాయి,కొమురంభీం ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఇరిగేషన్ మంత్రి ఆదేశించారు. గొల్లవాగు ప్రాజెక్టును ఈ మార్చి కి పూర్తిచేయాలన్నారు. పాలెంవాగును మే కల్లా పూర్తి చేయాలని కోరారు. దేవాదులను 2019 మార్చి నాటికి పూర్తి చేయాలని,ఎస్.ఆర్.ఎస్.పి. వరద కాలువను 2019 జూన్ నాటికి పూర్తి చేయాలని కోరారు. వివిధ ప్రాజెక్టులలో భూసేకరణకు సంబంధించిన సమస్యలపై మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్లతో మంత్రి మాట్లాడారు. భూసేకరణ ప్రక్రికియను వేగవంతం చేయాలని ఆయన కోరారు. జగన్నాథపూర్ ప్రాజెక్టుకు సంబంధించిన వ్యవహారంలో కోర్టు తీర్పుకనుగునంగా వెంటనే చర్యలు తీసుకొని పనులు వేగవంతం చేయాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. ప్రధాన మంత్రి కృషిసంచాయి యోజన(పీఎంఎస్‌కేవై) కింద దేశవ్యాప్తంగా ప్రాధాన్యంగా పూర్తిచేయాల్సిన ప్రాజెక్టుల జాబితాలో తెలంగాణాలోని 11 ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు క్యాడ్ వామ్ కింద రూ.1000 కోట్లు రాష్ట్రానికి రానునాయి. ప్రాధాన్యతా పరంగా ప్రాజెక్టుల పూర్తికి తీసుకోవాల్సిన చర్యలు, నిధులు తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ 1 8 రాష్ట్రాల మంత్రులు, అధికారులను ఆహ్వానించింది. తెలంగాణ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు గ్రాంటు, రుణ రూపేణా పి.ఎం.కే.ఎస్.వై. ద్వారా లభించనున్నాయి. తెలంగాణ నుంచి ప్రధాన మంత్రి కృషిసంచాయ్ యోజనలో చోటు లభించిన వాటిలో మత్తడివాగు, నీల్వాయి, గొల్లవాగు, ర్యాలివాగు, పాలెంవాగు, రాజీవ్ బీమా ప్రాజెక్టుల పనులలో మత్తడి వాగు,ర్యాలీ వాగు పూర్తయ్యాయి. పూర్తయిన ప్రాజెక్టులకు సంబంధించి సర్టిఫికెట్లు మార్చి చివరిలోగా కేంద్రానికి సమర్పించాలని మంత్రి హరీశ్ కోరారు. గతం లో ఏ.ఐ.బి.పి. కింద మంజూరైన ప్రాజెక్టులలో ఇంకా మిగిలి ఉన్న పనులు, బాటిల్ నెక్స్ సమస్యలు ఇతర అంశాలను మంత్రి సమీక్షించారు. పి.ఎం.కే.ఎస్.వై. కింద చేపట్టిన ప్రాజెక్టులలో నాబార్డు నేరుగా కాకుండా జాతీయ జల అభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్రాలకు రుణం అందజేస్తుంది. దేవాదుల ప్రాజెక్టును గతంలోనే కేంద్రం పి.ఎం.కే.ఎస్.వై. లోకి తీసుకోగా తర్వాత కొమురం భీం ప్రాజెక్టు, రాజీవ్ భీమా ఎత్తిపోతల ప్రాజెక్టు, ఎస్సారెస్పీ ప్రాజెక్టు, ఇందిరమ్మ వరదనీటి కాల్వ ప్రాజెక్టు, పాలెంవాగు ప్రాజెక్టు, నీల్వాయి ప్రాజెక్టు, మత్తడివాగు ప్రాజెక్టు, ర్యాలివాగు ప్రాజెక్టు, గొల్లవాగు ప్రాజెక్టులను పీఎంకెఎస్వైలో చేరాయి. ప్రాజెక్టులు నిర్ణీత గడువు లోగా పూర్తికావాలంటే ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే కేంద్రం నిధులు విడుదల చేయాలని హరీశ్ రావు గురువారం నాటి సమావేశంలో కోరనున్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సి.ఎస్. జోషి, సెక్రెటరీ వికాస్ రాజ్, ఇ.ఎన్.సి. మురళీధర్ రావు, ఇ .ఎన్.సి లు నాగేందర్ రావు, అనిల్, సి.లు భగవంతరావు, బంగారయ్య, 'కాడా' కమిషనర్ మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.



తాజా రాజకీయ అంశాలపై బాబు చర్చ



అమరావతి, సూర్య ప్రతినిధి : టీడీపీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. ప్రత్యేక హోదాపై కేంద్రం స్పందించకపోతే వైసీపీ ఎంపీలు రాజీనామా చేస్తారన్న జగన్ ప్రకటనతో పాటు తాజా రాజకీయ అంశాలపై వారితో చర్చించనున్నట్లు తెలుస్తోంది. మంత్రులు కళావెంకట్రావు, యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, కాల్వశ్రీనివాసులు, ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు. కడప, రాజంపేట లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం సాయంత్రం సమావేశమయ్యారు. పార్టీని పటిష్టపరిచే కార్యక్రమంలో భాగంగా తొలుత పార్లమెంటు నియోజకవర్గాలపై చంద్రబాబు దృష్టిసారించారు. దీనిలో భాగంగా నేడు కడప, రాజంపేట నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పరిస్థితి, విపక్ష పార్టీల బలబలాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

బీజేపీ, టీడీపీ మైత్రి కొనసాగుతుంది

ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వర్ల రామయ్య



విజయవాడ, సూర్య ప్రతినిధి : టీడీపీ–బీజేపీ మైత్రి కొనసాగుతుందని టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య స్పష్టంచేశారు. బీజేపీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని నమ్ముతున్నామన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే ఏప్రిల్ 6న వైసీపీ ఎంపీలు రాజీనామా చేస్తారని జగన్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఎంపీల చేత ఇప్పుడే రాజీనామా చేయాలన్నారు. ఏప్రిల్ 6న రాజీనామా చేస్తే ఉపఎన్నికలు రావనే ఈ డ్రామా ఆడుతున్నా రన్నారు. సీబీఐ, ఈడీ కేసుల్లో తీర్పు వస్తే జగన్ రాజమండ్రి సెంట్రల్ జైలు లేదా తీహార్ జైలుకెళ్తారన్నారు. ఇడుపుల పాయలో ఎంత అసైన్డ్ భూమి ఉందో జగన్ చెప్పాలన్నారు. అలాగే జగన్ బంధువుల పేరున ఉన్న దళితుల భూముల వివరాలు కూడా చెప్పాలని వర్ల రామయ్య డిమాండ్ చేవారు.

చిల్లర రాజకీయాలు చేస్తున్న టీఆర్ఎస్


- సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారంపై ఫిర్యాదు
- తన ట్విట్టర్ అకౌంట్ హ్యాక్ చేశారని శ్రవణ్ ఫిర్యాదు
- పార్టీ వీడుతున్నానని తప్పుడు పోస్టింగ్‌లు పెడుతున్నారని ఆవేదన
- కాంగ్రెస్‌ను వీడేది లేదంటూ స్పష్టీకరణ

హైదరాబాద్, మేజర్‌న్యూస్: కాంగ్రెస్ పార్టీలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అందుకే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నానని, ఈ రెడ్ల ఆధిపత్యంలో ఇమడ లేక పోతున్నానంటూ గత రెండు రోజులుగా తన ట్విట్టర్ అకౌంట్ లో దుష్ప్రచారానికి పాల్పడుతూ, తన ప్రతిష్ట కు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి, డాక్టర్ శ్రవణ్ దాసోజు, సైబర్‌క్రైమ్ డీసీపీ అవినాష్ మొహంతిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తో కలిసి కమీషనర్ కార్యాలయం ఎదుట ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదనే తప్పుడు భావనను, ప్రజల్లోకి తీసుకెళ్లి రాజకీయ లబ్ది పొందాలని టీఆర్ఎస్ పార్టీ చూస్తోందని విమర్శించారు. రాజకీయంగా తనను ఎదగనీయకుండా మొగ్గలోనే తుంచేయాలన్న దుర్మార్గమైన కుట్ర రాజకీయాలను టీఆర్ఎస్ చేస్తోందని ఆరోపించారు. బీసిల ను కాంగ్రెస్ పార్టీకి దూరం చేయాలని, తద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను, ప్రజల్లో పెరుగుతున్న ప్రాబల్యాన్ని తగ్గించాలని చూస్తోందన్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధిగా నియమించబోతున్నారంటూ పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు తనపై వ్యక్తి గతంగా దూషణలకు పాల్పడుతూ ఇష్టారాజ్యంగా పోస్టింగులు పెట్టారని, చిలువలు పలువలు గా తప్పుడు రాతలు రాశారని శ్రవణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీ 60 మంది ఎమ్మెల్యేల లిస్టు ను ప్రకటించిందని సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారానికి తెగబడి కాంగ్రెస్ పార్టీని , నాయకులను అస్థిర పరచాలని కుట్ర చేశారంటూ అసహనం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ప్రాధాన్యత కల్పించడంలేదని, ఆపార్టీలో బీసిలకు అస్తిత్వం లేదని అప్రతిష్టపాలు చేసేందుకు చిల్లర రాజకీయాలతో పబ్బం గడుపు కోవాలని ప్రయత్నిస్తే ఖబర్దారంటూ శ్రవణ్ హెచ్చరించారు. ఇలాంటి తప్పుడు విధానాలకు తెలంగాణ సమాజం హర్షించదని టీఆర్ఎస్ పార్టీ నేతలు గ్రహించాలని హితవు పలికారు.

ఇమేజీ తగ్గించేందుకే శ్రవణ్ పై తప్పుడు రాతలు అంజన్ కుమార్ : శ్రవణ్ ఇమేజీని తగ్గించేందుకు టీఆర్ ఎస్ పార్టీ తప్పుడు ఆరోపణలకు దిగుతోందని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో అపోహలు సృష్టించాలని ప్రయత్నిస్తోందని, టీఆర్ఎస్ విధానాలను ఎండగడుతున్నందుకే ఆయన పై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు.



ఆర్థిక నిపుణులతో యనమల సమావేశాలు



అమరావతి. సూర్య ప్రత్యేక ప్రతినిధి : 2018–19 బడ్జెట్‌పై రేపటినుంచి ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు కసరత్తు ప్రారంభించనున్నారు. యనమల చాంబర్‌లో గురువారం నుంచి మూడు రోజుల పాటు వివిధ శాఖల మంత్రులు, అధికారులతో ప్రీబడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నారు. తొలి రోజు ఆర్థిక నిపుణులతో సమావేశం ప్రారంభించి, అనంతరం వ్యవసాయం, మార్కెటింగ్, పౌరసరఫరాలు, పట్టణాభివృద్ధి, రవాణా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ, శిశు సంక్షేమ, కార్మిక శాఖల మంత్రులు, అధికారులతో భేటీకానున్నారు. 16న నీటి పారుదల, గ్రామీణాభివృద్ధి, పంచాయితీ, రూరల్ హౌసింగ్, ప్రజాసంబంధాలు, రోడ్లు, భవనాలు, రెవెన్యూ, పర్యాటక, మైనింగ్, మానవ వనరుల అభివృద్ధి, వైద్య శాఖల మంత్రులు, అధికారులతో సమావేశమవుతారు. 17న హోం, అటవీ, విద్యుత్, దేవాదాయ, అబ్కారీ, పరిశ్రమలు, క్రీడాభివృద్ధి శాఖల మంత్రులు, అధికారులతో చర్చించనున్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఖర్చులు, కేటాయింపులపై చర్చించనున్నారు.

జూన్ 2న 200 అన్న క్యాంటీన్లు ప్రారంభం

- మొదటి విడతగా లక్ష జనాభా దాటిన 33 మునిసిపాలిటీల్లో క్యాంటీన్లు
- అన్న క్యాంటీన్లకు సొంత భవనాలు
- రాజధాని ప్రాంత రోడ్లు, ఉద్యోగుల ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్ కు పూర్తి
- రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ

వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : వచ్చే జూన్ రెండో తేదీన రాష్ట్రంలో 200 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు. నారాయణ తెలిపారు. లక్ష జనాభా పైబడిన 33 మున్సిపాల్టీల్లో మొదటి విడతగా అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామన్నారు. 200 అన్న క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించనున్నామన్నారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన సీఆర్డీఏ సమావేశం బుధవారం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాజధాని పరిధిలో చేపట్టిన రోడ్లు, సీవరేజ్, విద్యుద్దీకరణ పనులపై సమీక్ష జరిపామన్నారు. రాజధాని అమరావతి పరిధిలో చేపట్టిన రోడ్డు నిర్మాణాలు త్వరితగతంగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. సీఆర్డీఏ పరిధిలో ఈస్టు నుంచి వెస్ట్ మధ్య 16 రోడ్లు, సౌత్ నుంచి నార్త్ మధ్య 18 రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఈ 34 మేజర్ రోడ్లకు ఇప్పటికే 24 రోడ్లకు టెండర్లు పిలిచి, పనులు కూడా ప్రారంభించామన్నారు. పనులు జరుగుతున్న తీరును ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు హెలీకాప్టర్ ద్వారా పరిశీలించారన్నారన్నారు. రోడ్డు నిర్మాణాలు చేపట్టిన కంపెనీలు ఎటువంటి యంత్ర సామాగ్రి వినియోగిస్తున్నదీ? సీఆర్డీఏ సమావేశంలో సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారన్నారని మంత్రి తెలిపారు. వారం రోజుల్లోగా రోడ్ల నిర్మాణాలు జరిగిన తీరుతెన్నులపై వివరాలు అందజేయాలని సీఎం ఆదేశించారన్నారు. ఈ ఏడాది చివరి నాటికి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సీఆర్డీఏ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు. మిగిలిన 10 మేజర్ రోడ్లకు త్వరలోనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తామన్నారు. రైతుల నుంచి సేకరించిన భూముల్లో చేపట్టిన రోడ్లు, ఇతర నిర్మాణాలు నిబంధనలకనుగుణంగా జరుగుతున్నాయన్నారు. 34 రోడ్ల నిర్మాణాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు. రోడ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నా, కొందరు అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వారంతా పనులు జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని మంత్రి నారాయణ హితవు పలికారు. ఐఏఎస్, గెజిటెడ్, నాన్ గెజిటెట్, గ్రూప్ 1, 2, 3, 4 ఉద్యోగుల కోసం 3, 840 ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఏప్రిల్‌లోగా మొదటి స్లాబ్ పనులు పూర్తిచేస్తామని సీఎం చంద్రబాబునాయుడుకు సంబంధిత కాంట్రాక్టర్ తెలిపారన్నారు. డిసెంబర్ నాటికి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

జూన్ 2న 200 అన్న క్యాంటీన్లు ప్రారంభం : ఈ ఏడాది జూన్ 2 తేదీన రాష్ట్రంలో లక్ష జనాభా పైబడిన 33 మున్సిపాల్టీల్లో 200 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ తెలిపారు. తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు, కర్నాటకలోని బెంగళూరులో ఇందిరా క్యాంటీన్ల పనితీరును స్వయంగా పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంట వరకూ బెంగళూరు అధికా రులతో క్యాంటీన్ల నిర్వహణపై చర్చించినట్లు మంత్రి తెలిపారు. పూర్తిస్థాయి వివరాలను సీఎం చంద్రబాబునాయుడుకు శుక్రవారం వివరించనున్నా మన్నారు. బెంగళూరులో ఇందిరా క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించార న్నారు. బెంగళూరు తరహాలో ఏపీలోనూ అన్న క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలో మొదటి విడతగా ప్రారంభించ నున్న 200 అన్న క్యాంటీన్లకు సొంత భవనాలు సమకూర్చనున్నామన్నారు. కూలీలు, కార్మికులకు అందుబాటులో ఉండేలా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికీ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయబోయే ప్రాంతాలను అధికారులు గుర్తించారని మంత్రి నారాయణ తెలిపారు.



రాజీనామాలు చేసేందుకేనా ప్రజలు గెలిపించింది?

విశాఖపట్నం ఎంపీ కంభంపాటి హరిబాబు



విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : ప్రత్యేక హోదా ఇవ్వకపోతే తమ ఎంపీలు రాజీనామా చేస్తారని ప్రతిపక్ష వైకాపా పార్టీ అధినేత జగన్ చేసిన వాఖ్యలపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు ఘాటుగా స్పందించారు. ఐదు సంవత్సరాలు పాలించమని ప్రజలు ఓట్లేస్తే ముందే ఎందుకు రాజీనామా చేస్తామంటున్నారో సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను ప్రధాని మోదీ అమలు పరుస్తున్న సమయంలో ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తామని జగన్ ప్రకటించడం సమంజసంగా లేదని హరిబాబు విమర్శించారు.

కొత్త నాటకానికి జగన్ తెరతీశారు

టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

విజయవాడ, సూర్య ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించకపోతే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల చివరి రోజున తమ పార్టీ లోక్‌సభ సభ్యులు రాజీనామా చేస్తారని ప్రకటించడం ద్వారా వైసీపీ అధినేత జగన్ కొత్త నాటకానికి తెరతీశారని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. టీడీపీ బయటకు వస్తే బీజేపీతో ఆయన చేతులు కలిపే ప్రయత్నం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. జగన్‌కు ప్రత్యేక హోదా గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. జగన్ పార్టీకి అసలు అజెండానే లేదని మండిపడ్డారు.

బాబుపై ఉన్న కేసుల వల్లే ఏపీకి ఈ దుస్థితి

కాంగ్రెస్ నేత సి.రామచంద్రయ్య



కడప, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై ఉన్న కేసుల వల్లే ఏపీకి ఈ దుస్థితి వచ్చిందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సి. రామచంద్రయ్య ఆరోపించారు. ప్రత్యేక హోదా అంశం ఏపీ ప్రజల అజెండాగా మారిందని, కేంద్రం వైఖరికి నిరసనగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా కేంద్రంలో రామచంద్రయ్య మీడియాతో మాట్లాడారు. "ప్రజల అజెండాగా మారిన ప్రత్యేక హోదాపై రెండుసార్లు అసెంబ్లీలో తీర్మానం చేసినా ప్రయోజనం లేకపోయింది. వైఎస్ జగన్ తన పార్టీ ఎంపీలతో రాజీనామా చేయించాలని తీసుకున్న నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ మద్ధతు ఇస్తుంది. మొదటి నుంచీ విభజన హామీల్లో పేర్కొన్న అంశాలను తీర్చాలని కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంది. ప్రత్యేక హోదా అంశంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కోటి సంతకాలను సేకరించాం. మొదటి నుంచి కూడా ఏపీ రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపిస్తూనే ఉంది. హోదా వద్దు ప్యాకేజీ ముద్దు అంటున్నారే తప్ప దాని వల్ల కలిగే లాభాలను మాత్రం ఎందుకు చెప్పడం లేదు. పెళ్లిల్లో అరుంధతి నక్షత్రం మాదిరిగా ప్రత్యేక ప్యాకేజీ కూడా అలాగే ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు తాను తెచ్చినన్ని నిధులు ఏ రాష్ట్రానికి కేంద్రం ఇవ్వలేదని చంద్ర బాబు చెప్పడం నిజం కాదా, ఇప్పుడు ఆ మాటలు ఏమయ్యాయి. విభజన హామీల కోసం అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని పోకుండా ఒక్కడే పోయి ఏం తెచ్చి పెట్టాడో చంద్రబాబుకే తెలియాలి, సీఎం చంద్రబాబు ఇంతవరకూ అఖిలపక్షం నిర్వహించక పోవడం దారుణం. హోదా కోసం వైసీపీ ఎంపీలు రాజీనామాలు చేస్తుంటే ఆ అంశంపై సైతం దుష్ప్రచారం చేయడం శోచనీయం. నిజం చెప్పాలంటే చంద్రబాబుపై ఉన్న కేసుల వల్లే ఏపీకి ఈ గతి పట్టింది. చంద్రబాబు తనపై ఉన్న కేసుల భయంతోనే కేంద్రాన్ని ఏ విషయంలోనూ ప్రశ్నించడం లేదు.

మంత్రుల ముప్పేట దాడి


- జగన్‌పై విరుచుకుపడిన టీడీపీ నేతలు
- పార్లమెంట్ సమావేశాలు ముగిసేదాకా ఎందుకు
- దమ్ముంటే ఇప్పుడే రాజీనామాలు చేయించాలి



అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే వైసీపీ ఎంపీలు రాజీనామా చేస్తారన్న ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ నేతలు మండిపడ్డారు. రాజీనామాల పేరుతో జగన్ డ్రామాలాడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత రాజీనామాలు ఎందుకని, దమ్ముంటే ఇప్పుడే రాజీనామాలు చేయించాలని వారు డిమాండ్ చేశారు. ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ముందు, వెనుక ఆలోచన చేయకుండా జగన్ అనాలోచిత ప్రకటన చేస్తుంటారని మండిపడ్డారు. రెండేళ్ల క్రితం కూడా ఇలాగే తన ఎంపీలతో రాజీనామాలు చేయిస్తామని ప్రకటించారని, ఆ మాట నిలబెట్టుకోలేదని జేసీ ఎద్దేవా చేశారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే చెప్పిన మాట ప్రకారం ఈ నిముషాన తన ఎంపీలను ఢిల్లీకి పంపించి రాజీనామాలు చేయాలని సవాల్ చేశారు. కల్ల బొల్లి కబుర్లు చెప్పి జగన్ ప్రజలకు గంతలు కట్టి మోసం చేస్తున్నారని జేసీ తీవ్ర స్థాయిలో విమర్శించారు. నిజంగా జగన్‌కు ప్రజల్లోకి వెళ్లాలని ఉంటే, ఈ విషయం ప్రచారం చేయాలని ఉంటే, ఇవాళ రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్లాలని జేసీ సవాల్ చేశారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ తమ ఎంపీలు పార్లమెంట్‌లో పోరాడుతుంటే ప్రధాని మోడీ రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడుతుండగా అప్పటి వరకు అక్కడే ఉన్న వైసీపీ ఎంపీలు ఎందుకు పారిపోయారని ఆయన ప్రశ్నించారు. అప్పుడు ప్రధాని ఎదుట హోదా కోసం ఎందుకు ఆందోళన చేయలేదని రామ్మోహన్ నిలదీశారు. ఈ రోజున జగన్ చేస్తున్న పాదయాత్రకు ఎలాంటి స్పందన లేకపోవడంతో ఏదో ఒక జిమ్మిక్కు చేయాలనే ఉద్దేశంతో రాజీనామాల అంశం తెరపైకి తీసుకువచ్చారని ఆయన విమర్శించారు. పార్లమెంట్ ప్రారంభానికి ఇంకా 20 రోజుల సమయం ఉందని, ఈ లోపల జగన్ ఎన్ని సార్లు మాట మారుస్తారో ప్రజలు చూస్తారని ఆయన అన్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాలు అయిన తర్వాత తమ ఎంపీలు రాజీనామాలు చేస్తారని ఎందుకు అన్నారంటే ఏడాది ముందు రాజీనామాలు చేస్తే ఎన్నికలు రావు కాబట్టి జగన్మోహన్ రెడ్డి ఈ నాటకానికి తెరతీశారని విమర్శించారు. ఏదైన ఒక అంశంపై రాజీనామా చేస్తే పార్లమెంట్ గానీ, అసెంబ్లీగానీ ఆమోదించదని ఆయన అన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేదు కాబట్టే తమ ఎంపీలు రాజీనామా చేస్తారని జగన్ ప్రకటించారని అంటే అది చెల్లని చీటిగా అచ్చెన్నాయుడు అభివర్ణించారు. ఆ విషయం తెలుసు కాబట్టే ఈ నాటకం ఆడారని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబు గట్స్ ఉన్న నాయకుడని, అవసరమైతే రాష్ట్ర ప్రయోజనాలకోసం తామంతా రాజీనామాలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 5న పార్లమెంట్ సామావేశాలు ముగిసిపోతుంటే 6న రాజీనామాలు చేయడమేమిటని ప్రశ్నించారు. జగన్‌కు దమ్ముంటే 5వ తేదీ లోపల చేయాలని సవాల్ చేశారు. జగన్ డ్రామాలతో తమకు పనిలేదని, జగన్‌ది ఒక పార్టీ అని తాము అనుకోవడం లేదని, అధికార పార్టీ అయినా, ప్రతిపక్షమయినా తామేనని, ఏపీలో ప్రతిపక్షం లేదని అన్నారు. జగన్‌కు ఉన్న కేసుల నుంచి బయడపడడానికి ఎక్కడ ఎవరి కాళ్లు పట్టుకోవడం తప్ప మరొకటి లేదని మంత్రి అన్నారు.


కొత్త నాటకానికి తెరతీసిన జగన్

ఏపీ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు



వెలగపూడి, సూర్య సచివాలయ ప్రతినిధి : ప్రత్యేక హోదా కోసం ఎంపీలతో రాజీనామా చేయిస్తానంటూ వైసీపీ అధినేత జగన్ కొత్త నాటకానికి తెరదీశారని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వకపోతే ఎంపీలు రాజీనామా చేస్తారని 2016లోనే జగన్ ప్రకటించాడని, ఆ తర్వాత మూడు బడ్జెట్లు వచ్చినా రాజీనామా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అమరావతిలోని సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగితే వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి బాగుందంటూ ఢిల్లీలో కితాబివ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. వైకాపా ఎంపీలు ఢిల్లీలో ఓ మాట, ఇక్కడ ఓ మాట మాట్లాడుతున్నారని విమర్శించారు.

క్రీమీలేయర్ విధానాన్ని ఎత్తివేయాలి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లలో తీరని అన్యాయం జరుగుతోందన్నారు కాంగ్రెస్ సీనియర్‌నేత, ఏఐసీసీ కార్యదర్శి వీ.హన్మంతరావు అన్నారు. ప్రస్తుతం 27శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని చెబుతున్నా, వాటిలో బీసీలకు చేరేది మాత్రం కేవలం తొమ్మిది శాతం రిజర్వేషన్లు మాత్రమేనని తెలిపారు. అత్యంత వెనుకపడిన కులాలు అంటూ బీసీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ మరింత అన్యాయం చేస్తున్నారని వీహెచ్ విమర్శించారు. క్రీమిలేయర్ నిబంధనలతో బీసీల పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికై ప్రధాని మోదీ బీసీలపై ఉన్న క్రీమిలేయర్ నిబంధనలు ఎత్తివేయాలని వీహెచ్ డిమాండ్ చేశారు.



ఆ మంత్రికి ఒళ్లు పెరిగింది బుద్ధి మాత్రం పెరగలేదు : వైసీపీ నేత జోగి రమేష్

విజయవాడ, మేజర్‌న్యూస్ : అధికార టీడీపీ ఓ డ్రామాల పార్టీ అని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవితామంతా వెన్నుపోటు, డ్రామాలు, అవినీతేనంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత జోగి రమేష్ మండిపడ్డారు. విలువలు, విశ్వసనీయత కోసం సోనియా గాంధీని ఎదురించిన వ్యక్తి వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడికి ఒళ్లు పెరిగింది, కండలు పెంచారు బుద్ధిమాత్రం పెరగలేదని, అందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. విజయవాడలో జోగి రమేష్ బుధవారం మీడియాతో మాట్లాడారు. "బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుంచి చంద్రబాబు కోపంతో ఉన్నారు. కూర్చీలోంచి లేచి పడిపోతున్నారు. మరోవైపు టీడీపీ ఎంపీలు పగటి వేషగాళ్లలాగ పార్లమెంట్లో కనిపించడం హాస్యాస్పదంగా ఉంది. పార్టీ అధినేత వైఎస్ జగన్ సూచన మేరకు వైసీపీ ఎంపీలు ఏడాదికిపైగా పదవీ కాలాన్ని ప్రత్యేక హోదా సాధన కోసం తృణప్రాయంగా వదులుకునేందుకు నిర్ణయించుకున్నారు. అదే సమయంలో టీడీపీ ఎంపీలు మాత్రం పదవులను పట్టుకుని వేలాడుతున్నది వాస్తవం కాదా. చంద్రబాబుకు, వైఎస్ జగన్‌కు మధ్య నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తించాలి. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచి ప్రాణాలు పోయేందుకు కారణమైన వ్యక్తి చంద్రబాబు. అచ్చెన్నాయుడుకు ఈ విషయాలు తెలియదా. వైఎస్ జగన్ ప్రకటనతో సీఎం చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ప్రత్యేక హోదా కావాలనుకుంటే జగన్ వెంట ప్రయాణించండి. వద్దనుకునేవాళ్లు చంద్రబాబుతో ఉండండి." అని జోగి రమేష్ సూచించారు.

రబీలో 13 లక్షల ఎకరాలకు సాగు నీరు

- శ్రీరాంసాగర్ , నాగార్జునసాగర్, నిజాంసాగర్ రబీ ఆయకట్టుపై సమీక్ష
- ప్రాజెక్టుల కింద మొత్తం 19 లక్షల ఎకరాలకు రబీలో సాగునీరు
- పకడ్బందీగా నీటి నిర్వహణ
- చివరి భూములకు నీరు అందించాలి
- నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని జలాశయాల నీటి నిల్వలను కాపాడు కోవాలి
- మంత్రి హరీశ్‌రావు


హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : రబీ లో శ్రీరాంసాగర్ , నాగార్జున సాగర్ , నిజాంసాగర్ ప్రాజెక్టుల కింద నీటి నిర్వహన , సాధించిన ఆయకట్టు , మిషన్ భగీరత అవసరాలు తదితర అంశాలను సంబందిత చీఫ్ ఇంజనీర్లు , సూపరింటెండింగ్ ఇంజనీర్లతో బుధవారం నాడు జలసౌధలో మంత్రి సమీక్షించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద రబీలో ఎల్ఎండి కి ఎగువన 4 లక్ష ఎకరాలకు, ఎల్ఎండి కి దిగువన 1. 15 లక్షల ఎక్రాలకు సాగు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఈ లక్ష్యాలను సాధిస్తూనే మిషన్ భగీరత పథకానికి కేటాయించిన నీటిని జలాశయాల్లో కాపాడుకోవాలని మంత్రి ఇంజనీర్లకు సూచించినారు. శ్రీరామ్ సాగర్ జలాశ్యామ్ నుండి ఇప్పటితే 7 తడులకు నీరిచ్చామని మరో నాలుగు తడులకు నీరివ్వాల్సిన అవసరం ఉన్నని శ్రీరాంసాగర్ చీఫ్ ఇంజనీర్ శంకర్ మంత్రికి తెలిపినారు. ఎల్ఎండి కి పైన ఉన్న 4 లక్షల ఎకరాలకు చివరి భూములకు కూడా నీరు అందించేందుకు పకడ్బందీగా చర్యలు తెసుకుంటున్నామని ఆయన



తెలిపినారు. ఎల్ఎండి కి ఎగువన కాలువపై 31 85 పంపులు నడుస్తున్నాయని మంత్రికి తెలిపినారు. అట్లాగే శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్న చెరువులను కూడా నింపుతున్నామని శంకర్ తెలిపారు. శ్రీరాంసాగర్ జలాశయంలో 10 టిఎంసి ల నీరు ఉందని. మరో నాలుగు తడులకు 4 టిఎంసి ల నీరు అవసరమని మిగతా 6 టిఎంసి నీటిని మిషన్ భగీరత అవసరాలను వినియోగిద్దామని చీఫ్ ఇంజనీర్ మంత్రికి తెలిపారు. ఏప్రిల్ 16 కు ఎస్ఆర్ఎస్పి కాలువ మూసివేయాల

నాగార్జునసాగర్ కింద రబిలో 5 లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి అన్నారు. పాలేరు కు ఎగువన 3 లక్షల ఎకరాలు , పాలేరు దిగువన 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 32 టిఎంసి , నాగార్జున సాగర్ జలాశయంలో 30 టిఎంసి లు మొత్తం 72 టిఎంసి ల నీటి లభ్యత ఉందని ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ సునీల్ తెలిపారు. ఇప్పటివరకు శ్రీశైల , నాగార్జునసాగర్ కాంప్లెక్స్ నుంచి మొత్తం 126 టిఎంసి లు వినియోగించుకున్నామని , ఆంధ్రప్రదేశ్ 299 టిఎంసి లు వినియోగించుకుందని ఈఎన్సీ తెలిపారు. నిజాంసాగర్ కింద రబిలో 2 లక్షల ఎకరాల లక్ష్యాన్ని సాధించాలని అదికారులకు ఆదేశించినారు. గత సంవత్సరం కూడా రబీ లో అద్భుత ఫలితాలు సాధించామని , ఈ ఏడు కూడా అటువంటి ఫలితాలు సాధించాలని మంత్రి ఆదేశించినారు. గతం రబీ లో 2 లక్షల ఎకరాల లక్ష్యాన్ని సాధించిన సందర్భాలు లేవని మంత్రి అన్నారు. ఖరీఫ్ లో 1.12 లక్షల ఏకరాకు సాగు నీరు అందించి పంటలను కాపాడినట్టు మంత్రి తెలిపినారు. రబీ లో రాష్ట్రం లో శ్రీరాంసాగర్ కింద 6 ల్యక్షలు , నాగార్జునసాగర్ కింద 5 లక్షలు, నిజాంసాగర్ కింద 2 లక్షలు, మీడియం పాజెక్టులకింద 6 లక్షల ఎకరాలకు మొత్తం 19 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని మంత్రి తెలిపినారు.

రాజధాని నిర్మాణ పనుల పర్యవేక్షణకు డ్రోన్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాజధాని నిర్మాణ పనులలో వేగం పెంచాలని, చేపట్టిన ప్రతి పనిని నిర్ణిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా నిర్మాణ సంస్థలను నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. గృహనిర్మాణం, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సకాలానికి పూర్తి చేయడంలో ఎవరైనా విఫలమైతే ఉపేక్షించనని స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులు, సర్వీస్ ప్రొవైడర్లతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ సహకారం తీసుకుని 15 రోజులకు ఒకసారి డ్రోన్లతో తీసిన చిత్రాలను తనకు చూపించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. చేపట్టిన పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తి చేస్తేనే పెట్టుబడిదారులు ముందుకు వస్తారని అన్నారు. పనులకు సంబంధించిన యంత్రసామాగ్రి, మెటీరియల్ విషయంలో ఇబ్బందులు ఉంటే ఎప్పటికప్పుడు తెలియజేయాలని చెప్పారు. పనులు జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, అమరావతి అభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో గొర్రెల పశుగ్రాసం కొరత లేకుండా చూడాలి : మంత్రి తలసాని



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రానున్న వేసవిలో గొర్రెలకు గ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. 70 ఏళ్లుగా పేదరికంలో ఉన్న పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖలు తెలంగాణ ఏర్పడినంక ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో ధనిక శాఖలుగా మారాయన్నారు. గొర్రెల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగు తోందని చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల గొర్రెలు పంపిణీ చేశామన్న ఆయన, 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నమని పేర్కొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద గ్రామాల్లో గొర్రెలకు నీటి తొట్ల నిర్మాణం చేపట్టాలని తలసాని అధికారులకు సూచించారు. 90 శాతం సబ్సిడీపై గొర్రెల షెడ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు చేయూతనిచ్చిందుకు ఈ ఏడాది 51 కోట్ల చేప పిల్లలను రిజర్వాయర్లు, చెరువుల్లో వదిలినట్లు వెల్లడించారు. ప్రయోగాత్మకంగా 11 రిజర్వాయర్లలో రొయ్యల పెంపకం చేపట్టినమన్నారు. చేపల విక్రయాల కోసం హోల్‌సేల్, రిటైల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

వైభవోపేతంగా చక్రధారుడి చక్రస్నానం

తిరుపతి, సూర్య ప్రతినిధి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన బుధవారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరిగింది. అనంతరం పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. అర్చకులు, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున స్నానాలు ఆచరించారు. అంతకుముందు ఉదయం 6.30 నుండి 7.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుండి 10.00 గంటల వరకు పుష్కరిణి ఎదురుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసువు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమయుక్తంగా స్నపనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపనిషత్తు మంత్రములు, దశశాంతి మంత్రములు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రములు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానము చేసే వేదాలను టిటిడి వేదపారాయణదారులు పారాయణం చేశారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. తొమ్మిదిరోజుల ఉత్సవాలలో జరిగిన అన్ని సేవలూ సఫలమై – లోకం క్షేమంగా ఉండడానికీ, భక్తులు సుఖశాంతుల్తో ఉండడానికీ – చక్రస్నానం నిర్వహించారు. ఉత్సవాలు ఒక యజ్ఞమే కనుక యజ్ఞాంతంలో అవభృథస్నానం' చేస్తారు. యజ్ఞనిర్వహణంలో జరిగిన చిన్నచిన్న లోపాలవల్ల ఏర్పడే దుష్పరిణామాలు తొలగి, అన్నీ సంపూర్ణ ఫలాలు చేకూరడంకోసం చేసే దీక్షాంత స్నానం అవభృథం. చక్రస్నానం (అవభృథం)లో శ్రీవారి సుదర్శనచక్రంకు (చక్రత్తాళ్వార్‌కు) పుష్కరిణిలో స్నానం నిర్వహించే ముందు శ్రీభూసమేతమలయప్పమూర్తికి 'స్నపన తిరుమంజనం' నిర్వహించారు. తర్వాత సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణీజలంలో ముంచి, స్నానం చేయించారు. ఆ దివ్యాయుధ స్పర్శవల్ల పవిత్రమైన పుష్కరిణీజలంలో భక్తసమూహం కూడా అదే సమయంలో స్నానం చేశారు. ఇందువల్ల ఈ ఉత్సవాలు చేసినవారికి, చేయించినవారికి, ఇందుకు సహకరించినవారికీ, దర్శించిన వారికీ, అందరికీ ఈ ఉత్సవయజ్ఞఫలం లభిస్తుంది. చక్రస్నానంనాటి సాయంకాలం ధ్వజావరోహణం యథావిధిగా చేస్తారు. ఇంతటితో బ్రహ్మోత్సవయజ్ఞం మంగళాంతం అవుతుంది. ఎవరైతే బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకొంటారో వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారు. విషమృత్యు నాశనం, రాజ్యపదవులవంటి సకల ఐహిక శ్రేయస్సులు పొందుతారు. పరాంతకాలం వరకూ ఎటువంటి జనన, మరణ వికారములు లేకుండా సర్వలోకాలలో యథేచ్ఛగా విహరిస్తూ బ్రహ్మానందాన్ని పొంది శాశ్వతమైన విష్ణులోకాన్ని చేరుకుంటారు. ఈ సందర్భంగా టిటిడి తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పోలా భాస్కర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి చేసిన అన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా సాయంత్రం 6.00 నుండి రాత్రి 7 గంటల వరకు తిరుచ్చి ఉత్సవం జరిగింది. రాత్రి 7గంటల నుండి 8 గంటల మధ్య ధ్వజావరోహణం నిర్వహించారు. ధ్వజావరోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో టిటిడి స్థానిక ఆలయాల ఉపకార్యనిర్వహణాధికారి వెంకటయ్య, సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, ప్రధాన కంకణబట్టార్ బాలాజీ రంగాచార్యులు, ఏఈ నాగరాజు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల విశేషాలు ఇవీ : ఆలయంలోని పోటులో రోజుకు 20 వేల నుంచి 25 వేల మంది భక్తులకు ఎనిమిది రకాల ప్రసాదాలు తయారుచేసి పంపిణీ చేశారు. టిటిడి అన్నప్రసాదం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఐదు వేల మందికి సాంబారు అన్నం, పెరుగన్నం, పాలు, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. టిటిడి ప్రజాసంబంధాల విభాగం ఆధ్వర్యంలో మీడియా సెంటర్ ఏర్పాటుచేసి బ్రహ్మోత్సవాల విశేషాలను మీడియా ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు అందజేశారు. రోజుకు 150 మంది చొప్పున శ్రీవారి సేవకులు భక్తులకు సేవలందించారు. టిటిడి వైద్య విభాగం ఆధ్వర్యంలో రోజుకు వెయ్యి మందికి, ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో రోజుకు వెయ్యి మందికి వైద్యసేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తొమ్మిది రోజులకు గాను 60 టన్నుల పుష్పాలు వినియోగించారు. 80 మంది సిబ్బంది నిరంతరాయంగా సేవలందించారు. స్నపనతిరుమంజనం, వసంతోత్సవం లాంటి ప్రత్యేక సందర్భాల్లో బెంగళూరు, చెన్నై నుంచి వివిధ రకాల పుష్పాలతో రూపొందించిన మాలలు తెప్పించారు. ఆలయంలో ప్రతిరోజూ 113 మంది పారిశుద్ధ్య కార్మికులతో ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచారు.

మలక్‌పేట యశోద ఆస్పత్రిలో మరో ఘోరం

బాలింత మృతి, బంధువుల ఆందోళన

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : మలక్‌పేట యశోద ఆస్పత్రిలో మరో ఘోరం జరిగింది. వారం రోజుల క్రితం ఓ మహిళ ప్రసవానికి వచ్చింది. నాలుగు రోజుల క్రితం పండంటి బాబుకు జన్మనిచ్చింది. ఆరోగ్యంగా ఉన్న ఆమె బుధవారం చనిపోయిందని చెప్పడంతో కుటుంబసభ్యులు ఆశ్చర్యానికి గురై.. ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. వివరాలు..మిర్యాలగూడకు చెందిన ప్రవీణ్, బిల్గేట్ హాచార్ భార్య,భర్తలు. వారం క్రితం డెలివరీ నిమిత్తం మలక్‌పేట్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి వచ్చారు. బిల్గేట్ హాచార్ 4 రోజుల క్రితం పండంటి బాబుని ప్రసవించింది. ఆరోగ్యంగా ఉన్న బిల్గేట్ హాచార్ బుధవారం చనిపోయిందని చెప్పడంతో బంధువులు ఆశ్చర్యపోయారు. ఇప్పటికే రూ.10 లక్షలు కట్టించుకున్నారని, అకస్మాత్తుగా చనిపోయిందని చెప్పడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో బిఎల్ఎఫ్ ఒంటరి పోరే : తమ్మినేని

హైదరాబాద్, మేజర్‌న్యూస్: వచ్చే ఎన్నికలల్లో ఏ పార్టీతో పొత్తు ఉండదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నల్లగొండలో తమ పార్టీ రాష్ట్ర సభలు విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. ఈ సభల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విధానాలు, రాష్ట్ర రాజకీయ పార్టీల పరిస్థితి తదితర అంశాలపై చర్చించినట్లు చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన విషయాలపై సీఎం కేసీఆర్ నోరు విప్పడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పతాక స్థాయికి చేరుకున్న మాటల యుద్ధం

- నువ్వా, నేనా అన్నట్లు వ్యవహరిస్తున్న టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు
- బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యోదంతం అనంతరం ఊపందుకున్న మాటల యుద్ధం
- మంత్రి కేటీఆర్ విసిరిన సవాల్, మీడియా ఇష్టాగోష్ఠిలో చేసిన వ్యాఖ్యలతో పతాక స్థాయి
- కేటీఆర్ విమర్శలకు స్పందించిన ఉత్తమ్, జానా, కోమటిరెడ్డి





హైదరాబాద్, మేజర్‌న్యూస్ : అధికార టీఆర్ఎస్, ప్రధానప్రతిపక్షం కాంగ్రెస్‌నేతల మధ్య ఇటీవల మాటలయుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. నల్గొండ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త శ్రీనివాస్ హత్య అనంతరం, గద్వాల బహిరంగసభ వేదికగా రాష్ట్ర మున్సిపల్, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ చేసిన సవాల్ నేపథ్యంలో ఒకరిపై మరొకరు తీవ్రస్థాయి విమర్శలు గుప్పించుకుంటూనే, సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. నల్గొండ పట్టణ కాంగ్రెస్‌నాయకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య అధికారపార్టీ నేతలు, నకిరేకల్ ఎమ్మెల్యే నోముల వీరేశం కనుసన్నల్లోనే జరిగిందని కాంగ్రెస్‌నేతలు ఆరోపించారు. హత్య రాజకీయాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సాహిస్తున్నారని మాజీమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. మంత్రి జగదీష్‌రెడ్డి ప్రోదల్బంతోనే నోముల వీరేశం, స్థానిక పోలీసు ఉన్నతాధికారులు శ్రీనివాస్ హత్యకు పథకరచన చేశారని కోమటిరెడ్డి ఆరోపించగా, మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌లు కాంగ్రెస్‌నేతలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకు పాల్పడిన నిందితులు గతంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో



సన్నిహితంగా ఉన్నవారేనంటూ ప్రత్యారోపణ చేశారు. శ్రీనివాస్ హత్యనంతరం రెండుపార్టీల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధాన్ని, గద్వాల బహిరంగసభ వేదికగా మంత్రి కేటీఆర్ విసిరన సవాల్ పతాకస్థాయికి తీసుకువెళ్లింది. రానున్నా ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలోకి రాకపోతే తాను రాజకీయసన్యాసం చేస్తానన్న కేటీఆర్, 70 స్థానాలు గెలుస్తామంటున్న టీ–పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, 70 స్థానాలు రాకపోతే రాజకీయసన్యాసం చేస్తారా? అంటూ సవాల్ విసిరారు. కేటీఆర్ సవాల్‌కు స్పందించిన ఉత్తమ్ తాను రె'ఢీ' అంటూనే, రానున్నా ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే తానే కాదు తన కుటుంబం పూర్తిగా రాజకీయసన్యాసం చేస్తామని ప్రతిసవాల్ విసిరారు. కాంగ్రెస్‌పార్టీ లోఫర్ పార్టీ అంటూ ఇటీవల మీడియా ఇష్టాగోష్టిలో మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. దానికితోడు తాను రాజకీయజీవితాన్ని పణంగా పెట్టి విసిరిన సవాల్‌ను ఉత్తమ్ స్వీకరించలేదంటూ విమర్శించారు. కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్‌నేతలు తీవ్రస్థాయిలో మండపడ్డారు. తమ పార్టీని లోఫర్ పార్టీ అన్న మంత్రి, తన తండ్రి అదేపార్టీలో రాజకీయ ఓనమాలు నేర్చుకున్న విషయాన్ని మర్చిపోయారంటూ ఎద్దేవా చేశారు. తమది లోఫర్ పార్టీ అంటున్న మిమ్మల్ని ఎవరైన బ్రోకర్ పార్టీ అంటే ఎలా ఉంటుందని సీఎల్పీనేత జానారెడ్డి ఎద్దేవా చేశారు. కేటీఆర్ సవాల్‌ను స్వీకరించేందుకు ఉత్తమే కాదు తామంతా సిద్ధమేనంటూ సీఎల్పీఉపనేత కోమటిరెడ్డి, మండలి విపక్షనేత షబ్బీర్‌అలీలు ప్రతిసవాల్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు మరో ఏడాది సమయం ఉన్న నేపథ్యంలో అధికార టీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ నేతలు నువ్వా, నేనా అన్నట్లు ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పించుకుంటూ రాజకీయవాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు.

ఏపికి ప్రత్యేక హోదా కోసం ఎంపిలు రాజీనామా చేయాలి

- నేషనల్ కమ్యూనిస్ట్ పార్టీ డిమాండ్
- ప్రత్యేక హోదా కోసం 28 న గుంటూరులో భారీ ర్యాలి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: .రాష్ట్ర విభజనతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని,విభజన సందర్బంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించి మోసం చేసారని నేసనల్ కమ్యునిస్ట్ పార్టీ (ఎన్.సి.పి)తెలుగు రాష్ట్రాల అధికార ప్రతినిధి సుంకరి కొండలు విమర్శించారు.బుధవారం హైదరాబాద్ లో మీడియా సమావేశం లో పార్టీ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి మందా భూషణం యునైటెడ్ బహుజన పోరాట సమితి(యుబిఎస్పి) కన్వీనర్ కే.తిరుపతి నాయుడు లతో కలిసి మాట్లాడారు.ప్రత్యేక హోదా విషయం లో బిజెపి, టిడిపి లు డ్రామాలడుతున్నాయని వారు విమర్శించారు.ప్రత్యేక హోదాకోసం అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఎంపి లు రాజీనామా చేయాలనీ వారు డిమాండ్ చేసారు.ప్రత్యేక హోదాకోసం ఎన్.సి.పి,యుబిఎస్పిల ఆద్వర్యం లో ఈ నెల 28 న గుంటూరు లో భారీ ర్యాలీ,సభను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.ప్రస్తుత పార్ల మెంట్ సమావాశాల్లో ప్రత్యేక హోదా కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్లమెంట్లో చేస్తున్న పోరాటాన్ని వారు అభినందించారు.ఏప్రిల్ 5 తేది లోపు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వని పక్షం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎంపి లు రాజీనామా చేస్తారని ఆ పార్టీ అద్యక్షులు జగన్ మోహన్ రెడ్డి ప్రకటించడాన్ని వారు స్వాగతించారు.జగన్ తరహాలోనే మిగతా పార్టీల ఎంపి లు తమ పదవులకు రాజీనామా చేస్తామని ప్రకటించాలని సుంకరి కొండలు డిమాండ్ చేసారు.కేంద్ర బడ్జెట్ లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందన్నారు.రాష్ట్రానికి నిధులకోసం డిల్లికి అఖిల పక్షాన్ని తీసుకెళ్లి కేంద్రం పై వత్తిడి చేయాలని వారు ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడిని డిమాండ్ చేశారు.ఈ సమావేశం లో పార్టీ కార్యవర్గ సబ్యులు నాగేశ్వర్ రావు,ఫై.ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ అభ్యర్థులు ఎవరో?

- టీఆర్ఎస్ వర్గాల్లో వాడివేడి చర్చ
- సామాజిక న్యాయానికి కేసీఆర్ పెద్దపీట
- ఒక్కొక్క సామాజికవర్గానికి ఒకస్థానం
- ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న పార్టీ నేతలు





హైదరాబాద్, మేజర్‌న్యూస్: త్వరలో జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులెవరన్న దానిపై అధికార పార్టీలో చర్చ మొదలైంది. ఖాళీ కానున్నా మూడు స్థానాలు అధికార టీఆర్ఎస్‌కే దక్కనున్నాయి. విపక్ష పార్టీలన్నీ కలిసినా రాజ్యసభ స్థానం దక్కించుకునే అవకాశం లేకపోవడంతో మూడు స్థానాలు అధికార టీఆర్ఎస్ ఖాతాలో చేరనున్నాయి. ఏప్రిల్‌లో పదవీ కాలం పూరయ్యే స్థానాలకు ఈ నెలాఖరు నాటికి నోటిఫికేషన్ వెలువడనున్నట్లు తెలుస్తోంది. దీంతో అధికార పార్టీలో ఆ మూడు స్థానాలు ఎవరికి దక్కుతాయన్న దానిపై వాడివేడి చర్చ కొనసాగుతుంది. మూడు స్థానాలను వివిధ సామాజిక వర్గాలకు కేటాయించాలన్న అభిప్రాయంతో ముఖ్యమంత్రి కేసిఆర్ ఉన్నట్లు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన యాదవులకు ఒక రాజ్యసభ స్థానాన్ని కేటాయిస్తామని కేసీఆర్ గతంలో ప్రకటించారు. దీంతో పార్టీలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు నేతల పేర్లు తెరపైకి వస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, నోముల నర్సింహయ్యతో పాటు రాజయ్య యాదవ్, మురళీ యాదవ్‌లలో ఒకరికి రాజ్యసభ స్థానం దక్కే అవకాశాలున్నాయన్న ప్రచారం జరుగు తోంది. పార్టీతో నిమిత్తం లేకుండా యాదవసంఘానికి ప్రాతినిధ్యం వహించే వారికి కూడా రాజ్యసభ స్థానాన్ని కట్టబెట్టే అవకాశాలున్నాయంటున్నారు. రానున్నా ఎన్నికల్లో యాదవులను పార్టీవైపు ఆకర్షించడానికి, యాదవ కులసంఘనేతలకు కట్టబెట్టాలన్న యోచనలో కూడా ముఖ్యమంత్రి ఉన్నట్లు సమాచారం. ఇక మరొక స్థానాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ సమీప బంధువు సంతోష్ కుమార్‌కు లేదంటే హోంమంత్రి నాయిని నర్సింహ రెడ్డికి కట్టబెట్టే అవకాశాలున్నాయని పార్టీవర్గాలు చెబుతున్నాయి. మరో స్థానాన్ని దళిత, మైనార్టీ వర్గాలకు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్సీ వర్గీకరణ ఉద్యమ నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. మొత్తానికి మూడు రాజ్యసభ స్థానాలకు చాలామంది ఇప్పటినుంచే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, దక్కుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

సంపాదకీయం

editpage@suryaa.com

“జమ్మూ కాశ్మీర్‌లో పరిస్థితులు అంతకంతకు ప్రభుత్వం చేతులు దాటిపోతున్నాయా? ఇటీవలి కాలంలో చోటు చేసుకుంటున్న ఉగ్రవాద దాడులు, వాటిలో సంభవిస్తున్న మరణాలు ఇందుకు సూచికలు అవుతున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో భద్రత పరిస్థితిని సరిదిద్దడంలోను, రాజకీయంగా వ్యవహరించడంలోను ప్రభుత్వం ఆలోచన తీరులో గాని, సామర్థ్యంలో గాని ఏదో లోపం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. శనివారం, సోమవారం మధ్య జమ్మూలోను, శ్రీనగర్‌లోను జరిగిన రెండు ఉగ్ర దాడులు పరిస్థితిని చక్కదిద్దడంలో అధికారంలో ఉన్నవారి నిస్సహాయతను తేటతెల్లం చేశాయనే అనాలి. కాశ్మీర్‌లో వివిధ వర్గాల మధ్య చర్చల నిర్వహణకు నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరాకరిస్తూ వస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ లాహోర్ పర్యటన అనంతరం జరిగిన పఠాన్‌కోట దాడి, ఆ తరువాత యూరి దాడి అసలు చర్చల మాట ఎత్తడమే తప్పు అనే ధోరణికి దారి తీశాయి. కాని భారత్, పాక్ దేశాల జాతీయ భద్రత వ్యవహారాల సలహాదారులు (ఎన్‌ఎస్‌ఎలు) ఎప్పటికప్పుడు భేటీలు జరుపుతూనే ఉన్నారు. అయితే, ఉభయ దేశాల ఎన్‌ఎస్‌ఎల మధ్య రహస్యంగా జరుగుతున్న చర్చలు రాష్ట్రంలో పరిస్థితులను ఎలా సరిదిద్దగలవనేది అంతు పట్టడం లేదు. జమ్మూ కాశ్మీర్‌లో భారతీయ జనతా పార్టీకి మిత్ర పక్షంగా ఉన్న పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పిడిపి) అధినేత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ శాసనసభలో మాట్లాడుతూ పాకిస్తాన్‌తో చర్చలు ప్రారంభించడమే సమస్యకు పరిష్కారమని తనను కొన్ని టెలివిజన్ చానెల్స్ ‘జాతి వ్యతిరేకి’గా అభివర్ణిస్తాయమోననే భయాం దోళన ను ఆమె వ్యక్తం చేశారు.”

కాశ్మీర్‌పై ప్రభుత్వం దారి ఎటు

జమ్మూ కాశ్మీర్‌లో పరిస్థితులు అంతకంతకు ప్రభుత్వం చేతులు దాటిపోతున్నాయా? ఇటీవలి కాలంలో చోటు చేసుకుంటున్న ఉగ్రవాద దాడులు, వాటిలో సంభవిస్తున్న మరణాలు ఇందుకు సూచికలు అవుతున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో భద్రత పరిస్థితిని సరిదిద్దడంలోను, రాజకీయంగా వ్యవహరించడంలోను ప్రభుత్వం ఆలోచన తీరులో గాని, సామర్థ్యంలో గాని ఏదో లోపం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. శనివారం, సోమవారం మధ్య జమ్మూలోను, శ్రీనగర్‌లోను జరిగిన రెండు ఉగ్ర దాడులు పరిస్థితిని చక్కదిద్దడంలో అధికారంలో ఉన్నవారి నిస్సహాయతను తేటతెల్లం చేశాయనే అనాలి. సుంజువాన్ సైనిక శిబిరంలోని కుటుంబ క్వార్టర్ల విభాగంలో 36 గంటల పోరాటం తరువాత ఆదివారం రాత్రి ముగిసింది. ఇక శ్రీనగర్ నడిబొడ్డున గల కరణ్ నగర్‌లోని సిఆర్‌పిఎఫ్ శిబిరంపై సోమవారం తెల్లవారు జామున ప్రారంభమైన ఉగ్ర దాడిని కూడా భగ్నం చేశారు. కాని ఒక జవాన్ ప్రాణాన్ని అందుకు పణంగా పెట్టవలసి వచ్చింది. అయితే, ఆ దాడికి తెగబడిన ఉగ్రవాదులు ఆ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనంలో నక్కారు. వారితో పోరు సోమవారం అంతా సాగింది.

జమ్మూ కాశ్మీర్‌లో భద్రత వలయం ఎంత లోపభూయిష్టంగా ఉన్నదో 2016 జనవరి 1న జరిగిన ఒక దాడి సూచించింది. పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై ఆ రోజున ఉగ్ర దాడి జరిగిన విషయం విదితమే. భద్రత లోపం విషయంలో జవాబుదారీతనం ఏదీ లేనట్లు కనిపిస్తోంది. సైన్యం, సిఆర్‌పిఎఫ్ కార్యాలయాలపై వరుసగా భారీ స్థాయిలో దాడులు జరగడంతో ప్రభుత్వం ప్రతి చర్యకు పూనుకోకతప్పలేదు. ఉగ్రవాదులను పంపుతున్న ఆయా సంస్థలను నిశ్చేష్టులను చేసేందుకు 2016 సెప్టెంబర్‌లో మన సైనిక దళాలను ఎల్‌ఒసి దాటించి ‘సర్జికల్ దాడులు’ చేయించింది ప్రభుత్వం. తమ సత్తా చాటేందుకు ఆ దాడుల గురించి తరువాత ప్రచారం చేసి లబ్ధి పొందేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం, బిజెపి ప్రయత్నించాయి. కాని వాస్తవ పరిస్థితులు వాటి తీరును అపహాస్యం చేశాయి. సైనిక పదజాలంలో ‘సర్జికల్ దాడి’ అంటే సుదీర్ఘ కాలంలో శత్రువు పీచమణచడం. కాని పాకిస్తాన్ సైన్యం దన్ను ఉన్న ఉగ్రవాదులు మరింతగా రెచ్చిపోయి దాడులకు దిగుతున్నారు.

జమ్మూ శివార్లలోని నగ్రోటాలో ఉన్న 15 కోర్ ప్రధాన కార్యాలయంపై దాడి అనంతరం భద్రత దళాల శిబిరాల పహరాలో లోటుపాట్లను సరిదిద్దేందుకు ఏర్పాటైన అధికారుల కమిటీ నివేదిక దుమ్ము కొట్టుకుపోతున్నట్లు తెలుస్తోంది. జమ్మూ కాశ్మీర్‌లో భద్రత పరిస్థితి ఎందుకు హీనంగా మారింది అని ప్రశ్నించినప్పుడల్లా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రముఖులు గడచిన సంవత్సరంలో అంతమొందించిన ఉగ్రవాదుల సంఖ్యను ఏకరవు పెట్టడం పరిపాటి అయింది. కాశ్మీర్ లోయ ఇది వరకు ఎన్నడూ లేనంత భద్రంగా ఉన్నదని, ప్రధాని ఉద్ఘాటనల ఫలితంగా ప్రపంచంలో పాకిస్తాన్ ‘ఏకాకి’గా మారిందని వారు చెబుతున్నారు. కాని ఆ మాటలు తప్పు అని, పక్కదారి పట్టిస్తున్నాయని వాస్తవం పరిస్థితులు సూచిస్తున్నాయి.

జమ్మూ కాశ్మీర్‌లో భారతీయ జనతా పార్టీకి మిత్ర పక్షంగా ఉన్న పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పిడిపి) అధినేత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ సోమవారం శాసనసభలో మాట్లాడుతూ పాకిస్తాన్‌తో చర్చలు ప్రారంభించడమే ఈ సమస్యకు పరిష్కారమని సూచించారు. అదే సందర్భంలో మెహబూబా ముఫ్తీ మరొక మాట కూడా అన్నారు. తాను అటువంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకు తనను కొన్ని టెలివిజన్ చానెల్స్ ‘జాతి వ్యతిరేకి’గా అభివర్ణిస్తాయమోననే భయాం దోళన ను ఆమె వ్యక్తం చేశారు. మెహబూబా ముఫ్తీ శాసనసభలో ఎంతో ఆవేదనతో ఆ విజ్ఞప్తి చేశారని విజ్ఞత ఉన్న ఎవరైనా గ్రహిస్తారు. కాని దురదృష్టవశాత్తు, ఆ విజ్ఞత అందరికీ లేదనిపిస్తోంది. అందుకే టివి చానెల్స్ ఇంటర్వ్యూలో ముఫ్తీ ఆ అభిప్రాయం వ్యక్తం చేశారు. తమ రాష్ట్రంలో పరిస్థితి మూడు విధాలుగాను క్షీణించిందనేది అందరి కన్నా ఆమెకే ఎక్కువగా తెలుసు. మొదటిది – వాస్తవాధీన రేఖ (ఎల్‌ఒసి) వద్ద కాల్పుల విరమణ ఒప్పందానికి పాక్ తూట్లు పొడవడం బాగా ఎక్కువైంది. రెండవది – సరిహద్దుకు ఆవలి వైపు నుంచి చొరబాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక మూడవది – 200 మందికి పైగా తీవ్రవాదులను పోలీసులు, భద్రతా దళాలు హతమార్చినప్పటికీ తీవ్రవాదుల దాడులు గాని, వారి సంఖ్య గాని తగ్గుముఖం పట్టలేదు. 2015లో రాష్ట్రంలో ప్రభుత్వ స్థాపన కోసం పిడిపి, బిజెపి సంకీర్ణాన్ని ఏర్పాటు చేసినప్పుడు భారత్– పాకిస్తాన్ చర్చలు జరపాలని అంగీకరించాయి. కాశ్మీర్‌లో శాంతి స్థాపనకు ‘సంబంధిత వ్యక్తులందరి’ మధ్య చర్చలు ప్రధానమని కూడా అవి ఒప్పుకున్నాయి. కాని కేంద్రంలోని ప్రభుత్వం వైఖరే అందుకు భిన్నంగా ఉన్నది. ‘అవ్వ బువ్వ రెండూ కావాలంటే కుదరదు’ అని ఉగ్రవాదం, చర్చల గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా కేంద్రం చెబుతుంటుంది. ఉగ్ర దాడులలోను, కాల్పుల విరమణ ఒప్పందానికి పాక్ తూట్లు పొడిచిన సందర్భాలలోను జవాన్లు, పౌరులు ప్రాణాలు కోల్పోతున్నప్పుడు, వాటిని దేశం నిస్సహాయంగా వీక్షిస్తున్నప్పుడు కూడా తానేమీ ధైర్యం కోల్పోవడం లేదని ప్రభుత్వం ఈ విధంగా సూచిస్తున్నట్లున్నది. చారిత్రకంగా కూడా కాశ్మీర్‌లో రాజకీయంగా చర్చలు వంటి ప్రక్రియలు ఏవీ చోటు చేసుకోనప్పుడు భద్రత పరిస్థితి మరింత దిగజారుతుంటుంది.

కాశ్మీర్‌లో వివిధ వర్గాల మధ్య చర్చల నిర్వహణకు నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరాకరిస్తూ వస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ లాహోర్ పర్యటన అనంతరం జరిగిన పఠాన్‌కోట దాడి, ఆ తరువాత యూరి దాడి అసలు చర్చల మాట ఎత్తడమే తప్పు అనే ధోరణికి దారి తీశాయి. కాని భారత్, పాక్ దేశాల జాతీయ భద్రత వ్యవహారాల సలహాదారులు (ఎన్‌ఎస్‌ఎలు) ఎప్పటికప్పుడు భేటీలు జరుపుతూనే ఉన్నారు. అయితే, ఉభయ దేశాల ఎన్‌ఎస్‌ఎల మధ్య రహస్యంగా జరుగుతున్న చర్చలు రాష్ట్రంలో పరిస్థితులను ఎలా సరిదిద్దగలవనేది అంతు పట్టడం లేదు.

కల్లోలం కానున్న కమలనాధుల కలలు

గొడవర్తి. శ్రీనివాసు
9963556696

- భారీ ఆర్థిక లోటుతో రెక్కలు తెగిన పక్షి ఆంధ్రప్రదేశ్
- హోదాని కాదని, ప్యాకేజి ఇచ్చిన బిజెపి అధినాయకులు
- కేటాయింపుల కోతలు తప్ప రూపాయలు విదిల్చని వైనం
- కేంద్రం నమ్మకద్రోహంపై భగ్గుమంటున్న ఏపి ప్రజలు
- దక్షిణాదిన బిజెపి బలపడటం అంత ఈజీ కాదు



విభజన గాయంతో, భారీ రెవెన్యూ లోటుతో రెక్కలు తెగిన పక్షిలా విలవిల్లా డుతున్న ఆంధ్రప్రదేశ్‌ని ముందుకు నడపగల నాయకుడు చంద్రబాబు మాత్రమేననే ఉద్దేశ్యంతోనే గత సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తెలుగుదేశానికి అధి కారం అప్పగించారు. అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు పాల నలో పొరపాట్లు, తడబాట్లైతే చాలా ఉన్నా, ప్రజావ్యతిరేకతకు తప్పిదాలైతే పెద్ద గా లేవనే చెప్పాలి. అధికారం వచ్చిన నాటి నుంచి పడినరాష్ట్రాన్ని పరుగులు పెట్టించేందుకు చంద్రబాబు చేస్తున్న కృషి, పడుతున్న తపన ప్రజలలో పాజి టివ్ ఫీలింగ్‌నే కలిగిరచింది. ప్రజల్లో కనిపిస్తున్న వ్యతిరేకత కేవలం ఎమ్మెల్యేల పై, పార్టీ నాయకుల మీదే. ముఖ్యమంత్రి అంత శ్రమ పడుతుంటే వీళ్లు సహక రించకపోగా, చెడ్డపేరు తెస్తున్నారన్న విమర్శలున్నాయి. లోటు బడ్జెట్‌తో విల విలలాడుతున్నా, సామాజిక పించన్లు,సంక్షేమ పథకాలు,కులాల వారీగా ఏర్పా టు చేసిన కార్పోరేషన్‌ల నుంచి పథకాలు పక్కాగా అమలవ్వడం ముదావహం. అయినా రాష్ట్ర బడ్జెట్‌ను మించిన అవినీతి ఈ ప్రభుత్వ హయంలో జరిగిపో తోందని ప్రతిపక్షాలు ప్రచారం చెయ్యడం విడ్డూరం. అందునా గత ప్రభుత్వా ల్లో మంత్రులుగా, చెలామణి అయ్యి, దోచుకున్నారన్న ముద్ర పడ్డ నేతలు అవినీతి ఆరోపణలు చేస్తుండటం మరీ విడ్డూరం.

ఇక కేంద్రంలో,రాష్ట్రంలో అధికార భాగస్వాములుగా ఉన్న టిడిపి, బిజెపి ల మధ్య సంబంధాలు పూర్తిగా కీ ణించి శృతిమించి రాగాన పడ్డాయి. దేశం నాయ కులు తమలపాకు తీరైతే, భా.జ.పా తలుపుచెక్కలా ఉంది. వార్డు మెంబర్లుగా గెలవలేనివారు కూడా జాతీయపార్టీ నాయకులుగా ఏదిపడితే అది అంటే మాట లు పడటానికి ప్రాంతీయ పార్టీలు సిద్ధంగా ఉండవు. బిజెపి కేంద్రంలో అధికా రంలో ఉన్నా పశ్చిమబెంగాల్, దక్షిణాదిన తమిళనాడు, కేరళ, ఒడిస్సా తెలుగు రాష్ట్రాల్లో బలం నామమాత్రమే. గత ఎన్నికల ముందున్న మోడీ మానియా లదనేందుకు చావు తప్పి కన్నులొట్టపోయిన చందంగా వచ్చిన గుజరాత్ ఫలి తాలు, రాజస్థాన్ ఉపఎన్నికల ఫలితాలు నిదర్శనం. ఈ క్రమంలో కాంగ్రెస్ నుంచి వచ్చి చేరిన నేతలు వాపును బలుపుగా చూపుతుండటంతో రాష్టంలో అధికార పార్టీని ఇబ్బంది పెట్టి తమ బలాన్ని పెంచుకోవాలని చూసింది. తెలుగు రాష్ట్రాలపై కన్నేసి ఎలాగైనా ఇక్కడ గెలిచి చూపాలన్న తీరుగనే లక్షలాది రూపాయలు కేటాయింపులు జరిపినా ప్రభుత్వం లెక్కలు చూపడంలేదంటూ స్థానిక నేతలతో పొగ రాజేసింది. కేటాయింపులకు, నిధుల అంజేతకు తేడాలున్నా, విభజన హామీలు పట్టని విధంగా వ్యవహరిస్తున్నారనేందుకు ఎన్నికల బడ్జెట్‌గా భావించే చివరి కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయం నిదర్శ నం. దీన్ని ప్రశ్నించాల్సిన కమలనాధులు ముఖ్యమంత్రినితూలనారే తప్ప, ప్రజ ల ముందుకొచ్చి చెప్పడంలే. నోట్లరద్దు ఆర్థికవ్యవస్థపై పెనుప్రభావం చూపితే జి.ఎస్.టి మరో పోటు పొడిచింది. దీంతో లోటుబడ్జెట్‌లో ఉన్న నవ్యాం ధ్ర కేం ద్రం నుంచి సహాయం ఆశించడం సర్వసాధారణం.


నిధులిస్తే మిత్రపక్షానికి లాభం ఒనగూరుతుందనే ఉద్దేశ్యంతో ఉత్తరాది రాష్ట్రాల్లో తాము నిదులిచ్చి నా రాష్ట్ర ప్రభుత్వాలు సద్వినియోగం చెయ్యలేదం టూ తాము అధికారంలోకి వచ్చినట్లు తెలుగురాష్ట్రాలలో అదే వ్యూహాన్ని అమ లు పరచాలనుకుంటున్నారు. కానీ దక్షిణాది రాష్ట్రాల్లో ప్రజలు రాజకీయ చైత న్యం ఉన్నవారన్నది గమనించాలి. హిందూత్వశక్తుల పునాదులపై, కాంగ్రెస్ వ్యతి రేకతతో అధికార సౌధాల్ని కట్టుకోన్న బిజెపీ స్వయబలం ఉన్న రాష్ట్రమంటూ దేశంలో లేదు. అటువంటిది ఏపిలో టిడిపి పొత్తు వల్లే ఎదగలేకపోతున్నామన్న బిజెపి చిత్రభ్రమలో ఉన్నారు. ఆ మధ్య వెంకయ్యనాయుడు వల్లే పార్టీ ఎదగ లేదని గంతులేసిన కొందరు నాయకులు ఆయన ఉపరాష్ట్రపతి అయ్యాక పార్టీ బలోపేతానికి చర్యలేపాటివి? తెలంగాణ, తమిళనాడుల్లో ఎందుకు వుంజు కోలేకపోతున్నారో ఎప్పుడైనా ఆత్మవిమర్శ చేసుకున్నారా? ఒక పక్క రాష్ట్రంలో అధికారం అందుకుంటునే ఉంటూనే మరో పక్క ప్రతిపక్ష వై.సి.పీని దువ్వుతుం డటాన్ని ప్రజలు గమనిస్తూనేఉన్నారు. అధికారపక్షాన్ని ఆడిపోసుకుంటే తాము బలపడిపోతామ నుకోవటం వ్యూహ వైఫల్యమే. అందుకే రాష్ట్రంలో బిజెపి నేతలు వైసీపీని, జగన్ బిజెపినీ కనీసం విమర్శించరు. సిఎంపై అవినీతి ఆరోప ణలు చేసే సోము వీర్రాజు అవినీతి ఆరోపణలతో కోర్టు కేసులెదుర్కుంటున్న ప్రతిపక్ష నాయకుడి ని జైలుకు పంపి అవినీతిరహిత పాలన అందిస్తామని చెప్పి ఉంటే మరోలా ఉండేది. కానీ జగన్ నుంచి మరిన్ని సీట్లు పొందాలన్న తీరు కమలం రాష్ట్ర నాయకులది. విపక్ష వైసిపి నుంచి వచ్చిన వారిని మంత్రివర్గంలో చోటిచ్చారని చంద్రబాబుని నిలదీస్తున్న బిజెపి నాడుశివసేనకు ఇష్టం లేకున్నా ఆ పార్టీ నాయకుణ్ణి తమలో చేర్చుకుని కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయిం చిన విష యాన్ని మరచిపోతే ఎలా? గోవా, మణిపూర్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో అడ్డదారిలో అధికారాన్ని అందుకోవటానికి చేసిన రాజకీయ విన్యా సాలు దేశ ప్రజ ల మనస్సుల్లోంచి చెరిగిపోలేదు. ఎదుటివారికి చెప్పటానికి మాత్రమే నీతులున్నాయన్న చందంగా ప్రవర్తిరచడం గురివింద చందమే.

ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వుంజుకుంటుంటే ఒక్కొక్క మిత్రపక్షాన్ని భారతీయ జనతా పార్టీ దూరం చేసుకుంటుండడం విడ్డూరం. గత సార్వత్రిక ఎన్నికల మాదిరిగా ఏకపక్ష ఫలితాలు ఈసారి వచ్చే అవకాశం లేనం దున కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు నమ్మకమైన మిత్రుల అవసరం ఎంతో ఉంది. ఇప్పటికే శివసేనను దూరం చేసుకున్న ఆ పార్టీ ఇప్పుడు తెలుగుదేశాన్ని దూరం చేసుకుంటే వచ్చే ఎన్నికల నాటికి దేశంలో మూడవ ప్రత్యామ్నాయాన్ని ఏర్పడినా ఆశ్చర్యపోఖ్ఖర్లే. ఇప్పటికే రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రంతో పోరాడుతున్న టిడిపికి అకాలీదళ్,శివసేన,తృణమూల నుంచే కాక కాంగ్రెస్ కూడా మద్దతుగా నిలుస్తోంది. ఈ క్రమంలో దేశంలో మరోమారు తృతీయ ప్రత్యామ్నాయం అంటూ ఏర్పడితే అంతిమంగా నష్టపోయేది బిజెపియేనని గుర్తెరగాలి. వామపక్షాలు,ఇతర లౌకిక శక్తులతో కూడిన దేశంలోని మూడవ పక్షాలన్నీ ఏకమైతే మరలా ఈ దేశంలో ఒకప్పటి సంకీర్ణ రాజకీయశకం మొద లవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే బిజెపి మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవటానికి, తృతీయ ఫ్రంట్‌తో జత కలిసేందుకు హస్తం పార్టీ వ్యూహరచన చేస్తుంది. మిత్రుల్ని ఆకట్టుకోవడంలో ఆ పార్టీ కున్న నైపుణ్యం సైతం అందుకు తప్పక ఉపకరిస్తుంది. ఒక్కొక్క మిత్రున్ని వదులుకుంటున్న భా.జ.పా వచ్చే ఎన్నికల్లో పూర్తి మెజారిటీ సాధించకపోతే మరలా ప్రతిపక్ష స్థానంలోకి మారక తప్పదు. మరి కాంగ్రెస్ ముక్త భారత్ కై కలలు కంటున్న ఆ పార్టీ అందుకు సిద్ధమేనా? ఆలోచించాల్సిందే!

ఐక్య ఉద్యమంతోనే ఆంధ్రాకు న్యాయం

కొలనుకొండ శివాజీ,
ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి, 9866200463

- జమిలి ఎన్నికలు ఇక లేనట్టేనంటున్న రాజకీయ పక్షాలు
- ఉప ఎన్నికల ఓటమితో ఉలిక్కి పడ్డ కమలనాథులు
- గుజరాత్‌లో సీట్లు శతకం దాటకపోవటంపై ఆశ్చర్యం
- ముందస్తుకు సిద్ధమై, ఆపై వెనక్కి తగ్గిన ప్రధాని మోడీ
- సొంత కూటమిలోని పార్టీలు దూరమయ్యే ఛాన్స్



అతిపెద్ద ప్రజాస్వామ్య భారత దేశంలో ప్రజాస్వామ్యానికి సుప్రీం ఎవ రంటే? పార్లమెంటు కన్నా మించింది లేనేలేదు...కోట్లాదిమంది భిన్న సంస్కృతులు విభిన్న సంప్రదాయాలు ఆచరించే ప్రజలు భారత రాజ్యాంగానికి కట్టుబడి పార్లమెంటు, ఇతర చట్ట సభలలో చేసే శాసనాలకు లోబడి తమ జీవి తాలను వెళ్ల దీస్తున్నారు. ప్రజామోదంతో అధికారంలోకి వచ్చే రాజకీయ పార్టీ లు సైతం పార్టీ పరంగా తమ సిద్ధాంతాలు ఆశయాలు ఏవైనా చట్ట సభలను గౌరవించాల్సిందే.. ఎన్నడూ లేని విధంగా పార్లమెంటులో చేసిన చట్టాన్ని కూడా గౌరవించని రీతిలో నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రస్తుత ఎన్డీఏ సర్కారు వ్యవహరించడం ఈ దేశ మనుగడకే ప్రమాదకరం. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి నప్పుడు రాజధాని కోల్పోయి 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌కు ఏ లోటు రానీయ కుండా యూపీఏ ప్రభుత్వం పార్లమెంటు ఆమోదంతో ఏర్పాటు చేసిన పున ర్వ్యవస్థీకరణ చట్టం ఇప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. మోడీ సర్కారు రాజకీయ ప్రయోజనాలతో ముడిపెట్టి ఐదుకోట్లమంది ఆంధ్రులతో ఆటలాడు తోంది. నాడు యూపీఏ సర్కారు తెలంగాణలో పరిస్థితులు చేయి దాటి పోతు న్న తరుణంలో అన్ని పక్షాలతో చర్చించి, వారిఆమోదంతో ఏపివిభజన జరిగింది. ఎన్నికలకు ముందు ఈ తంతు జరగడంతో మళ్లీ అధికారం కోసం చేశారన్న అపవాదు ఫలితంగానే కాంగ్రెస్ ఏపిలో గెలవలేక పోయింది. అయితేనాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ రాజ్యసభ సాక్షిగా ప్రత్యేక హోదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి, పోల వరం ప్రాజెక్టు నిర్మాణం వరాలను ప్రకటించడంలో భారతీయ జనతా పార్టీకి కాంగ్రెస్ పార్టీతో సమాన భాగస్వామ్యం ఉంది. అధికారంలోకి వచ్చేది మేమే.. విభజన చట్టాన్ని మీ కన్నా బ్రహ్మాండంగా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీని పార్లమెంటులో హేళన చేసి నాలుగేళ్లయింది.. కానీ ఏ బడ్జెట్‌లోనూ ఆంధ్ర ప్రదేశ్‌కు సాయంపై ఊసేలేదు. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆం.ప్ర.కు జరుగుతున్న అన్యాయంపై పార్లమెంటు లోపల బయటా పోరాడుతూనే వుంది. అయినా ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాట్లాడుతూ.. అడ్డగోలుగా విభజన చేశారంటూ ఆక్షేపించారు. నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా బీజేపీతో అంటకాగుతూ రాష్ట్రాన్ని ఉద్ధరిస్తున్నట్లు ఊదరగొట్టారు. రాష్ట్రంలో కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించిన ప్రతిసారీ విపక్షాన్ని అణగదొక్కడానికి యత్నించి కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా, ప్రత్యేక ప్యాకేజీ ద్వారా దానిని మించి లాభాలుంటాయని నమ్మబలికారు. ఆ మేరకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ చేత ప్రకటన చేయించారు. సంబంధిత నోట్‌ను కేంద్ర కేబి నెట్ ఆమోదించినా ఫలితం శూన్యం కావటంతో రాష్ట్రం అప్పుల పాలైంది. రాష్ట్ర ఆదాయం తగ్గుతుండటం, ఖర్చులు విపరీతంగా పెరగటం, దుబారా అవినీతి వెరసి రాష్ట్రం పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయింది. హోదా, ప్యాకేజీ, ప్రత్యేక సాయాల మాట దేవుడెరుగు.. కనీసం అన్ని రాష్ట్రాలతో పాటు అందా ల్సిన సాయం అందని పరిస్థితితెచ్చారు. ప్రభుత్వం నుంచి వైదొలగటం, రాజీనామా చేసి కేంద్రంపై వత్తిడి తీసుకురావడమనే మార్గాలున్నా...ఇచ్చిందే తీసుకుంటామన్న ధోరణిలో కేంద్రాన్ని అడుక్కునే విధానం ఎంచుకోవడం ఇలాంటి దారుణ పరిస్థితి ఏర్పడటానికి కారణం. ఇది మొత్తంగా ఐదుకోట్ల మంది ఆంధ్రుల్లో వున్న అభిప్రాయం. దీనికి తోడు ఈ మధ్య చంద్రబాబు నీడ లో తమకు రాజకీయంగా ఒరిగేది ఏమీ వుండదన్న ఉద్దేశంతో అమిత్ షా, మోడీ ద్వయం వివక్ష చూపి అంతిమంగా ఆం.ప్ర.కు తీవ్ర అన్యాయం చేసారు. చివరి బడ్జెట్‌లో సైతం మొండి చేయి చూపడం ఆంధ్రులలో ఒక్క సారిగా ఆగ్రహావేశాలకు కారణమైంది. ప్రజా సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు ఒక్క తాటి మీదకు వచ్చి తమ నిరసనగా రాష్ట్రబంద్ చేసారు. ఈ తరుణంలో ముఖ్య మంత్రి మరో రాజకీయ ఎత్తుగడకు తెరతీసి పార్లమెంటులో టీడీపీ ఎంపీల ఆం దోళన చేయించారు. తామంతా కరెక్టుగానే చేస్తున్నామని కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ, ప్రధానమంత్రి మోడీ వాదిస్తునే, ఆంధ్రప్రదేశ్ సహాయంపై తన వైఫల్యా ల ను కప్పి వుచ్చుకోవడానికి ఎన్నికల సభను మరిపించేలా కాంగ్రెస్ పార్టీపై ఎదు రు దాడి చేశారు. విభజన చట్టం తప్పుల తడక అంటూనే ఎందు కు సవరిం చలేకపోయారో? చెప్పరు. తిరుపతిలో వెంకన్న సాక్షిగా ఆంధ్ర ప్రదేశ్‌కు ఇచ్చి న వాగ్దానాల మాటేమిటి? మోడీ సర్కారు అనుచిత వైఖరి కారణంగా విభజన కు ముందు తెలంగాణలోని ఉద్యమ పరిస్థితులు,ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కని పిస్తున్నాయి. దేనికైనా తెగించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని భావిస్తున్న ఏపి సిఎం చంద్రబాబు మరో ఏడాదిలో ఎన్నికలు జరిగితే. రాజకీయంగా అడ్రస్ గల్లంతవుతుందన్న భయంతో ఢిల్లీ స్థాయిలో దేశం పార్టీ ఎంపీలతో డ్రామా లాడుతున్నారు. అప్పటి కేంద్రం అన్యాయం చేసింది.. ఇప్పటి కేంద్రం సరిదిద్దా లని చెబుతున్న చంద్రబాబు మంత్రులతో రాజనామాలెందుకు చేయించరు?

బీజేపీ ఆడుతున్న చదరంగంలో తెలుగుదేశం వైకాపాలు రెండూ పావులే. రాష్ట్రానికి మేలు చేస్తారని ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వీరు వమ్ము చేశారు. రాజకీయ ప్రయోజనాలే తప్ప రాష్ట్రం బాగు కోసం, భవిష్యత్తు తరాల కోసం ఉద్యమించకుండా ఒకరిపై ఒకరు కత్తులు దూసుకోవడం ఈ రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం. ఈ రాజకీయ అనైక్యతను ఆసరాగా చేసుకొని ఎవరితో ఉం టే ఎంత లాభమని బీజేపీ లెక్కలేస్తోంది. ఇప్పటికే నాలుగేళ్లు వృథా అయింది.. ఈ వంచన రాజకీయాలు భరించడానికి ప్రజలు సిద్ధంగా లేరు. తాడో పేడో తేల్చుకోవాలని భావిస్తున్నారు. ఈ సమయంలో బీజేపీ,టీడీపీ రాష్ట్రంలోని రాజ కీయపక్షాలు, మేధావులు, ఆర్థిక వేత్తలు, ప్రజాసంఘాల ప్రమేయం లేకుండా హోదా అంశాన్ని పక్కకు బెట్టి విభజన చట్టానికి అతీతంగా ఢిల్లీలో ప్యాకేజీలు తయారు చేస్తారా? దీనిని కాంగ్రెస్ పార్టీయే కాదు. యావత్ రాష్ట్ర ప్రజలు హర్షించడం లేదు. మరొక సారి రాష్ట్రాన్ని మోసం చేసేందుకు బీజేపీ వేసిన వలలో చంద్రబాబు ఇరుక్కు న్నారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతుంటే చూస్తూ ఊరుకోలేం. నవ్యాంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన జరగాలన్నా, ఇతరత్రా అభివృద్ధి చెందాల న్నా కుంటి సాకులు చెప్పకుండా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చితీరాలి. వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ అమలు చేయాలి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎంత వ్యయమైనా కేంద్రమే నిర్మించాలి. రాజధాని నిర్మాణం సహా విభజన చట్టంలో పేర్కొన్న అంశాలన్నీ తు.చ తప్పకుండా అమలు చేయా ల్సిందే. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ అకుంఠిత దీక్షతో రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తుంది. దీనిపై ఇప్పటికే పార్లమెంటులో పలుమార్లు యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ప్రస్తుత అధ్యక్షులు రాహుల్ గాంధీ, మాజీ మన్మోహన్‌సింగ్ సహా పలువురు కాంగ్రెస్ అగ్ర నేతలు ఏపీకి జరుగుతున్న అన్యాయంపై మోడీ సర్కారును నిలదీశారు. ఈ బడ్జెట్ సమావేశాలలో సైతం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై చర్చతోపాటు, ఓటింగ్ జరపాలని కోరుతూ నిబంధన 184 కింద కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ సెక్రటరీకి నోటీసులు కూడా ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రఘువీరారెడ్డి గారు, రాజ్యసభ సభ్యులు డా.కేవీపీ రామచంద్రరావు గారు ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నాయకులతో కలిసి ఏపీ భవన్ వద్ద ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలోని మండల, రెవిన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద ఆందోళనలకు, రెండో దశ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన తర్వాత మార్చి 6, 7, 8 తేదీలలో ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు, అవసరమైతే పార్లమెంటును ముట్టడించేందుకు ఏపీసీసీ ‘చలో ఢిల్లీ’కి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ విధంగా రాష్ట్ర శ్రేయస్సును కోరేవారంతా వివిధ రూపాల్లో ఉద్యమిస్తేనే ఆంధ్రప్రదేశ్ పట్ల వివక్ష చూపుతున్న మోడీసర్కారు మెడలు వంచడానికి, మళ్లీ ఎన్నికలొచ్చే సమయానికి ఆంధ్రప్రదేశ్‌కు కొంత మేర అభివృద్ధి చెందే ఆస్కారముంది.

మీ లేఖలు, వ్యాసాలు పంపవలసిన చిరునామా:
Editor, Surya, Surya Soudha, Plot.No.185, MCH no. 258/1/185, Siddi vinayk nagar, Opp:Hi-Tech City, Hyd-57
Mail: e d i

చరిత్రలో ఈరోజు


ఫిబ్రవరి 15

1564: ఇటలీ ఖగోళ శాస్త్రవేత్త గెలీలియో జననం.
1827: ప్రాట్ విట్నీ స్థాపకుడు ఫ్రాంసిస్ ప్రాట్ జననం.
1931: పూదోట జోజయ్య యస్.జె, క్రైస్తవ గురువులు జననం.
1938: అట్లూరి పూర్ణచంద్రరావు చలనచిత్ర నిర్మాత జననం.
1944: పొన్నాల లక్ష్మయ్య తెలుగు నేత జననం.
1944: రావులపల్లి గుర్నాథరెడ్డి తెలుగు రాజకీయనేత జననం.
1952: రాధా రెడ్డి, కూచిపూడి కళాకారులు, నాట్య గురువులు జననం.
1956: వెస్టిండీస్ క్రికెట్ జట్టు మాజీ క్రీడాకారుడు డెస్మండ్ హేన్స్ జననం.

అట్లూరి పూర్ణచంద్రరావు

అట్లూరి పూర్ణచంద్రరావు తెలుగు, హిందీ చలనచిత్రాల నిర్మాతగా ప్రసిద్ధుడు. ఇతడు కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, చౌటుపల్లి గ్రామంలో 1938వ సంవత్సరం ఫిబ్రవరి 15న జన్మించాడు. ఇతనికి చదువు అబ్బ లేదు. గుడివాడలోని గౌరీశంకర్ టాకీసులో ప్రొజెక్టర్ ఆపరేటింగ్ అసిస్టెం ట్‌గా, బుకింగ్ క్లర్క్‌గా పనిచేశాడు. విజయవాడలోని నవయుగ ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ కంపెనీలో ఐదు సంవత్సరాలు పనిచేశాడు. తర్వాత మద్రా సుకు వెళ్లి విఠలాచార్య, పి.పుల్లయ్యల వద్ద సహాయ దర్శకుడిగా పని చేశాడు. సినిమాలలో ప్రొడక్షన్ అసిస్టెంటుగా నాలుగు సంవత్సరాలు పనిచేసి మెళకువలు నేర్చుకున్నాడు. తెలుగులో 35 సినిమాలు, హిందీలో 18 సినిమాలు, తమిళంలో 13 సినిమాలు, కన్నడ, బెంగాలీ, ఒరియా, మరాఠీ భాషలలో రెండేసి చిత్రాలు, భోజ్‌పురిలో ఒక చిత్రం నిర్మించాడు.

గెలీలియో



గెలీలియో గెలీల ఇటలీకు చెందిన భౌతిక శాస్త్రవేత్త, గణితజ్ఞుడు, భౌగోళిక శాస్త్రజ్ఞుడు మరియు తత్వవేత్త. టెలిస్కోపు (దూరదర్శిని)ను కనుగొన్నాడు. గెలీలియో ఇటలీలోని పీసా నగరంలో ఫిబ్రవరి 15, 1564లో జన్మించాడు. చిన్న వయసులో తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. తరువాత పీసా విశ్వవిద్యాలయంలో వైద్యవిద్యార్థిగా చేరాడు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరాడు. ఎన్నో విశ్వరహస్యాలను గెలీలియో ఛేదించగలిగాడు. బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను గెలీలియో చూడగలిగాడు.గెలీలియో అప్పుడే కనుగొన్న టెలిస్కోపు ద్వారా శుక్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్ని కస్ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధృవీకరించారు.

రాజా–రాధారెడ్డి



కూచిపూడి రంగంలోనే కాక యావత్ కళాలోకానికి రాజా–రాధారెడ్డి లుగా సుపరిచితులయిన రాజారెడ్డి మరియు రాధారెడ్డి దంపతులు ఆదిలాబాదు జిల్లాకు చెందినవారు. రాధారెడ్డి 1952, ఫిబ్రవరి 15న జన్మించారు. వీరు న్యూఢిల్లీలో నృత్య తరంగిణి అను నాట్య పాఠశాలను ఏర్పరిచి ఔత్సాహిక నాట్య కళాకారులను తీర్చిదిద్దుతున్నారు. రాజారెడ్డి గారి ద్వితీయ సతీమణి కౌసల్యారెడ్డి, రాజా రాధారెడ్డిల కుమార్తె యామినీ రెడ్డి మరియు రాజా కౌసల్యా రెడ్డిల కుమార్తె భావనారెడ్డి కూడా ప్రముఖ కూచిపూడి కళాకారులే. దేశమంతటా అనేక నృత్యప్రదర్శనలు ఇచ్చిన రాజారాధా రెడ్డిలను భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. వీరువురు వేదాంతం ప్రహ్లాదశర్మగారి దగ్గర శిష్యరికం చేసారు. ఏలూరులోని కళాక్షేత్రంనందు కూచిపూడి నృత్యాన్ని అభ్యసిం చారు. రాజారెడ్డిగారికి చిన్ననాటి నుండి కూచిపూడి భాగవతం పైన ప్రత్యేక శ్రద్ధ. ఏలూరులో చిన్న చిన్న నృత్య ప్రదర్శనలు ఇచ్చిన తరు వాత 1967లో ప్రభుత్వ స్కాలర్‌షిప్ సహాయంతో ఢిల్లీలోని మాయా రావ్ కళాశాలనందు కూచిపూడి నృత్యనభ్యసించారు. దేశంలోనే కాకా ప్రపంచమంతటా నృత్యప్రదర్శనలిచ్చారు.



దేశ రాజధానిలో ఉచిత వైఫై సేవలు


న్యూఢిల్లీ: దేశ రాజధాని పౌరులకు త్వరలో ఉచిత వైఫై సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ప్రకటించిన ఉచిత వైఫై సేవల హామీ యువతను ఆకర్షించింది. ఢిల్లీలో ఆప్ పాలనాపగ్గాలు చేపట్టి బుధవారం నాటికి మూడేళ్లు పూర్తయ్యాయి. త్వరలోనే తాము ఉచిత వైఫై సేవలు ప్రారంభమయ్యే తేదీని వెల్లడిస్తామని..దీనికోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఉచిత వైఫై అమలుపై ఆప్ ప్రభుత్వం జాప్యం చేస్తోందని విపక్షాలు తరచూ విమర్శల దాడికి దిగుతున్న క్రమంలో కేజ్రీవాల్ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ఆప్ ప్రభుత్వం 2016, డిసెంబర్ నాటికి తూర్పు ఢిల్లీలోని 500 ప్రదేశాల్లో వైఫై హాట్‌స్పాట్స్ అందుబాటులోకి వస్తాయని ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. మరోవైపు మహిళల భద్రత కోసం ఢిల్లీ అంతటా సీసీటీవీ కెమెరాలను అమర్చే ప్రక్రియ ప్రారంభమైందని కేజ్రీవాల్ వెల్లడించారు. కాగా, దేశ రాజధానిలో ఉచిత వైఫై సేవలు చాలా కష్టసాధ్యమని టెక్నాలజీ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉచిత సేవలు అందించాలంటే వందల కోట్లు ఖర్చు అవుతుందని భావిస్తున్నారు.

బిజినెస్

14-2-2018 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్		& నిఫ్టీ	
ఆరంభం	34,630.72	ఆరంభం	10,585.75
గరిష్ఠం	34,850.21	గరిష్ఠం	10,585.75
కనిష్ఠం	34,621.67	కనిష్ఠం	10,500.90
ముగింపు	**34,155.95**	ముగింపు	**10,500.90**
మార్పు (పా)	-144.52	మార్పు (పా)	-38.85
మార్పు (శా)	-0.42	మార్పు (శా)	-0.37

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	10,955.50	-36.74	-0.33
S&P BSE SENSEX Next 50	34,904.19	-73.52	-0.21
S&P BSE 100	10,912.23	-34.42	-0.31
S&P BSE Bharat 22 Index	3,676.21	-34.95	-0.94

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
HCL-INSYS	67.70	+7.20	+11.90
RCOM	29.55	+2.45	+9.04
KEC	390.15	+28.15	+7.78
GSKCONS	6421.30	+441.15	+7.38
NCC	126.50	+8.00	+6.75

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
PNB	145.80	-15.85	-9.81
JKTYRE	175.35	-15.00	-7.88
BANKINDIA	133.45	-11.40	-7.87
ALBK	56.25	-4.75	-7.79
ORIENTBANK	104.00	-8.35	-7.43

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
SBIN	276.80	113.35	4035985
ICICIBANK	318.55	90.69	2841988
TATASTEEL	708.35	88.52	1244926
INFRATEL	327.00	82.16	2498211
PNB	145.80	79.22	5284239

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	64.2838	యూరో	78.9341
యన్	59.1400	పౌండ్	89.0202

పంజాబ్ నేషనల్ బ్యాంకులో కుంభకోణం

- కుదేలైన బ్యాంకు ఈక్విటీ షేరు ● ముంబై శాఖలో అక్రమ లావాదేవీలు
- 1.8 బిలియన్ డాలర్ల మోసాన్ని గుర్తించిన బ్యాంక్ ● వీటి విలువ రూ. 11,000 కోట్లు ● కొందరు ఖాతాదారులకు ప్రయోజనం
- దర్యాప్తు ఏజెన్సీలకు ఫిర్యాదు చేశామన్న బ్యాంకు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగు చూసింది. ముంబై బ్రాంచ్‌లో 1.8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.11వేల కోట్లు) మేర మోసపూరిత లావాదేవీలు జరిగినట్టు స్వయంగా పీఎన్‌బీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమాచారం అందించింది. మోసపూరిత, అనధికారిక లావాదేవీలు కొందరు ఖాతాదారుల ప్రయోజనాల కోణంలో జరిగినట్టు గుర్తించామని పేర్కొంది. ఈ లావాదేవీల ఆధారంగా ఆయా ఖాతాదారులకు విదేశాల్లో రుణాలు జారీ అయినట్టు వివరించింది. దీనిపై దర్యాప్తు జరిపి నిందితులను పట్టుకునేందుకు వీలుగా దర్యాప్తు ఏజెన్సీలకు నివేదించామని, స్వచ్ఛమైన, పారదర్శక బ్యాంకింగ్ సేవలకు కట్టుబడి ఉన్నామని పంజాబ్ నేషనల్ బ్యాంకు తెలిపింది. కాగా, దీని ప్రభావం ఇతర రుణదాతలపైనా పడే అవకాశముందని బ్యాంకు తెలిపింది. ముంబయి శాఖలో పలు మోసపూరితమైన, అనధికారిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని, కొంతమంది ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఇలా చేసినట్లు తెలుస్తోందని పీఎన్‌బీ నేటి ఎక్స్ఛేంజి ఫైలింగ్‌లో వెల్లడించింది. ఈ మోసపూరిత లావాదేవీలను బట్టి చూస్తే.. ఈ మొత్తాన్ని ఖాతాదారులు ఇతర బ్యాంకుల ద్వారా విదేశాలకు తరలించినట్లు తెలుస్తోందన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు సంస్థలకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొంది. ఈ మోసం వల్ల బ్యాంకుకు ఏ విధమైన నష్టం కలుగుతుంది.. ఇతర రుణదాతలు ఎవరు, ఏ విధంగా ఇబ్బంది పడతారు అనే అంశాలను బ్యాంకు వెల్లడించలేదు. పీఎన్‌బీ ఈ విషయాన్ని బయటపెట్టడంతో సంస్థ షేర్లు పడిపోయాయి.

ఈ లావాదేవీలపై బ్యాంక్ ఎలా వ్యవహరిస్తుంది?, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డబ్బులను రికవర్ చేయగలుగుతారా?.. ఎలా చేస్తారు? అనే అంశాలపై ఏ మాత్రం స్పష్టత రావడంలేదని మార్కెట్ నిపుణులు అంటున్నారు. మోసపూరిత లావాదేవీల విషయంలో ఇప్పటికే పంజాబ్ నేషనల్ బ్యాంకుపై విచారణ జరుగుతోంది. పీఎన్‌బీలో 44మిలియన్ డాలర్ల మోసపూరిత లావాదేవీల విషయంలో గత వారం ప్రముఖ నగల డిజైనర్ నీరవ్ మోదీపై సీబీఐ విచారణ చేపడుతోంది. అయితే తాజాగా గుర్తించిన మోసపూరిత లావాదేవీలకు, గతంలోని వాటికి ఏమైనా సంబంధం ఉందా అనే విషయంపైనా స్పష్టత లేదు. తాజా వ్యవహారాన్ని పీఎన్‌బీ ఫైలింగ్‌లో వెల్లడించింది కానీ బ్యాంకు ఎగ్జిక్యూటివ్స్ ఎవరూ దీనిపై స్పందించలేదు.




భారీ నష్టాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంకు షేర్లు: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రెండో అతిపెద్ద బ్యాంక్ అయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు షేర్లు బుధవారం మధ్యాహ్నం అమాంతం పడిపోయాయి. పీఎన్‌బీ ముంబయి బ్రాంచ్‌లో దాదావు రూ.11వేల కోట్ల మేర భారీ కుంభకోణం జరిగినట్లు వార్తలు రావడంతో ఆ కంపెనీ షేర్లు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. రూ.160 షేరు విలువతో బీఎస్ఈలో ట్రేడింగ్ ప్రారంభించిన పీఎన్‌బీ మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 8శాతం పడిపోయింది. ప్రస్తుతం ఆ బ్యాంక్ షేరు విలువ రూ.150 వద్ద కొనసాగుతోంది. ఈ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు బ్యాంకింగ్ సెక్రటరీ వెల్లడించారు. ఇప్పటి వరకు పది మంది పీఎన్‌బీ ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

మరో మూడు బ్యాంకులకూ పీఎన్‌బీ సెగ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో చోటుచేసుకున్న రూ 11,000 కోట్ల భారీ అవకతవకల్లో మరో మూడు బ్యాంకులూ ప్రభావితమైనట్టు తెలిసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు జారీ చేసిన హామీ పత్రాల (ఎల్ఓయూ) ఆధారంగా పీఎన్‌బీ సదరు క్లయింట్‌కు భారీగా రుణాలు మంజూరు చేసింది. విదేశీ బ్యాంకు శాఖలు బయ్యర్లకు ఇచ్చే రుణాల ఆధారంగా ఓ బ్యాంకు ఇతర బ్యాంకుల బ్రాంచ్‌లకు ఈ ఎల్ఓయూలను జారీ చేస్తుంది. ఈ బ్యాంకుల విదేశీ బ్రాంచ్‌లు సదరు జ్యూవెలరీ కంపెనీకి భారీగా రుణాలు ఇచ్చినట్టు సమాచారం. విదేశీ బ్యాంకు శాఖల రుణాలపై ఇప్పుడు నిఘా సంస్థలు, రెగ్యులేటరీ వర్గాలు దృష్టిసారించాయి. జనవరి 16న అక్రమ ఎల్ఓయూలు తొలిసారిగా జారీ అయ్యాయని గుర్తించినట్టు సీబీఐకి పీఎన్‌బీ నివేదించింది. హాంకాంగ్, దుబాయ్, న్యూయార్క్ వంటి పలు చోట్ల దుకాణాలు నిర్వహిస్తున్న జ్యూవెలరీ కంపెనీ ఎల్ఓయూలపై 2010 నుంచి విదేశీ బ్యాంకు శాఖల నుంచి రుణాలు సమీకరిస్తోందని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఏళ్ల తరబడి ఎల్ఓయూ ఆధారంగా విచ్చలవిడిగా రుణాలు పొందినట్టు సమాచారం. ఎప్పటినుంచో ఈ వ్యవహారం నిరాటంకంగా సాగుతున్నా జనవరి 25న చెల్లింపుల చక్రం నిలిచిపోవడంతో అసలు సమస్య వెలుగుచూసింది.

సదరు జ్యూవెలరీ సంస్థకు అందించిన సహకారం కొనసాగాలంటే రుణ వితరణపై 10 శాతం అదనపు మార్జిన్‌ను పీఎన్‌బీ అధికారులు డిమాండ్ చేయగా అందుకు జ్యూవెలరీ కంపెనీ నిరాకరించింది. ఈ చెల్లింపులకు జ్యూవెలర్ నిరాకరించడంతో పీఎన్‌బీ తన సేవలను నిలిపివేయడంతో మొత్తం వ్యవహారం గాడితప్పింది. ఎల్ఓయూలను పీఎన్‌బీ తిరస్కరించడంతో హాంకాంగ్ మానేటరీ అథారిటీ, ఆర్‌బీఐలకు ఫిర్యాదులు రావడంతో అవకతవకలు వెలుగుచూశాయి. ముంబయిలోని ఒక బ్రాంచ్‌లో రూ 11,359 కోట్ల విలువైన మోసపూరిత లావాదేవీలు జరిగాయని పంజాబ్ నేషనల్ బ్యాంక్ బుధవారం బీఎస్ఈకి తెలిపిన విషయం విదితమే.

పీఎన్‌బీ దెబ్బకు కుదేలైన మార్కెట్లు

ప్రభుత్వ బ్యాంకులపై భారీ ఎఫెక్ట్ - నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



ముంబై: గత రెండు వారాలుగా నష్టాలను మూటగట్టుకున్న స్టాక్ మార్కెట్లు... ఈ వారంలో వుంజుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, సఫలం కాలేకపోయాయి. ఈ రోజు నష్టాల్లో ముగిశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ. 11వేల కోట్ల కుంభకోణం వార్త నేపథ్యంలో, ప్రభుత్వ రంగ బ్యాంకులు తీవ్రంగా నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 145 పాయింట్ల నష్టంతో 34,156కు పడిపోయింది. నిఫ్టీ 39 పాయింట్లు పతనమై 10,501 వద్ద స్థిరపడింది.

బీఎస్ఈ టాప్ గెయినర్స్‌లో హెచ్సీఎల్ ఇన్ఫోసిస్టమ్ (11.90%), రిలయన్స్ కమ్యూనికేషన్ (9.04%), కేఈసీ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (7.78%), గ్లాక్సో (7.38%), నాగార్జున కన్ స్ట్రక్షన్స్ (6.75%) తదితర కంపెనీలుండగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (-9.81%), జేకే టైర్స్ (-7.88%), బ్యాంక్ ఆఫ్ ఇండియా (-7.87%), అలహాబాద్ బ్యాంక్ (-7.79%), ఓరియంటల్ బ్యాంక్ (-7.43%) తదితర కంపెనీలు నష్టపోయాయి.

ఉద్యోగులను తొలగిస్తున్న అమెజాన్?

న్యూఢిల్లీ: ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ అమెరికాలోని తమ సీటెల్ ప్రధాన కార్యాలయంతో పాటు ప్రపంచవ్యాప్తంగా కొన్ని వందల మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు తెలిసింది. 2017లో ఆ సంస్థ ప్రపంచవ్యాప్తంగా దాదావు 1,30,000 మంది ఉద్యోగుల్ని తీసుకుంది. అమెజాన్ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎకో డివైజెస్, వీడియో, వెబ్ సర్వీసెస్ క్లౌడ్ బిజినెస్ వంటి విభాగాల్లో కొత్తగా ఉద్యోగుల్ని నియమించాలని ఆ కంపెనీ భావిస్తోంది. దీంతో పలు విభాగాల్లో ఉద్యోగులను తొలగిస్తున్నట్లు చెప్పింది. తమ ప్రణాళికల్లో భాగంగా ఉద్యోగుల సంఖ్యలో సద్దుబాట్లు చేస్తున్నామని పేర్కొంది.

టూ వీలర్ స్పేర్ పార్ట్స్ విభాగంలోకి ఎంఎఫ్‌సీ

ముంబై: దేశంలో అతిపెద్ద మల్టీ బ్రాండ్ కార్ సర్వీస్ వర్క్‌షాప్‌గా మహీంద్రా ఫస్ట్ ఛాయిస్ సర్వీస్(ఎంఎఫ్‌సీ) పేరొందింది. ఇది 19 బిలియన్ డాలర్ల విలువ కలిగిన మహీంద్రాగ్రూప్‌కు అనుబంధ సంస్థ. ఇప్పటికే 2 వీలర్ స్పేర్ పార్ట్స్ విభాగంలో ఉన్న ఎంఎఫ్‌సీ తాజాగా 4 వీలర్ స్పేర్ పార్ట్స్ విభాగంలోకి ప్రవేశించినట్టు ప్రకటించింది. కాగా ఎంఎఫ్‌సీ సర్వీసెస్ భారత్‌లో అతిపెద్ద చైన్ వ్యవస్థను కలిగివుంది. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల్లోని 250 కి మించిన పట్టణాల్లో 340 వర్క్‌షాపులను కలిగివుంది. ఈ సందర్భంగా మహీంద్రా ఫస్ట్ చాయిస్ సర్వీసెస్ సీఈవో విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎంఎఫ్‌సీ సర్వీసెస్ హైక్వాలిటీ ఆటో స్పేర్ పార్ట్స్‌ను అందించడాన్ని ఛాలెంజ్‌గా తీసుకుందన్నారు.

ఒనిడా నుంచి నూతన ఇన్వర్టర్ ఎయిర్ కండీషనర్స్

హైదరాబాద్: లీడింగ్ కన్స్యూమర్ డ్యూరబుల్ కంపెనీగా పేరొందిన మైర్క్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(ఒనిడా) తాజాగా 84 మోడళ్ల నూతన ఇన్వెర్టర్ ఎయిర్ కండీషనర్ మోడళ్లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. ఈ విభాగంలో రూ. 720 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకునేలా వీటిని ఆవిష్కరించింది. ఈ నూతన ఎయిర్ కండీషనర్లు 170శాతం పవర్‌ఫుల్ కూలింగ్‌ను అందించడంతోపాటు విద్యుత్‌ను ఆదాచేస్తాయని సంస్థ తెలిపింది. అలాగే పర్యావరణ హితానికి దోహదం చేస్తాయని పేర్కొంది. ఈ సందర్భంగా మైర్క్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఈవో సుందర్ మాట్లాడుతూ ఎయిర్ కండీషనర్ల మార్కెట్‌లో సంస్థ 8శాతం వాటాను కలిగివుందని ఇప్పుడు దీని స్థాయి మరింతగా పెరుగుతుందని భావిస్తున్నామన్నారు.

డెనిమ్ కలెక్షన్ ఆవిష్కరించిన మాంటే కార్లో



హైదరాబాద్: ప్రముఖ మాంటోకార్లో సంస్థ తాజాగా అల్ట్రాకూల్ డెనిమ్ కలెక్షన్ ఆవిష్కరించినట్లు తెలిపింది. ఫ్రెష్ కలర్స్, వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా వీటిని అందిస్తున్నట్లు తెలిపింది. వీటిలో జీన్స్, షార్ట్స్, డంగారీస్, కాప్రిస్, డ్రెసెస్ మొదలైనవి ఉన్నాయని ప్రకటించింది. ఈ సందర్భంగా మాంటో కార్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోనికా ఓస్వాల్ మాట్లాడుతూ డెనిమ్ ఎంతో ఆదరణ పొందింది. వివిధ వయసుల వారికి అనుగుణంగా దుస్తులను ఎప్పటికప్పుడు అందిస్తున్నాం. యువత అభిరుచులకు అద్దంపట్టేలా దుస్తులను రూపొందిస్తున్నామని తెలిపారు.

పీర్‌తో పలు ఆరోగ్య ప్రయోజనాలు



న్యూఢిల్లీ: పీర్ పండులో ఔషధ గుణాలు అనేకం ఉన్నాయని యూనివర్శిటీ ఆఫ్ మిన్నెసొటా ప్రొఫెసర్ జాన్నె స్లావిన్ తెలిపారు. పలువురు శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనంలో పీర్ పండులో ఆరోగ్యానికి దోహదం చేసే పలు లక్షణాలున్నాయని వెల్లడైందన్నారు. పీర్ పండులో ఫైబర్ అధికంగా ఉందని, విటమిన్ సీతో పాటు కేవలం 100 కేలరీలను మాత్రమే కలిగివుంటుందని తేలింది. ఒక మీడియం సైజు పీర్ ఫ్రూట్ రోజులో అవసరమయ్యే 24శాతం పీచుపదార్థాన్ని శరీరానికి అందిస్తుంది. అలాగే దీనిలో సోడియం, కొలెస్ట్రాల్, ఫ్యాట్ ఫ్రీగా ఉండటంతో పాటు 190 గ్రాముల పొటాషియం కలిగివుంది. ఈ పండ్లను విరివిరిగా తినడం వలన సాధారణ వ్యాధులతోపాటు, దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని అమెరికాకు చెందిన వైద్య అధ్యయన సంస్థ తెలిపింది.

భారత్‌పై ట్రంప్ అసంతృప్తి

అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై ఇండియా అధిక సుంకం వసూలు చేస్తోంది

ఇదే కొనసాగితే మేమూ అదే పని చేస్తాం: ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



- హార్లీ డేవిడ్‌సన్ బైకులపై భారత్ అధిక సుంకాలు ● అదే విషయాన్ని ప్రస్తావించిన ట్రంప్
- మేమూ సుంకాలు వేస్తాం: ట్రంప్

వాషింగ్టన్: అమెరికాకు చెందిన హార్లీ-డేవిడ్‌సన్ మోటారుసైకిళ్ల దిగుమతిపై భారత్ అధిక సుంకం వసూలు చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇది అంత మంచిది కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఇది ఇలాగే ఉంటే భారత్ నుంచి అమెరికాకు దిగుమతయ్యే మోటార్‌సైకిళ్లపైనా సుంకాన్ని పెంచుతామని హెచ్చరించారు. స్టీల్ పరిశ్రమకు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ సభ్యులతో సమావేశమైన ట్రంప్ భారత్‌పై ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే తాజాగా భారత్ వీటిపై కస్టమ్స్ సుంకాన్ని మరింత తగ్గించింది. విదేశాల్లోనే పూర్తిగా తయారై దిగుమతి చేసుకునే ఈ బైక్‌లపై ప్రాథమిక సుంకాన్ని 50 శాతానికే పరిమితం చేసింది. గతంలో ఇది 800సీసీ అంతకన్నా తక్కువ సామర్థ్యం గల బైక్‌లపై 60శాతం, 800సీసీ అంతకన్నా ఎక్కువ సామర్థ్యం గల బైక్‌లపై 75శాతం సుంకం ఉంది. అయితే దీన్ని 50 శాతానికి తగ్గించిన తర్వాత ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

ఇటీవల భారత ప్రభుత్వం హార్లీడేవిడ్‌సన్ బైక్‌లపై టారిఫ్‌ను 75శాతం నుంచి 50శాతానికి తగ్గించింది. కానీ ఇది సరిపోదు అని ట్రంప్ అన్నారు. అమెరికా భారత్ నుంచి దిగుమతి చేసుకునే బైక్‌లకు సుంకాన్ని విధించడంలేదని, భారత్ మాత్రం అధిక సుంకం వేస్తోందన్నారు. ఇలా ఉండకూడదని.. పరస్పరం ఒకేలా ఉండాలని పేర్కొన్నారు. చాలా దేశాలతో ఇలాగే జరుగుతోందన్నారు. తమ బైకులు ఇతర దేశాల్లోకి వెళ్లాలంటే పెద్ద మొత్తంలో సుంకం చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇరు వైపులా ఒకేలా సుంకాలు చెల్లించేలా రెసిప్రోకల్ ట్యాక్స్ విధానం ఉండాలని వెల్లడించారు.

ట్రంప్ ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయినప్పుడు జరిగిన సంభాషణను కూడా పరోక్షంగా ప్రస్తావించారు. భారత్ నుంచి ఓ గొప్ప జెంటిల్‌మెన్ ఫోన్ చేశారు.. మోటార్‌సైకిళ్లపై టారిఫ్‌ను 75శాతం, 100శాతం నుంచి కేవలం 50శాతానికి తగ్గించేశామని చెప్పారు. అయితే అమెరికాకు భారత్ నుంచి వేల సంఖ్యలో బైక్‌లు దిగుమతి అవుతున్నాయి.. కానీ వీటికి మనం విధించే సుంకం ఎంతో తెలుసా.. సున్నా అని శాసనకర్తలనుద్దేశించి ట్రంప్ అన్నారు. అందుకే తాను రెసిపకల్ ట్యాక్స్ ఉండాలని అంటున్నానని చెప్పారు. తాను భారత్‌ను నిదించట్లేదని.. ఉదాహరణ కోసం చెప్పానని చెప్పుకొచ్చారు. అమెరికా విధానాన్ని అవకాశంగా తీసుకుని ఇతర దేశాలు లాభపడుతున్నాయి.. అలా కాకుండా ఇరు దేశాల నుంచి పరస్పరం ఒకేలా సుంకాలు వసూలు చేసుకునే విధానం ఉండాలని ట్రంప్ అభిప్రాయ పడ్డారు.

తగ్గనున్న లగ్జరీ బైక్‌ల ధరలు

న్యూఢిల్లీ: బైక్ ప్రియులకు ఇది శుభవార్తే. లగ్జరీ బైక్‌లపై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల హార్లే డేవిడ్‌సన్, ట్రయంప్ వంటి లగ్జరీ బైక్‌ల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. ఇప్పటి వరకు 800 సీసీ సామర్థ్యం గల బైక్‌లపై 60 శాతం, 800 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన బైక్‌లపై 75 శాతం దిగుమతి సుంకాన్ని విధించేవారు. ఇప్పుడు సుంకం 50 శాతానికి అంటే సగానికి సగం తగ్గింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) పేర్కొంది. అయితే ఇక్కడో చిన్న నిబంధన కూడా ఉంది. పూర్తిగా విదేశాల్లోనే అసెంబుల్ అయిన బైక్‌లకు మాత్రమే ఇది వర్తిస్తుంది. నిజానికి హైఎండ్ బైక్‌లు భారత్‌లో ఉత్పత్తి కావడం లేదు. విదేశాల నుంచి వీటిని దిగుమతి చేసుకుంటుండడంతో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో వీటిపై ఉన్న దిగుమతి సుంకాన్ని తగ్గించాలని గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు.

మోజు తీరడంతో ఖాళీగా తిరుగుతున్న మెట్రో రైలు

- ప్రయాణికులు బ్యాక్ టు సిటీ బస్ ● చార్జీలు భరించలేకపోతున్న బడుగు జీవి
- మెట్రో తీరుపై విరుచుకుపడుతున్న ప్రయాణికులు
- త్వరలోనే మెట్రో మాల్స్ ప్రారంభం



న్యూఢిల్లీ: భాగ్యనగర వాసులకు మోహం మొత్తింది. రెండున్నర నెలలకే మెట్రో మోజు తీరిపోయింది. భరించలేని టికెట్ ధరలతో క్రమంగా మెట్రో రైలుకు ముఖం చాటేశారు. ఫలితంగా రైళ్లు ఖాళీగా అటూఇటూ తిరుగుతున్నాయి. మెట్రో రైలు ప్రారంభంలో కిటకిటలాడిన స్టేషన్లు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. నాగోలు నుంచి మియాపూర్ వరకు ఎక్కడ చూసినా ప్రయాణికులు అరకొరగానే కనిపిస్తున్నారు. ప్రయాణికులు మెట్రోకు దూరమవుతుండడంతో అది ఉద్యోగుల వేటుకు కారణమవుతోంది. ఇటీవల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోయారు.

తొలుత మెట్రోలో ప్రయాణించేందుకు ఉత్సాహం చూపిన ప్రయాణికులు ఇప్పుడు బాబోయ్ అంటున్నారు. చార్జీలతో జేబు గుల్ల అవుతుండడమే అందుకు కారణం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇది నిత్యం ప్రయాణించే వారికి ఇబ్బందిగా మారింది. దీనికి తోడు మూడు నెలలు గడుస్తున్నా రోజువారీ, నెలవారీ పాస్‌ల ఊసెత్తకపోవడం కూడా మరో కారణం. ఈ కారణంగానే ప్రయాణికులు తిరిగి సిటీ బస్సులను ఆశ్రయిస్తున్నారు.


దీనికి తోడు పార్కింగ్ సమస్య కూడా పెద్ద తలనొప్పిగా మారింది. సరైన పార్కింగ్ వసతి లేకపోవడంతో ప్రయాణికులు ఎక్కడపడితే అక్కడే తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. పోలీసులు వీటిని తీసుకెళ్లి చలానాలు రాస్తున్నారు. దీంతో లబోదిబోమంటూ చలనాకట్టి వాహనాలను విడిపించుకుంటున్నారు. దీంతో ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ మెట్రో వైపు చూడడం మానేస్తున్నారు.

ఇక ప్రయాణికుల చార్జీలు తగ్గించి వారిని ఆకర్షించే ప్రయత్నాలకు దూరంగా ఉంటున్న మెట్రో అధికారులు అదనపు ఆదాయంపైనా దృష్టిసారించారు. ప్రకటనల ద్వారా ఇప్పటికే దండిగా ఆదాయం వస్తోంది. ఇప్పుడు మాల్స్ కూడా సిద్ధమవుతున్నాయి. పంజగుట్ట, ఎర్రమంజిల్, హైటెక్ సిటీ, మలక్‌పేట, మూసారాంబాగ్ ప్రాంతాల్లో 4 మాల్స్ నిర్మించారు. వీటి ద్వారా లక్షలాది రూపాయల ఆదాయాన్ని మెట్రో ఆర్జించనుంది. దీనికి తోడు 2500 మెట్రో పిల్లర్లపై ప్రకటనల ద్వారా మరింత ఆదాయం చేకూరనుంది. ఇంత పెద్దమొత్తంలో ఆదాయం వస్తున్నా చార్జీల పేరుతో ప్రయాణికుల ముక్కుపిండి మరీ పెద్ద ఎత్తున చార్జీలు వసూలు చేస్తుండడంతో మెట్రోపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముమ్మందు ధరలు తగ్గించకుంటే మెట్రోను ఖాళీగా నడుపుకోవాల్సిందేనని చెబుతున్నారు.

పని ఒత్తిడితో కుటుంబ సభ్యులకు దూరం

హైదరాబాద్: ప్రముఖ నీల్సన్ సంస్థ తాజాగా నిర్వహించిన బ్రిటానియా గుడ్ డే భారతీయ కుటుంబ సమీక్షా నివేదిక వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం పని ఒత్తిడి కారణంగా కుటుంబ సభ్యులతో అధిక సమయం గడపలేకపోతున్నామని 53శాతం మంది తెలిపారు. చాలామంది తమ అమ్మమ్మ, తాతయ్యలతో కూడా గడపలేకపోతున్నారు. ఇక మెట్రో నగరాల విషయానికొస్తే అతితక్కువ మంది మాత్రమే సోదరులను కలుసుకుంటున్నారు. కాగా బ్రిటానియా గ్రేట్ ఇంటర్నేషనల్ ఫ్యామిలీ హాలిడే కార్యక్రమంలో భాగంగా 60 కుటుంబాలను అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలకు తీసుకువెళ్లే అద్భుత అవకాశాన్ని అందిస్తున్నట్లు ప్రకటించింది.

మార్చి నుంచి జియో కొత్త సేవలు



న్యూఢిల్లీ: రిలయన్స్ జియో త్వరలో మార్కెట్లోకి కొత్త సేవలను అందించబోతోంది. తాజాగా టెలికాం టాక్ రిపోర్ట్ ప్రకారం మార్చి 2018 చివరి నాటికి కంపెనీ తన జియో ఫైబర్ సర్వీస్ లను అందిస్తుందని తెలియజేసింది. ప్రస్తుతం జియోఫైబర్ సర్వీస్ పది ముఖ్య పట్టణాలలో ప్రివ్యూ ఆఫర్ క్రింద వినియోగదారులు ప్రతి నెలా 100జీబీ ఉచిత డేటాను పొందుతున్నారు. ప్రస్తుతం పరీక్షా దశలో ఉన్న ఈ సర్వీస్ గురించి ఈ క్వార్టర్ లో కంపెనీ అధికారికంగా అనౌన్స్ చేసే అవకాశం ఉంది.

తెలంగాణ చరిత్రను చాటి చెప్పే పుస్తకాలు పంపిణీ చేస్తాం

డా.కేవీ.రమణాచారి

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: తెలంగాణ చరిత్రను ప్రతీ కుటుంబానికి తెలిపేందుకు మన తెలంగాణ-మన చరిత్ర పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారుడు కేవీ.రమణాచారి తెలిపారు. అర చేతిలో ఇమిడే ఈ పుస్తకాలను ఉగాది పర్వదినం మార్చి 18నుంచి పంచేందుకు సన్నహాలు చేస్తున్నట్లు వివరించారు. సచివాలయంలో బుధవారం సీఎం కార్యాలయం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కొన్ని పుస్తకాలను ప్రచురించామని, వాటిలో పాకెట్ సైజులో ఉండే మన తెలుగు పుస్తకం విశేషంగా ఆకట్టుకుందని, వేలాది మంది దీనిని తీసుకున్నారని చెప్పారు. తెలుగు నెలలు, తిథులు, వారాలు, నక్షత్రాలు, ఋతువులు, రాష్ట్ర చిహ్నాలు, తెలంగాణ జిల్లాలపై సంక్షిప్త సమాచారం ఈ పుస్తకంలో ఉన్నాయని డా.కేవీ రమణాచారి వెల్లడించారు.

చీర కట్టుకుని ఆకాశంలో సాహసం చేసిన పుణె మహిళ

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా భిన్నంగా సాహసం

పుణె : స్కై డైవింగ్ చేయడం ఎంతో సాహసంతో కూడుకున్నది అయితే, చీర కట్టుకుని ఆ పని చేసి ఔరా అనిపించింది పుణె మహిళ. 'త్వరలో రానున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏదైనా భిన్నంగా చేయాలని అనుకున్నాను. దీంతో మహారాష్ట్ర వాసిగా నవ్వారి శారి కట్టుకుని స్కై డైవ్ చేయాలని నిర్ణయించుకున్నా' అని పుణె మహిళ శీతల్ రాణె మహాజన్ తెలిపారు. స్కై డైవింగ్‌ను చీర కట్టుకుని ఒకరు చేయడం ఇదే మొదటిసారి. సాధారణంగా సాహసాలు చేసే మహిళలు సౌకర్యం దృష్ట్యా చీర కాకుండా ఇతర పాశ్చాత్య దుస్తులు వేసుకోవడం సాధారణంగా చూస్తుంటాం. కానీ, చీరలోనూ చేయవచ్చని నిరూపించారు మహాజన్.

అమరులకు మతం రంగు పులమొద్దు

- ఒవైసీ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందన
- ప్రకటనలు చేసేవారికి ఆర్మీ గురించి తెలియదు
- సుంజువాన్ ఉగ్రవాద దాడిలో ఐదుగురు ముస్లింలు మృతి
- జీఓసీ నార్తర్న్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ దేవరాజ్ అంబు ప్రతిస్పందన



న్యూఢిల్లీ : అమర సైనికులను మతపరంగా విభజించి చూడబోమని భారత సైన్యం స్పష్టం చేసింది. ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా సైన్యం ఈ వ్యాఖ్యలు చేసింది. జీఓసీ నార్తర్న్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ దేవరాజ్ అంబు మాట్లాడుతూ మేం అమర సైనికులకు మతాన్ని ఆపాదించబోము, ప్రకటనలు చేసేవారికి ఆర్మీ గురించి బాగా తెలియదు అన్నారు. అంతకుముందు అసదుద్దీన్ మాట్లాడుతూ మేం (ముస్లింలు) మా ప్రాణాలను ఇస్తున్నాం, అయితే ఉగ్రవాదులు మతం ఆధారంగా ఎవరిపైనా వివక్ష చూపించరు కాబట్టి మమ్మల్ని కూడా చంపుతున్నారు. వాళ్ళు అందరినీ భారతీయులుగానే చూస్తున్నారు. కానీ మా చిత్తశుద్ధిని ఇప్పటికీ ప్రశ్నిస్తున్నవారు మన దేశంలో చాలా మంది ఉన్నారు అన్నారు. ముస్లింలను ప్రశ్నిస్తూ, పాకిస్థానీలంటున్నారని ఆరోపించారు. సుంజువాన్ ఉగ్రవాద దాడిలో మరణించిన ఏడుగురిలో ఐదుగురు ముస్లింలేనన్నారు.

లెఫ్టినెంట్ జనరల్ అంబు మాట్లాడుతూ జమ్మూ-కశ్మీరులో ఇటీవలి ఉగ్రవాద దాడుల గురించి వివరించారు. శత్రువు సరిహద్దుల్లో విఫలమైనందువల్ల సున్నితమైన లక్ష్యాలపై దాడి చేస్తున్నట్లు తెలిపారు. శత్రువు నైరాశ్యంలో ఉన్నాడన్నారు. వాళ్ళు సరిహద్దుల్లో విఫలమైనపుడు శిబిరాలపై దాడి చేస్తున్నారన్నారు. హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మహ్మద్, లష్కరే తొయిబా మధ్య పరస్పర అనుబంధం ఉందన్నారు. ఆయుధం పట్టిన ఎవరైనా రాజ్యానికి వ్యతిరేకమేనని, ఉగ్రవాదేనని, అటువంటివారిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. అమర సైనికులను మతం ఆధారంగా చూడబోమని స్పష్టం చేశారు.

వైభవంగా శ్రీకాళహస్తీశ్వరుడి రథోత్సవం



శ్రీకాళహస్తి, సూర్య ప్రతినిధి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా బ్రహ్మరాత్రి పురస్కరించుకుని చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. జ్ఞాన ప్రసూనాంబ దేవి, వాయులింగేశ్వరస్వామి వారు అధిరోహించిన రథాలను లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల నామస్మరణలతో శ్రీకాళహస్తి మారుమోగింది. ఉప్పు, మిరియాలను రథాలపై చల్లి సౌభాగ్యాలు ప్రసాదించాలని కోరుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లు రథాలపై మాడ వీధులలో ఊరేగి భక్తులకు అభయ ప్రదానం చేశారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

శాసోత్రక్తంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రభిషేకం

- శివస్తోత్రంతో ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు
- శివనామస్మరణతో పులకించిన ఆంధ్ర ప్రదేశ్ భవన్

న్యూఢిల్లీ, సూర్య ప్రధాన ప్రతినిధి : సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో దేశ ఔన్నత్యం, మానవ సమాజ వికాసం పెంపొందుతాయని ఆంధ్ర ప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమీషనర్ ప్రవీణ్ ప్రకాష్ ఉద్ఘాటించారు. ఆంధ్ర ప్రదేశ్ భవన్ లో గత రెండు రోజులుగా జరుగుతున్న మహాశివరాత్రి పర్వదినా వేడుకలు సామూహిక మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతో బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా రెసిడెంట్ కమీషనర్ ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ టెంపుల్ టూరిజం ద్వారా రాష్ట్రాల ఆర్థిక ప్రగతిని సాధించ గలమని, వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాల్లో అవినాభావ సంబంధాలు, అవగాహన పెరుగుతాయన్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం అధికారుల సహాయంతో ఆలయ ప్రధాన అర్చకులను రప్పించి, వేదమంత్రోచ్చారణలతో మహాన్యాసపూర్వాక ఏకాదశ రుదభ్రిషేకం చేయించుట జరిగిందన్నారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం తరహాలో శ్రీశైల దేవస్థానం, శ్రీశైలం, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి, కనకదుర్గ అమ్మవారి దేవస్థానం, విజయవాడలకు కూడా దేశ రాజధాని ఢిల్లీ, తెలుగుభాషేతరులు నివసించే ప్రాంతాల్లో విశిష్టత చేకూర్చేందుకు పర్వదినాలను పురస్కరించుకుని ఆయా దేవస్థానముల సహకారంతో విశేష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలవల్ల ఆధ్యాత్మికత ఫరిడవిల్లుతోందని, తెలుగు ప్రజలతోపాటు ఇతర భాషలవారికి కూడా ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అఖండనాదోపాసన, మహాన్యాసపూర్వాక ఏకాదశ రుదభ్రిషేకంలలో భక్తులు, ప్రజలు విరివిగా పాల్గొనుట ముదావహం అన్నారు.

ఏకాదశ రుదభ్రిషేకానికి విశేష స్పందన...

శ్రీశైల దేవస్థానం, శ్రీ భ్రమరాంబ అమ్మవారి ప్రధాన అర్చకులు మతం శివ శంకరయ్య స్వామి, భాగవతుల వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రుల నేతృత్వంలో డా. బి.ఆర్. అంబేద్కర్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన సామూహిక మహన్యాస పూర్వక ఏకాదశ రుదభ్రిషేకంలో భక్తులు, దంపతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శాస్త్రోక్తంగా భక్తి శ్రద్ధలతో రుదభ్రిషేకం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, శ్రీశైలం దేవస్థానం, ఆదిలీల ఫౌండేషన్, తెలుగు ఎంప్లాయిస్



వెల్ఫేర్ అసోసియేషన్, ఢిల్లీ లోని తెలుగు సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమములో శ్రీశైల దేవస్థానం వారిచే కుంకుమ, విభూతి, శేష వస్త్రాలు, కైలాస కంకణాలు, స్వామి వారి లడ్డు ప్రసాదం అందచేశారు.

గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కుతున్న రైతులు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించేందుకు రెండు వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో పెడుతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన టీఆర్ఎస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన గత నాలుగు బడ్జెట్‌లో ఒక్క రూపాయ కూడా పెట్టలేదని శాసనసభ మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి అన్నారు. రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ప్రభుత్వ మాజీ విప్ అనిల్‌కుమార్, రాజారాం యాదవ్‌లతో కలిసి గాంధీభవన్‌లో సురేష్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో రైతు పండించే పంటకు మద్దతు ధర ఇచ్చే ప్రయత్నం చేశారని కానీ తెలంగాణ రైతాంగం మద్దతుధర కల్పించాలని రోడ్లపైకి వస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పరిస్థితి చూస్తుంటే కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారుల తో కుక్మక్కయ్యారని అనుమానం కలుగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల అనంతరం కూడా గత ప్రభుత్వం అంటూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కాంగ్రెస్ మీద నెపం నెట్టడానికే సమీక్ష లు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2008 లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి జీవో 153 విడుదల జారీ చేసి 30 కోట్ల రూ.ల నిధులు విడుదల చేశారన్నారు. రైతుల మీద కాంగ్రెస్‌పార్టీకున్న ప్రేమకు ఇది నిదర్శనమని, ఈనాలుగేళ్లలో రైతుల కోసం టీఆర్ఎస్ సర్కార్ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎర్రజొన్న, పసుపు రైతుల గత 15 రోజులుగా మద్దతుధర కల్పించాలని ధర్నా లు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సురేష్‌రెడ్డి విమర్శించారు. గత నెల నుంచి రైతులు ఆందోళన చేస్తున్నారని ప్రభుత్వ మాజీ విప్ అనిల్‌కుమార్ అన్నారు. యువ రైతులు మద్దతు ధర కల్పించాలని నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారని అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో మోసం చేసిన విత్తన వ్యాపారులపై కాంగ్రెస్ పార్టీ హయాంలో తాము చర్యలు తీసుకున్నామని, మరి మీరు ఏం చేశారంటూ ప్రశ్నించారు. రేపు ఆర్మూర్ లో ఏం జరిగినా దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా ప్రజల నోరు కొట్టి మిడ్ మానేరు నీళ్లు గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేటకు తీసుకువెళ్లే ప్రయత్నం ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్నారని విమర్శించారు. నిజామాబాద్ పార్లమెంటరీ లో రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని పసుపు ఐదు వేలు, ఎర్రజొన్న 1500 కె అమ్ముకోవాల్సి పరిస్థితి నెలకొందన్నారు. స్థానిక ఎంపీ కవిత రైతుల గోడు కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర మంత్రుల తో సెల్ఫీ లు దిగడం కాదని, రైతులను కాపాడాలన్నారు.

కేంద్ర మాజీ మంత్రి బుల్లిరామయ్య కన్నుమూత

సంతాపం ప్రకటించిన చంద్రబాబు, లోకేష్



తణుకు, సూర్య ప్రతినిధి : కేంద్ర మాజీ మంత్రి, ఆంధ్రా షుగర్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ బోళ్ల బుల్లి రామయ్య(92) పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలోని స్వగృహంలో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుల్లిరామయ్య 1926, జులై 9న తూర్పుగోదావరి జిల్లా తాటిపాక గ్రామంలో జన్మించారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. 1953 సంవత్సరంలో ఆంధ్రా షుగర్స్ లో చేరిన ఆయన వివిధ హోదాలలో పనిచేసి ఛైర్మన్, మేనేజింగు డైరక్టర్ స్థాయికి ఎదిగారు. ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో ఆరువందల టన్నుల గానుగాట స్థాయి నుంచి ఆరువేల టన్నుల గానుగాట స్థాయికి సాంకేతికంగా అభివృద్ధిపరచటంలో కీలకపాత్ర వహించారు. 1984లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయ రంగప్రవేశం చేశారు. రాజకీయాల్లో ప్రవేశించిన వెంటనే 1984లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. 1984, 1991, 1996, 1999 ఎన్నికల్లో ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశంపార్టీ తరపున పోటీచేసి గెలుపొందారు. 1996-98 మధ్య కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. జిల్లా రాజకీయాలలో రెండు దశాబ్ధాల పాటు కీలకపాత్ర వహించిన బోళ్ల బుల్లిరామయ్య వివాదారహితుడిగా, సౌమ్యుడిగా, స్నేహశీలిగా గుర్తింపు పొందారు. పారిశ్రామికవేత్తగా, రాజకీయవేత్తగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన మృతి వార్త తెలియగానే ఆంధ్రా షుగర్స్ కుటుంబసభ్యులు, టీడీపీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పలువురు ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సీఎం చంద్రబాబు సంతాపం...

బుల్లి రామయ్య మృతిపట్ల తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఏపీ మంత్రులు నారా లోకేశ్, కామినేని శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, అచ్చెన్నాయుడు, గంటా శ్రీనివాస్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, ఏపీ టీడీపీ అధ్యక్షుడు కళా వెంకట్రావు తదితరులు ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటించారు.

మొదటి పేజీ తరువాయి

ఇక సినిమాలకు గుడ్‌బై



జీవించేందుకు ఏదైనా చేయాలనుకుంటున్నాను. నేనేమీ ఓడిపోతాననుకోవడం లేదు. నాకు రాజకీయ సంస్థ లేకపోవచ్చు. అయినా 37 ఏళ్లుగా సామాజిక సేవలో ఉన్నా. ఈ కాలంలో 10 లక్షల మంది నమ్మకమైన కార్యకర్తలను సమీకరించాం. నా ఆదేశాలతో వారు మరెంతో మందిని ఇందులో భాగస్వాములను చేశారు' అని కమల్ సమాధానం ఇచ్చారు. 'నాకు సంపాదన ఉంది. నా బ్యాంకు బ్యాలన్స్‌ను పెంచుకోవడం కోసం ఇక్కడ లేను. సంతోషంతో ప్రశాంతమైన రిటైర్మెంట్ జీవితం గడపగలను. కానీ, నటుడిగా చనిపోవాలనుకోవడం లేదు. ప్రజా సేవలోనే ప్రాణాలు విడవాలనుకుంటున్నాను. అందుకే రాజకీయాల్లోకి రావాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది' అని కమలహాసన్ వివరించారు. కాషాయం (బీజేపీ) అంటే తనకు ఆందోళనకరమని, తన రాజకీయాలు నలుపు రంగులోనే ఉంటాయని, అది ద్రవిడుల స్వరం, చర్మతత్వాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. కాషాయ రంగు పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరో తమిళ అగ్ర నటుడు రజనీకాంత్ కూడా పార్టీ ఏర్పాటు చేయనుండడంతో ఆయనతో చేతులు కలిపే అవకాశం ఉందా? అని అడిగిన ప్రశ్నకు రజనీకాంత్ రాజకీయాలు కాషాయమైతే ఎటువంటి కూటమీ కట్టేది లేదని కమల్ స్పష్టం చేశారు.

నీటి కోసం పోరు

- తెలంగాణకు కృష్ణాలో 575 టి.ఎం.సీలడిమాండ్
- రాష్ట్ర రైతులకు నష్టం జరిగే విధంగా ఏపీ
- ఏపీ వాదనలను తిప్పికొట్టాలని నిర్ణయం
- పట్టిసీమపై ఫిర్యాదు
- తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం
- నేడు ఢిల్లీలో సమావేశం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలం గాణ రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగే విధ ంగా ఆంధ్రప్రదేశ్ చేసే ప్రతిపాదనలను ఎలా తిప్పికొట్టాలన్న అంశంపై కూడా చర్చిం చారు.పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల జరిగే ముంపు సమస్యలపై మంత్రి హరీష్ రావు సమీక్షించారు.తెలంగాణలోని చారిత్రక భద్రా చలం శ్రీ సీతారామస్వామి దేవాలయం సహా పలు గ్రామాలు, బొగ్గు గనులు, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ తదితర ముఖ్యమైన ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని మంత్రి హరీశ్ రావు చెప్పారు. భద్రాచలం పట్టణం దాని చుట్టుపక్కల గోదావరి పరీవాహక ప్రాంతంలో 124 కిలోమీటర్ల మేరకు పోలవరం ప్రాజెక్టు ప్రభావం ఉంటుందని ఆయన అన్నారు.పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ప్రభావిత ప్రాంతాలు, తలెత్తే సమస్యలపై అధ్యయనం చేయాలంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించవలసిందిగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఉన్నతాధికారులను మంత్రి హరీశ్ రావు కోరారు. బచావత్ ట్రిబ్యూనల్ అవార్డు ప్రకారం పోల వరం కు కేంద్ర జలసంఘం అనుమతులు ఇచ్చిన తర్వాత నాగార్జున సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలకు 45 టి.ఎం.సి ల నీటిని వినియోగించుకునే హక్కు దక్కుతుందని మంత్రి అన్నారు. ప్రస్తుతం కేంద్రమే జాతీయప్రాజెక్టుగా పోలవ రంను చేపట్టినందున ఆ 45 టి.ఎం.సి.ల నీటిని తెలంగాణకు కేటాయించాలని హరీష్ రావు కోరారు. కృష్ణా బేసిన్ లోని ప్రాజెక్టుల కిం ద 36.45 లక్షల హెక్టార్ల సాగుకు యోగ్యమైన భూములున్నప్పటికీ కేవలం 5.75 (15 శాతం) లక్షల హెక్టార్ల భూమికి మాత్రమే సాగునీరు అందుతున్నదాని మంత్రి అన్నారు. 45 టి.ఎం. సి.ల నీటిని తెలంగాణకు కేటాయిస్తే నీరందని ప్రాంతాల్లో సాగుకు వాడుకుంటామని ఆయన చెప్పారు.ఆంధ్ర ప్రదేశ్ కొత్తగా పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టి గోదావరి జలాలను వాడుకుం టున్నట్టు కేంద్రానికి ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించారు.. పట్టిసీమ లోనూ 45 టి.ఎం.సి.ల నీరు తెలంగాణ వాటా ఉందని ఆయన అన్నారు. మొత్తంగా రెండు రాష్ట్రాలకు కృష్ణాలో కేటాయించిన 811 టి.ఎం.సి.లలో తెలంగాణకు 575 టి.ఎం.సీలు కేటాయించి ఈ రాష్ట్రానికి న్యాయం చేయాలని గురువారం ఢిల్లీలో కేంద్రాన్ని కోరాలని ఆదేశించారు.రాజోళి బండ డైవర్షన్ స్కీమ్ కింద రాష్ట్రానికి 15.9 టి.ఎం.సిల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ వాస్తవంగా సగటున 4.56 టి.ఎం.సి.లకు మించి రావడం లేదని హరీష్ రావు తెలిపారు.

ఆర్డీఎస్ ఆధునీకరణకు ఏపీ అడ్డంకులు...

ఆర్.డి.ఎస్. కాలువల ఆధునీకరణ చేపట్టాలని 2004 లో నిపుణుల కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. సమైక్య రాష్ట్రంలో ఈ పనులు ముందుకు సాగలేదన్నారు.తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కూడా ఏ.పి. అనేక అడ్డంకులు సృష్టిస్తున్న విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లాలని మంత్రి కోరారు . నిపుణుల కమిటీ గతంలో చేసిన సిఫారసుల మేరకు ఆర్.డి.ఎస్. ఆధునీకరణ పనులు వేగవంతమయ్యేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని డిల్లీ సమావేశంలో కోరాలని ఆదేశించారు.ఇక శ్రీశైలం , నాగార్జున సాగర్ ప్రాజెక్టుల కింద నీటి వాడకాన్ని లెక్క గట్టేందుకు టెలిమెట్రీ స్టేషన్లు ఏర్పాటు చేయాలని 2016 జూన్‌లో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ నిర్ణయించినప్పటికీ కె.ఆర్.ఎం.బి.వాటిని అమలు చేయలేదన్నారు. తొలివిడతలో 19 టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటుకు 2017 ఫిబ్రవరిలో కె ఆర్ ఎం బి ప్రతిపాదించింది. కానీ ఆ టెలిమెట్రీ స్టేషన్లు పనిచేయడం లేదని మంత్రి హరీష్ రావు అన్నారు. రెండో విడత టెలిమెట్రీ స్టేషన్ల జాబితా ను ఇంతవరకు ఖరారు చేయకపోవడం పట్ల మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఆక్షేపించారు.ముఖ్యమైన నీటి మళ్లింపు ప్రాంతాల వద్ద టెలిమెట్రీ స్టేషన్ ల ఏర్పాటులో జరుగుతున్నా జాప్యం వల్ల పోతిరెడ్డిపాడు కింద అధిక నీటిని కృష్ణా బేసిన్ అవతలకు అక్రమంగా తరలిస్తున్నట్టు హరీష్ రావు ఆరోపించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ జోషీ, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఈ.ఎన్.సి.లు మురళీధర రావు,నాగేందర్ రావు,సి.ఈ.లు సునీల్, ఖగేందర్ రావు, లింగరాజు, హరిరామ్, బంగారయ్యశంకర్, భగవంతరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే చింతమనేనికి రెండేళ్ల జైలు శిక్ష



కోర్టు జైలు శిక్ష విధించింది. 2011లో రచ్చబండ కార్యక్రమంలో అప్పుడు మంత్రిగా ఉన్న వట్టి వసంత కుమార్‌పై దాడి కేసులో టీడీపీ ఎమ్మెల్యేకు ఈ శిక్ష పడింది. దీనిపై స్పందించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రచ్చబండ ఘటనలో తనతో పాటు 13 మందిపై కేసు పెట్టారని, వారందరిపై కేసు కొట్టేశారని, తనకు మాత్రం శిక్ష పడిందని అన్నారు. కింది కోర్టు తీర్పుపై హైకోర్టులో పిటిషన్ వేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక తనపై తప్పుడు కేసులు పెట్టారని చింతమనేని అన్నారు. రచ్చబండలో ప్రొటోకాల్ పాటించలేదని అడిగినందుకే తనపై కేసు పెట్టారని, తాను ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి చార్జిషీటు దాఖలు చేయలేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. అయితే చింతమనేని బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

మొదటి పేజీ తరువాయి

వేగంగా ఎల్ఈడీలు



రానుంది. ఫిబ్రవరి 15 వ తారీఖు నుండి ఎల్ఈడి లైట్ల స్టాక్ పూర్తి స్థాయి లో అందుబాటులోకి వస్తుంది. అప్పటి నుండి ప్రతి రోజు 10 వేల బల్బులు అమర్చే సామర్ధ్యానికి చేరుకుంటామని ఈఈఎస్ఎల్ ప్రతినిధులు వెల్లడించారు. 2018 నవంబర్ నాటికి ఈఈఎస్ఎల్ 10 లక్షల ఎల్ఈడి లైట్ల ఏర్పాటు పూర్తి చేయాలని, ఎల్ఈడి లైట్ల ఏర్పాటు కు గ్రామాల్లో కావాల్సిన థర్డ్ వైర్ ను వెంటనే ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అంగీకరించిందని లోకేష్ తెలిపారు. మార్చ్ 15 లోపుగా అన్ని గ్రామాల్లో అవసరం ఉన్న చోట థర్డ్ వైర్ ఏర్పాటు పూర్తి కావాలని, ఎల్ఈడి బల్బుల ఏర్పాటు మరింత వేగవంతం చేయడానికి ప్రతి రోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానన్నారు. అన్ని గ్రామాల్లో తప్పని సరిగా ఎస్సీ కాలనీల నుండే ఎల్ఈడి బల్బుల ఏర్పాటు ప్రారంభించాలని సూచించారు. ప్రతీ రోజు ఎన్ని లైట్లు వెలగడం లేదు, దానికి గల కారణాలు రియల్ టైంలో తెలిసే విధంగా డ్యాష్ బోర్డ్‌కు సమాచారం అనుసంధానం చేయాలని, వెంటనే సమస్య పరిష్కరించాలని మంత్రి నారా లోకేష్ అధికారులను కోరారు.

జల క్రీడలలో ఉపాధి ఆధారిత శిక్షణ



విజయవాడ, సూర్య బ్యూరో : పర్యాటక రంగం ఉపాధికి మార్గం చూపేలా ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు నిరుద్యోగ యువతకు జల క్రీడలలో శిక్షణను అందిస్తున్నట్లు పర్యాటక, భాషా సంస్క తిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వివరించారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ గోవాలోని జాతీయ జలక్రీడల సంస్థతో ప్రత్యేక ఒప్పందం చేసుకుందన్నారు. పర్యాటక రంగ పరంగా జల క్రీడలకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో నిపుణుల కొరత తలెత్తుతుందని, దానిని అధికమించే క్రమంలో నిరుద్యోగులకు ఈ శిక్షణను అందిస్తున్నామన్నారు. తొలి దశలో అనంతపురం టూరిజం హబ్ నుండి 15 మంది నిరుద్యోగుల ఎంపిక జరుగు తుందని, దశల వారిగా అన్ని టూరిజం హబ్‌ల నుండి ఎంపికలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి చూపుతామని ముఖేష్ కుమార్ మీనా వివరించారు. గోవాలో రెండు రకాల శిక్షణలు అందిస్తారని, బీచ్ లైఫ్ పేరిట లైఫ్ సేవింగ్ నైపుణ్యతల విషయంలో పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తారన్నారు. టిల్లర్ విభాగంలో పవర్ బోట్ నడపటం, నిర్వహణ పరంగా పూర్తి స్థాయి శిక్షణ ఉంటుందన్నారు. విశాఖ సాగర తీరంలో బీచ్ లైఫ్ గార్డుల అవశ్యకత ఎంతో ఉందని, శిక్షణ తదుపరి అవసరాన్ని బట్టి వారికి పర్యాటక శాఖలోనే ఉపాధి చూపే అవకాశం లేకపోలేదని మీనా తెలిపారు. శిక్షణ కోసం జాతీయ జల క్రీడల సంస్థకు మూడు లక్షల రూపాయల వరకు పర్యాటక శాఖ చెల్లిస్తుందని, అభ్యర్థుల రవాణా, వసతి, భోజనం వంటి సదుపాయాల ఖర్చు ఈ మొత్తానికి అదనమని కార్యదర్శి వివరించారు. ఇలా ఒక్కో అభ్యర్థిపైనా సగటున రూ. 37వేల వరకు పర్యాటక శాఖ నిధులు వ్యయం చేయనుందన్నారు. పవర్ బోట్ నిర్వహణలో శిక్షణ పొందిన వారికి దేశవ్యాప్తంగా అవకాశాలున్నాయని, అంతర్జాతీయ స్థాయిలో సైతం ఉపాధిని పొందగలుగుతారన్నారు. ప్రతి రంగం అభివ ద్ధిలోనూ ఉపాధి కీలకంగా ఉండాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసామని, ముఖేష్ కుమార్ మీనా వివరించారు. అభ్యర్థుల ఎంపిక, ఇతర అంశాలను ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి హిమాన్షు శుక్లా పర్యవేక్షిస్తారన్నారు.

నియోజకవర్గాల పెంపు ఆశలు గల్లంతు

- ఇద్దరు చంద్రులకు ఇబ్బందే
- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు గుండెల్లో రైళ్లు
- రాజ్యాంగ సవరణ ఇప్పట్లో సాధ్యం కాదు
- నియోజకవర్గాల పెంపుపై ఆసక్తి చూపించని బీజేపీ



ఖమ్మం, సూర్య ప్రతినిధి: నియోజకవర్గాల పెంపుపై ఇద్దరు చంద్రలు ఆశలు గల్లంతైయ్యాయి. ఇప్పటి వరకు వారికి ఎక్కడో ఆశ ఉంది. కాని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో నియోజకవర్గాల పెంపుపై కేంద్ర సానుకూలంగా ఉందని సమావేశాల్లో మొదటి రోజే బిల్లు పెడుతుందని, న్యాయశాఖ, హోంశాఖలు క్లియర్‌చేశాయని రెండు తెలుగు రాష్ట్రాల్లో జోరుగా ప్రచారం జరిగింది. ఇదిగో పెంపు జరుగుతుంది. అదిగో పెంపు అంటూ తెగ హడాహుడి చేశారు. తీరా అలాంటి సూచనలు ఎక్కడా మచ్చుకైనా కనిపించక పోయేసరికి ఇరు రాష్ట్రాల సీఎంలు కంగుతిన్నారు. ఇప్పుడు ఏమి చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రాలకు సంబంధించిన మిగతా విషయాలు పక్కన పెట్టినప్పటికి నియోజకవర్గాల పెంపుచేస్తే బాగుంటుందనే అభిప్రాయా లతో అధికార పార్టీలున్నాయి. కానీ దీనిపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవటం పైగా రెండు రాష్ట్రాలలో ఉన్న బేజేపీ నేతలకు నియోజకవర్గాల పెంపు ఇష్టలేక పోవటంతో పెంపు ప్రతిపాదన ప్రస్తుతానికి బుట్ట దాఖల్ అయినట్లు తెలుస్తుంది. తెలుగురాష్ట్రాలలో అధికారంలో ఉన్న టిడిపి, టిఆర్‌యస్ పార్టీలు విపక్ష శాసనసభ్యులను ప్రలోభపెట్టి వారిని అధికార పార్టీలో చేర్చు కున్నా రనే ఆరోపణలు ఉన్నాయి. వారిని అధికారపార్టీలో చేర్చుకునేందుకు తిరిగి వారి వారి నియోజకవర్గాల్లో వారికి టిక్కెట్లు ఇస్తామనే హామి కూడా ఉంది. అయితే గతంలో అధికార పార్టీ నుంచి పోటిచేసి ఓడిపోయిన వారికి నియోజకవర్గాలు పెరిగితే కొత్తగా వచ్చిన నియోజకవర్గాలను కేటాయించ వచ్చునని బావించారు. అది సాధ్యకాదనే సంకేతాలు వెలువడటంతో ఇప్పుడు ఏమి చేయాలనే తెలియక దిక్కుతోచనని పరిస్థితిలో ఉన్నారు. అసలు నియోజవర్గాల పునర్విభజన అనేది ప్రతి 20 సంవత్సరాల కొకసారి జరుగుతుంది. పెంపుకు కొన్ని విధివిదానాలు ఉన్నాయి. వాటి ప్రకారం జనాభా, ప్రాంతాలు, జిల్లాలు, రాష్ట్రాల వారీగా రిజర్వే షన్లపై సవివరమైన పరిశీలన జరిగిన అనంతరం ఎన్నికల సంఘం ఒక నిర్ణ యానికి వస్తుంది. ఎన్నికల సంఘం కేంద్రప్రభుత్వ సూచనలమేరకు కొన్ని మార్పులు చేర్పులు చేసే ఆవకాశం ఉంది. అయితే ఈ ప్రక్రియ అంతా పార దర్శికంగా జరుగుతుంది. దీనికోసం నోటిఫికేషన్ విడుదల, చిత్తు ప్రతి తయారు, దాన్ని తిరిగి ప్రజల,. రాజకీయ పక్షాల నుంచి ఫిర్యాదులు స్వీకరించ టం జరుగుతుంది. ఈ అన్ని విషయాల్లోనూ ఎన్నికల సంఘానిదే తుది నిర్ణ యం. ఏపి నుంచి తెలంగాణ విడిపోతున్న సందర్భంగా రెండు రాష్ట్రాలలోని ప్రజలను పెప్పించేందుకు విభజన హామిలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. అందు లో నియోజకవర్గాల పెంపు కూడా ఉంది. విభజనచట్టంలో నియోజకవర్గాల పునర్విభజన ఉండటంతో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెద్దఎత్తున కేంద్రంపై వత్తిడి తెచ్చారు. వారు ప్రధాని, కేంద్ర హోం మంత్రిని కలిసి ప్రతిసారి దీని విషయం ప్రస్తావించారు. రాష్ట్రాలలో ఇద్దరు సీఎంలు కలిసి కూర్చొని చర్చించుకోవాల్సిన అంశాలు అనేకం ఉన్నప్పటికి వీటిపై ప్రత్యేక శ్రద్ధ కన బరుస్తూ వచ్చారు. విభజన చట్టం లోని అనేక అంశాలు ఉన్నా వాటిని గూరించి పెద్దగా పట్టించు కోకుం డా రాజకీయ అవసరాలకోసం కేంద్రపై వత్తిడి తెస్తున్నారనే అభి ప్రాయాలు వక్తమైయ్యాయి. ఏపికి ప్రత్యేక హోదా ఇస్తామని పార్ల మెంట్ సాక్షిగా ఇచ్చిన హామి ఏమైందని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నా యి. ప్రత్యేకహోదాపై ఆంధ్రప్రదేశ్ లో అనేక ఆందోళనలు కూడా జరి గాయి. చివరకు ఫిబ్రవరి 8 బంద్ జరిగింది. కేంద్రం తెలుగు రాష్ట్రాల పట్ల చూపుతున్న వివక్షతపై ప్రజలు భగ్గుభగ్గు మంటున్నారు. విభజ హామిలపై ఎంపిలు నిలదీస్తుంటే విభజన జరిగిన తీరుపై ప్రధాని మాట్లాడటం సరైంది కాదనే అభిప్రాయాలు వ్యక్తం అవతున్నాయి. విభజనకు బీజేపీ కూడా మద్దతు ఇచ్చిన సంగతి మర్చిపోయారా? అనే సందేహాలు కలుగుతున్నాయి. పైగా పార్లమెంట్ డోర్లు మూసి బిల్లు తెచ్చారని తప్పించేకునే ప్రయత్న చేయటంపై తెలంగాణ ప్రజలు గరంగరంగా ఉన్నారు. బీజేపీ అప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఉండి డోర్లు వేసినప్పుడు ఎందుకు మాట్లాడలేదనే ప్రశ్నకు జవాబు లేదు. పైగా ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రధాన మంత్రి అభ్యర్దిగా రాష్ట్రంలో పర్యటించి నప్పుడు ఎందుకు ప్రత్యేక హోద పై హామి ఇచ్చారని నిలదీస్తున్నారు.

రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ప్రధాని అంగీకరించారని ఎన్నికలు అయిన వెంటనే పార్లమెంట్‌లో బిల్లు పెట్టనున్నారని లీకులు వదిలారు. హోంశాఖ క్లియ రెన్సు ఇచ్చిందని, న్యాయశాఖవద్ద ఫైల్ ఉందని రకరకాల ప్రచారం జరిగింది. తీరా రాష్ట్రపతి ఎన్నికలు అయిపోవటం ప్రధాని విదేశీపర్యనలకు వెళ్ళటం రావ టం ఒకసారి కాదు అనేకసార్లు జరిగింది. కానీ తెలుగు రాష్ట్రాల నియోజక వర్గాల పెంపు బిల్లు అడుగు కూడా ముందుకు పడలేదు. నిజంగా కేంద్రం రెండు తెలుగురాష్ట్రాలలో నియోజకవర్గాల పెంపుకు సానుకులంగా ఉండి పెంచితే అటు ఆంధ్రప్రదేశ్‌లో 50 అసెంబ్లీ నియోజకవర్గాలు తెలంగాణలో 33 నియోజకవర్గాలు పెరిగే ఆవకాశం ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 175, తెలంగాణలో 119 నియోజకవర్గాలు ఉన్న సంగతి విధితమే. అవి వరసగా 175, 152 కానున్నాయి. పార్లమెంట్‌లో అనేకసార్లు తెలుగు రాష్ట్రాలలో నియోజక వర్గాల పెంపు, విభజనచట్టం హామీలపై ఉభయసభల్లోనూ పార్ల మెంట్ సభ్యులు లిఖితపూర్వక ప్రశ్నలు అడిగారు. దానికి హోంమంత్రిత్వ శాఖ నుంచి నియోజకవర్గాల పెంపు రాజ్యంగ సవరణతో ముడిపడి ఉన్నందన సాధ్యం కాదని స్పష్టమైన సమాధానం వచ్చింది. రాజ్యాంగ సవరణ చేయకుండా నియోజకవర్గాల పెంపు సాధ్యం కాదని పార్లమెంట్‌లోనే చెప్పినప్పటికి తిరిగి అదే ప్రస్తావించటం జరుగుతూనే ఉంది. 2026లో మాత్రమే నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం ఉందని స్పష్టంచేశారు. ఒకవేళ పెంపు జరగాల్సి వస్తే రాజ్యంగసవరణ జరగాల్సిందేనని అటార్నిజనరల్ కూడా తేల్చిచెప్పారు. దీనిపై కేంద్ర ఏలాంటి వైఖరి తీసుకుంటుందనేదే ఆసక్తికరంగా మారింది. కానీ రెండు రాష్ట్రాలలోని సీఎంలు, మంత్రులు పెంపుపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఇంతకి పెంపు ఉన్నట్లా... లేనట్లా అనే విషయాలను ఆశావాహులు ఇంకా ఆరాతీస్తునే ఉన్నారు. తెలంగాణలో పునర్విభజన జరి గితే కొన్ని నియోజక వర్గాలు రెండు జిల్లాల పరిధిలో ఉండగా పార్లమెంట్ నియోజక వర్గాల పరిధి మూడు నాలుగు జిల్లాలకు విస్తరించింది. అన్ని గందర గోళంగా ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు మూడు జిల్లాల మీటింగ్‌లకు వెళ్ళాల్సి వస్తుంది. దీంతో వారు విసుగు చెందుతున్నారు. జిల్లాల పెంపుపై ప్రభుత్వంలో ఉన్న పెద్దలకు సైతం అయిష్టంగానే ఉన్నారు. శాస్త్రీయత లోపించిందనే విమర్శలున్నాయి. ఉదాహరణకు ఖమ్మంజిల్లాను విడగొట్టి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా చేశారు. అంతే కాకుండా మరో రెండు మండలాలను ఒక జిల్లాలో మరో రెండు మండలాలను మరొక జిల్లాలో కలి పారు. ఇప్పటికి 5 మండలాలను పూర్తిగా, మరో రెండు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండగా వాటిలో 7 రిజర్వుడ్ నియోజకవర్గాలే కావటం గమనార్హం. వీటిలో కూడా 5 ఎస్టీలకు, రెండు ఎస్సీలకు రిజర్వుడ్‌గా ఉన్నాయి. కేవలం మూడు మాత్రమే జనరల్ నియోజక వర్గాల్లో ఉండగా వాటిలో కొత్తగా ఏర్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేవలం ఒకటి మాత్రమే జనరల్ సీటు. మిగతా 4 ఎస్టీరిజర్వుడ్ నియోజకవర్గాలుగా ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నియోజకవర్గాల పున ర్విభజన జరిగితే రెండు జిల్లాల్లో రెండు పెరుగుతాయని అంటున్నారు.

ఖమ్మం జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్ ఒక నియోజకవర్గంగాఉంచి రూరల్ ప్రాంతంను విడదీసి పాలేరులోఉన్న ఖమ్మం రూరల్‌ను కలపటంతోపాటు రఘునాథ పాలెం, కొనిజర్ల మండలాలను కలుపుతూ కొణిజర్లలేదా ఖమ్మం రూరల్ నియోజకవర్గం చేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తుంది. అదే విధంగా కల్లూరు కేంద్రంగా మరో నియోజకవర్గం చేయాలనే ఆలోచన ఉన్నట్లు సమా చారం. అయితే దమ్మపేట నియోజకవర్గం కేంద్రంగా దమ్మపేట, చంద్రుగొండ, కల్లూరు, జూలూరుపాడు, తల్లాడలను కలిపి ఒక నియోజకవర్గం చేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తుంది. పాల్వంచ కేంద్రంగా నియోజకవర్గంపై కూడా ఆలోచనచేస్తున్నట్లు సమాచారం. చివరకు ఎక్కడ నియోజకవర్గాలు పెరుగుతా యో కానీ తమకు అనుకూలంగా ఉండాలనే యోచనలో రాజకీయ నాయకులు పావులు కదుపుతున్నారు. అయితే నియోజకవర్గాల పెంపుకు దాదాపు ద్వారాలు ముసుకున్నట్లే తెలుస్తుంది. పెంచే ఉద్దేశ్యం కేంద్రానికి ఉంటు సభలు నెల రోజులు వాయిదా ముందు పార్లమెంట్‌లో రాజ్యంగ సవరణ బిల్లు పెట్టాల్సి ఉంది. కాని అదిజరగలేదు. పైగా తెలుగుదేశం బీజేపీల కోల్డ్‌వార్ నడుస్తుంది. ఎన్నికలకు మరో సంవత్సరకాలమే ఉన్నందున అప్పటిలోగా ఈ ప్రక్రియ పూర్తి కావటం కష్టం. అందువల్ల పెంపు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు పెట్టుకున్న ఆశలు గల్లంతేననే అభిప్రాయాలు వ్యక్త అవుతున్నాయి. ఆసాదారణ నిర్ణయాలు జరిగితే తప్ప నియోజకవర్గాల పునర్విభజన ఇప్పట్లో లేనట్టే.


హోదా, విభజన హామీల సాధన కోసం పోరాటం



విజయవాడ, సూర్య బ్యూరో : ఏపీకి ప్రత్యేక దా, విభజన హామీల సాధన కోసం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అన్ని ప్రజాసంఘాలను కలుపుకుని దశల వారీ ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె. రామకృష్ణ, పి.మధు వెల్లడించారు. పార్టీకార్యాలయంలో బుధవారం 10 వామపక్ష పార్టీల నేతలు భేటీ అయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో వామపక్ష పార్టీల నేతలతో కలిసి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక దా, విభజన హామీల అమలులో మోడీ, చంద్ర బాబు మాట తప్పారని, రాష్ట్ర ప్రజలను మోసగించారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రంలోని 10 వామపక్ష పార్టీలు ఉద్యమ కార్యాచరణను రూపొందించాయని వివరించారు. ఈ నెల 18న విజయవాడలో ఏపీ ప్రత్యేక దా, విభజన హామీల అమలు సాధన సమితి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రౌండ్గటేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు పాల్గొంటాయని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర ప్రభుత్వ రంగ విద్యా సంస్థల కేటాయింపులు, రాజధానికి నిధుల కేటాయింపులు తదితర విభజన హామీలపై ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలనే భావనతో ప్రజలున్నారని స్పష్టం చేశారు. సీపీఎం నేత మధుతో కలిసి జనసేన నేత పవన్ కళ్యాణ్‌ను త్వరలో కలుస్తామన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు.

వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టు, రాజధానికి నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు విజయ్ కుమార్, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, వై.వెంకటేశ్వరరావు, పి.వి. సుందర రామరాజు, బిఎస్ అమరనాథ్, సుధీర్, ఎం.వెంకటరెడ్డి, డి.హరినాథ్, పోలారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింతమనేనికి రెండేళ్ల జైలు, బెయిలు




ఏలూరు, సూర్యబ్యూరో : పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధ వారం భీమడోలు మెజిస్ట్రేట్ తీర్పు నిచ్చారు. మూడు వేర్వేరు కేసుల్లో ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. అయితే వెంటనే చింతమనేని భీమడోలు కోర్టులో బెయిల్ పిటీషన్ దాఖలు చేయగా మెజిస్ట్రేట్ బెయిల్ మంజూరు చేసారు. వివరాల్లోకి వెళ్తే.. 2011లో అప్పటి మంత్రి వట్టి వసంత్ కుమార్‌పై చింతమనేని ప్రభాకర్ చేయి చేసుకున్నారు. అంతే కాకుండా వట్టి వసంత్ కుమార్ గన్‌మెన్‌పై చేయిచేసుకున్న కేసులో దోషిగా నిర్ధారిస్తూ భీమడోలు మెజిస్ట్రేట్ కోర్టు తీర్పు వెలువరించింది. 2011 జూన్ నెలలో దెందులూరు హైస్కూల్ లో జరిగిన రచ్చబండలో అప్పటి మంత్రి హోదాలో ఉన్న వట్టి వసంత్‌కుమార్‌పై దెందులూరు ఎమ్మెల్యేగా ఉన్న చింతమనేని దౌర్జ న్యం చేయడంతోపాటు అప్పటి ఎంపి కావూరి సాంబశివరావు , ప్రజలందరి సమక్షంలో చేయి చేసుకున్నారు. దీనిపై అప్పటి మంత్రి వట్టి వసంత్ కుమార్ గన్మెన్ ఫిర్యాదు మేరకు దెందులూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులు నాలుగు సెక్షన్లగా కేసు నమోదు చేశారు. ఏడేళ్లగా కేసు వాదోపవాదనలు జరగగా బుధవారం కోర్టు తీర్పు వెలువరించింది. సెక్షన్ 506 2) గా రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయిల జరిమానా....సెక్షన్ 353 గా ఆరు నెలల జైలు శిక్ష, వేయి రూపాయిల జరిమానా, సెక్షన్ 7(1) గా ఆరు నెలలు జైలు శిక్షతోపాటు 500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. మొత్తంగా మూడేళ్ల జైలు శిక్ష, 2500 జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ సంచలన తీర్పు వెల్లడించారు. అన్ని శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని తీర్పునివ్వ డంతో చింతమనేనికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష వర్తిస్తుంది. తీర్పు వెలువడే సమయంలో తన అనుచరులతో చింతమనేని కోర్టుకు హాజరయ్యారు. తీర్పు వెలువడిన వెంటనే చింతమనేని బెయిల్ పిటీషన్ దాఖలు చేయగా, కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

విజయవాడలో మరో భూకబ్జాకు కుట్ర

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

విజయవాడ, సూర్య బ్యూరో : విజయవాడ నగర శివారు ప్రాంతంలో మరో భూ కబ్జాకు కుట్ర వెలుగులోకి వచ్చింది. ఆలయం పేరుతో సుమారు రూ. 6 కోట్ల విలువైన తమ భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని వన్‌టౌన్ కొత్తపేటకు చెందిన ఓ కుటుంబం సభ్యులు బుధవారం పోలీసు కమీషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి చెందిన తమ్మిన మారుతి కిషోర్, తమ్మిన సత్యలీలాదేవి మీడియాతో మాట్లాడారు. తమ తాత తమ్మిన వెంకటస్వామి పాతపాడు గ్రామంలో 1934, నవంబర్ 5వ తేదీన అల్తి తాతయ్య నుంచి 1.75 ఎకరాల భూమిని కొనుగోలు చేశారని తెలిపారు. అనం తరం ఆ భూమిలో ఒక గదిని నిర్మించి మిగిలిన దానిని కౌలుకు ఇచ్చారని చెప్పారు. ఆ భూమిలో నిర్మించిన గదిలో పాము వుట్ట వెలిసిందని, దీంతో కౌలుదారుడు వెళ్ళిపోయారని వివరించారు. కొద్దికాలానికి ఆ గది మొత్తం వుట్ట వ్యాపించిందని, దీంతో నాగేంద్రుని వుట్టగా ఆ గదిని వదిలేశారని తెలిపారు. ఆ వుట్ట పక్కనే తమ తాత తమ్మిన వెంకటస్వామి, నానమ్మ తమ్మిన పాపాయమ్మ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టించి ఆలయం నిర్మించారని పేర్కొన్నారు. ఆ తర్వాత తమ తల్లిదండ్రులు తమ్మిన చంద్రావతి, రామారావు కలిసి అదే భూమిలో శివాలయం నిర్మించారన్నారు. ఈ రెండు ఆలయాలకు తమ్మిన రాజేష్‌శర్మ (కుమార రాజా)ను అర్చకుడిగా, తమ్మిన పోతన పవన్ కుమార్‌ను సహాయకుడిగా తమ కుటుంబ సభ్యులే నియమించారని వివరిం చారు. మిగిలిన భూమిని నైనవరానికి చెందిన జక్రయ్య 30 ఏళ్ళుగా కౌలుకు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, పాతపాడులో నివసిస్తున్న కొంద రు రెండేళ్ళుగా అర్చకుడి టి.రాజేష్‌శర్మపై దౌర్జన్యం చేసి తమకు ఆ స్థలంలోకి వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. దీంతో ఆయన అక్కడికి వెళ్ళడం లేదన్నారు. ఆలయంలో అలంకరణ కోసం కూడా తామే వెండి, బంగారు వస్తువులు చేయించామని, వాటిని కూడా పాతపాడుకు చెందిన కొందరు తమ వద్దే పెట్టుకున్నారని చెప్పారు. తమ తల్లిదండ్రులు నిర్మించిన శివాలయాన్ని నేల మట్టం చేశారని, ఆలయం వెనుక వైవున్న పశువుల కోసం తవ్వించిన చెరువును పూడ్చివేశారని తెలిపారు. ఈ స్థలం మొత్తం తమకు రిజిస్ట్రేషన్ చేయాలని వివిధ రూపాల్లో ఒత్తిడి తీసుకొస్తున్నారని, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్థలం రికార్డులను మార్పు చేశారని, ఈ విషయం తెలిసి



ఇటీవల మళ్ళీ స్థలం వద్దకు వెళ్ళగా బెదిరించారని తెలిపారు. ఈ వ్యవహారంలో ఓ రిటైర్ ఉన్నతాధికారి హస్తం వుందని అనుమా నం వ్యక్తం చేశారు. దీంతో భయాందోళనలకు గురైన తాము పోలీసు అధికారు లను ఆశ్రయించామని వివరించారు. పోలీసు అధికారులు తమ ఫిర్యాదును స్వీకరించి సానుకూలంగా స్పందించారని, రెండు రోజుల్లో రికార్డులను తీసుకు వచ్చి విచారణ చేస్తామని, అప్పుడు తమను పిలిపిస్తామని చెప్పారని తెలిపారు.

పాలేరులో కాంగ్రెస్ అభ్యర్థిగా కందాల?


- 2009 నుంచి కొనసాగుతున్న ప్రయత్నాలు
- ఈసారైనా ఫలించేనా?
- కాంగ్రెస్ పెద్ద నాయకులే ఈయనకు బంధుగణం
- గట్టిపోటీనే అంటున్న ప్రజలు
- రకరకాల కారణాలతో రెండు సార్లు రేసు నుండి తప్పుకున్న వైనం
- ప్రచారంలో రాయల నాగేశ్వరరావు, తుమ్మల నరేందర్‌చౌదరి పేర్లు



ఖమ్మం, సూర్యబ్యూరో : పాలేరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కందాల ఉపేందర్‌రెడ్డి పోటిచేస్తారని ప్రచారం జరుగుతుంది. ప్రముఖ కాంట్రాక్టర్ అయిన ఉపేందర్‌రెడ్డిది సౌమ్యుడు, కలుపుగోలు తనం ఉన్న వ్యక్తిగా పేరుంది. సహయం చేసే గుణం ఆయన సొంతం. గత మూడుసార్లుగా పాలేరు కాంగ్రెస్ టిక్కెట్ ఆశిస్తూ అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుని చివరి నిమిషంలో ఆగి పోతున్నారు. దీంతో నియోజకవర్గ ప్రజల్లో అయ్యోపాపం ఉపేందర్‌రెడ్డి అనే సానుభూతి ఉంది. ఇదే ఈయనకు ప్లస్ పాయింట్‌గా మారే ఆవకాశం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. కాంగ్రెస్‌లో ఆయనకు బంధుగణం ఉండటం కలి సొచ్చే అంశం. 2009, 2014ల నుంచి పాలేరులో పోటీచేసేందుకు ప్రయ త్నాలు కొనసాగిస్తునే ఉన్నారు. ఇదే నియోజకవర్గానికి చెందిన ఉపేందర్ రెడ్డి స్వగ్రామం కూసుమంచి మండలంలోని రాజుపేట. ఇప్పటికే ఇదే గ్రామానికి చెందిన వెంకటవీరయ్య సత్తుపల్లి నుంచి టిడిపి ఎమ్మెల్యేగా కొనసాగు తున్నారు. గతంలో వెంకటవీరయ్య పాలేరు నుంచి గెలుపొందారు. నియోజక వర్గాల పునర్విభజన అనంతరం వెంకటవీరయ్య సత్తుపల్లి నుంచి పోటి చేస్తువస్తున్నారు. అక్కడ రెండుసార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. పాలేరు జనరల్ నియోజకవర్గంగా మారటంతో గత రెండు ఎన్నికల్లో దివ ంగత నేత రామిరెడ్డి వెంకటరెడ్డి కాంగ్రెస్ నుంచి పోటిచేశారు. దీంతో ఉపేందర్‌రెడ్డికి ఆవకాశం లభించలేదు. ప్రతిసారి ఎన్నికలకు ముందు హడాహుడి చేయటం టిక్కెట్ రాకపోవటం జరుగుతుండటంతో ఆయనపై ప్రజల్లో కొంత సానుభూతి ఉంది. పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోట లాంటిది. సాంప్రదాయ ఓటు బ్యాంకు కలిగి ఉంది. ప్రత్యేకించి లంబాడాల్లో కాంగ్రెస్‌కు ఇప్పటికి చెక్కు చెదరని అభిమానం. పైగా ఉపేందర్‌రెడ్డికి బందుగణంతో పాటు నియోజక వర్గంలో బలమైన రెడ్డి సామాజిక వర్గం ఉంది. కొంత ఓటింగ్ శాతంతో పాటు వారు ఎటు చెబితే అటు ఓటు వేసే గ్రామాలు ఇప్పటికి ఉన్నాయి. గతంలో ఇక్కడ కాంగ్రెస్ గెలిచేందుకు వీరి ప్రభావమే ప్రధానంగా దోహదం చేసింది. సిపియంకు కూడా నియోజకవర్గంలో బలం ఉన్నప్పటికి ఇటీవల కాలంలో బాగాతగ్గింది. గత ఉప ఎన్నికల్లో సిపియం, సిపిఐ మద్దతుతో పోటిచేసి కేవలం 16 వేల ఓట్లు మాత్రమే పొందగలిగింది. టిఆర్‌యస్‌కు 95వేలు ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 50 వేల ఓట్లు వచ్చాయి. పాలేరు ఉప ఎన్నికల్లో అధికారంలో ఉన్న టిఆర్‌యస్ పార్టీ మంత్రిగా ఉన్న సీనియర్ నేత తుమ్మల నాగేశ్వరరావును పోటిలో నిలిపి సర్వశక్తులు వడ్డింది. కాంగ్రెస్ నుంచి పోటిచేసిన రాంరెడ్డి వెంకటరెడ్డి సతీమణికి పెద్దగా రాజకీయ అనుభవంలేదు. పైగా బహిరంగ వేదికలపై మాట్లాడే అలవాటు అంతకన్నా లేదు. అయినప్పటికి కాంగ్రెస్‌కు 50వేల ఓట్లు రావటం చిన్న విషయం కాదు. ఈసారి రాంరెడ్డి వెంకటరెడ్డి కుటుంబం నుంచి టిక్కెట్ అడిగే అవకాశం ఉంది. ఉప ఎన్నికల్లో కుటుంబ సభ్యులకు పోటి చేయాలనే ఆలోచనే లేకపోయినా పార్టీ హైకమాండ్ నిర్ణయం మేరకు వయస్సు పైబడిన పుటికీ గృహిణిగా జీవితం గడుపుతున్న వెంకటరెడ్డి సతీమణి పార్టీ నిర్ణయం మేరకు పోటిలోకి దిగారు. అందువల్ల వారు తిరిగి టిక్కెట్ తమకే కావలని అంటే పార్టీ నిర్ణయం ఏవిధంగా ఉంటుందనే విషయం చర్చనీయాంశంగా ఉంది. వీరు గాక 2009లో చిరంజీవి స్థాపించిన పీఆర్పీ నుంచి పోటి చేసిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి రాయల నాగేశ్వరరావు కూడా టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. సౌమ్యుడుగా పేరొన్న నాగేశ్వరరావుకు నియోజక వర్గంలో బంధుగణం ఉంది. పైగా కమ్మసామాజికవర్గం ఓట్లు కూడా గణనీయం గానే ఉన్నాయి. అయితే మంత్రి తుమ్మల కూడా ఇదే సామాజికవర్గంకు చెందిన వారు, తిరిగి ఆయనే పోటిచేసే ఆవకాశాలు మెండుగా ఉన్నాయి. కనుక కాంగ్రెస్ ఈసారి గెలిచే ఆవకాశంఉన్న అభ్యర్థులను పోటి పెట్టెందుకు మొగ్గు చూపించవచ్చు. ఇప్పటికే రాహుల్ టీమ్ నియోజకవర్గాలపై కసరత్తు చేస్తు న్నట్లు తెలుస్తుంది. కులాల సమీకరణలు ఆ కులాల నుంచి వచ్చే ఓట్లు ను కూడా పరిగణనలోకి తీసుకునే ఆవకాశం ఉంది. తుమ్మల ఇక్కడ నుంచి ఉప ఎన్నికల్లో గెలిచిన తరువాత అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. కరువు మండ లంగా ఉన్న తిర్మలాయపాలెం మండలంకు పాలేరు జలాలను భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా తరలించి ప్రజల్లో అభివృద్ధి ప్రధాత, అపరభగీరధుడుగా పేరు సంపాదించారు. ఆయనను ఓడించటం అంత తేలిక కాదనే అభిప్రాయం ఉంది. అయితే అభివృద్ధి ఎంత చేసినా డబ్బు, కుల రాజకీయాలు పైచేయి సాధించే ఆవకాశం ఉంది. ఎన్‌టివి అధినేత తమ్మల నరేంద్ర చౌదరి పేరు కూడా గత రెండు ఎన్నికల నుంచి వినిపిస్తుంది. ఆయనకు కాంగ్రెస్ హైకమాండ్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి. ఆయన గాని ఆయన కుటుంబసభ్యులు గాని టిక్కెట్ పోటిచేస్తారనే ప్రచారం జరుగుతుంది. అదే జరిగితే పోటి రసవత్తరంగా మారే ఆవకాశం ఉంటుందనటంలో ఏటాంటి సందేహం లేదు. ఈయనది కూడా ఇదే నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలం బొదులబండ గ్రామం. చాలా కాలంగా హైద్రాబాద్‌లో ఉంటున్నారు. మంచి వ్యాపార వేత్తగా పేరు సంపాదించారు. ఎన్‌టివి న్యూస్ చానల్, భక్తి టివిలు ఆయనవే. ఎన్నికలప్పుడు ఆయన పేరు కూడా తెరపైకి వస్తుంది. కాంగ్రెస్ నుంచి తుమ్మ లకు ధీటైన అభ్యర్థి ఉంటారా? ఉంటే ఏవరు వస్తారు? అనుకునే సందర్భంలో హేమా హేమీల పేర్లు ప్రజల నోళ్ళలో నానుతున్నాయి. ఇక సిపియం నుంచి కూడా పోటి అనివార్యంగా ఉంటుంది. టిడిపికి కూడా గణనీయమైన ఓటు బ్యాంకు ఈ నియోజకవర్గంలో ఉంది. టిడిపికి చెందిన వారు తుమ్మలతో పాటు టిఆర్‌యస్‌లో చేరినప్పటికి ఓటర్లలో తెలుగుదేశంను అభిమానించే వారు అలాగే ఉండటం విశేషం. నామా నాగేశ్వరరావుకు కూడా ఈ నియోజక వర్గంతో మంచి సంబంధాలున్నాయి.

గతంలో టిడిపి నుంచి మద్దినేని బేబి స్వర్ణకుమారి పోటిచేశారు. టిడిపి మొదట్లో టిఆర్‌యస్‌తో పొత్తు పెట్టకుం టుందనే వార్తలు వచ్చినా టిఆర్‌యస్, టిడిపిల మధ్య వైరం పెరిగింది. టిడిపి క్యాడర్ టిఆర్ఎస్‌ను ఓడించేందుకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్‌తో కలిసి పోటి చేసేందుకు వారు ప్రయత్నాలు చేసినా ఆశ్యర్య పోవా ల్సిన పనిలేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఎన్నికల కోసం ఆయా రాజకీయ పార్టీలు సమయాత్తం అవుతున్నాయి. ముందుగా పంచాయతీ, సొసైటీల ఎన్నికలకోసం పావులు కదుపుతున్నారు. రాష్ట్రంలో సర్వేల ద్వారా మిశ్రమ స్పందనలు కనిపి స్తున్నాయి. ఎవరికి వారు సర్వేలు తమకే అనుకూలంగా ఉన్నాయని ప్రచారం చేసుకుంటున్నారు. వారి సర్వేలకు నియోజక వర్గాల్లో క్రింది స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితలుకు తేడాలు కనిపిస్తున్నాయి. ఈసారి రాష్ట్రంలో హోరాహోరీగా పోరు జరిగే ఆవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పాలేరు పై ఏ పార్టీ జెండా ఎగురుతుందో చూడాలి మరి?

'మోడీ పాలనతోనే దేశం అభివృద్ధి'



భానుపురి, మేజర్‌న్యూస్ : దేశంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుటిల నీతి రాజకీయాలను మానుకోవాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, వరంగల్ వెస్ట్ మాజీ శాసనసభ్యులు ఎం. ధర్మారావు అన్నా రు. బుధవారం పట్టణంలోని సంకినేని వెంకటేశ్వరరావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొడుతూ కాంగ్రెస్ పార్టీ విడదీత రాజకీయాలు కొనసాగిస్తుందని విమర్శిం చారు. దేశంలో ఉగ్రవాదానికి ప్రాణం పోసింది కాంగ్రెస్ పార్టీ అని ఆరోపిం చారు. ఉగ్రవాదం గురించి గొప్పగా మాట్లాడుతున్న కాంగ్రెస్ జాతీయ నాయ కులు మణి శంకర్‌అయ్యర్ పౌరసత్వాన్ని రద్దుచేసి దేశంబయటకు పంపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ హయాంలో మూతబడిన రామగుండం ఎరువులు ఫ్యాక్టరికి ప్రధాన మంత్రి మోడీ ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు కేటా యించి తెరిపిస్తే మోడి తెలంగాణ ద్రోహి ఎలా అయ్యాడో కాంగ్రెస్ మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల్ పథకం పేరుతో ప్రతి ఇంటికి కరెంట్ సదుపాయం కల్పించాటానికి 700 కేవిలైన్లను వాగ్దా డీచ్‌పల్లి వరకు ఏర్పాటు చేసిందన్నారు. చత్తీస్‌ఘడ్, మహారాష్ట్రల నుండి వస్తున్న మిగులు విద్యుత్‌తో తెలంగాణ ప్రభుత్వం 24 గంటల విద్యుత్‌ను ఇస్తున్నామని సిఎం కేసిఆర్, మంత్రి జగదీష్‌రెడ్డి చెప్పు కోవడం హస్యస్పదమని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కొణతం సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి రంగారాజు రుక్మారావు, నాయకులు నూనె సులోచన, కౌన్సిలర్ చల్ల మల్ల నర్సింహ, అబీద్, నలలకుంట్ల అయోధ్య, రంగి నేని లక్ష్మన్‌రావు, సలి గంటి వీరేంద్ర, ఆడోజు సలేంద్రచారి, మైనార్టి సెల్ నాయులు యండి అస్లాం, వల్దాస్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాల పర్వంపై సిపిఐ సమావేశం

విజయవాడ, సూర్యప్రతినిధి : భూ కబ్జాలు, అవినీతి దందాల నుండి విజయవాడ నగరాన్ని కాపాడు కుందామనే పిలువుతో సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10.30 గంటలకు స్థానిక గాంధీనగర్, ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరుగు తుందని సిపిఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ వెల్లడించారు. ఈ మేరకు హనుమాన్ పేట, దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాదేదీ కబ్జాలకు అనర్హం అన్న రీతిలో విజయవాడ నగరంలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకుల అండదండలతో యథేచ్ఛగా భూ కబ్జాల పర్వం కొనసాగుతుం దన్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనపడినా, ఖాళీ భూమి కనపడినా గ్రద్ధల్లా వాలి పోయి నకిలీ పత్రాలు, నకిలీ రిజిస్ట్రేషన్లతో కాజేస్తున్నారని చెప్పారు. ఇటీవల పటమటలో ఒక ఇంటిని కబ్జా చేసిన సంఘటనలో వెనువెంటనే స్పందించిన పోలీసు యంత్రాంగం నివారణ చర్యలు చేపట్టిం దని, అయితే రాజధాని విజయవాడలో గత కొంత కాలంగా జరుగు తున్న ఆక్రమణలు, అవినీతి దందాలు, స్వాతంత్ర్య సమరయోధుని భూమి కబ్జా ఘటనలో సాక్షాత్తూ సెంట్రల్ ఎమ్మెల్యే సతీమ ణిపై సిఐడి అధికారులు ఎ8 ముద్దాయిగా కేసు నమోదు చేసినా, ఇప్పటికీ ఎటువంటి చర్యలు లేకపోవడం పోలీసు యంత్రాంగంపై రాజకీయ ఒత్తిళ్ళు ఏమేరకు ఉన్నాయో అవగతమౌతుందన్నారు. కబ్జాల బారి నుండి విజయ వాడను కాపాడాలనే పిలువుతో ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో రాజకీయాల కతీతంగా అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, అభివృద్ధి కాముకులు తప్పక పాల్గొనాలని కోరారు. సమావేశంలో సి.పి.ఐ. నగర సహాయ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు లంక దుర్గారావు, సీహెచ్.శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



త్వరలో దొనకొండకు మహర్దశ

- పరిశ్రమల స్థాపనతో పరిసర ప్రాంతం అభివృద్ధి
- జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి
- దొనకొండ మండలంలో 80 శాతం రోడ్లు పూర్తి
- అధిక నిధులతో మండలంలో అభివృద్ధి పనులు
- త్రాగు నీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు
- ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ కావాలి
- ప్రజా సమస్యలు విస్మరిస్తే సహించే ప్రసక్తే లేదు
- అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన
- రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు

దొనకొండ, మేజర్‌న్యూస్ : దొనకొండకు త్వరలో మహర్దశ పడుతుందని రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. బుధవారం స్థానిక దొనకొండ మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు మండల ప్రజా ప్రతినిధులు, అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు మాట్లాడుతూ పారిశ్రామిక రంగానికి నెలకొల్పేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. దొనకొండలో ఎయిర్ ఫోర్స్ సెంటర్ ఏర్పాటు చేయడానికి 2500 ఎకరాలు భూమి కేంద్ర ప్రభుత్వం కోరిందని సంబంధిత విషయంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడటం జరిగిందన్నారు. దొనకొండ స్పెయిన్ కంపెనీ ఆటో మోటర్ స్పెర్స్ కంపెనీ ఏర్పాటుకు ముందుకు వచ్చారన్నారు. త్వరలో దొనకొండలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే దొనకొండ గ్రామంలో కోటి రూపాయలతో సిమెంట్ రోడ్లు నిర్మించామన్నారు.

దొనకొండ అభివృద్ధి కార్యక్ర మాలకు మరో కోటి రూపాయలు నిధులు మంజూరు చేస్తామని మంత్రి తెలి పారు. దొనకొండ మండలంలో 80 శాతం రోడ్లు పూర్తి అయ్యాయన్నారు. రాబోయే ఒక్కటిన్నర సంవత్సర కాలంలో మిగిలిపోయిన రోడ్లు పూర్తి చేస్తామని అయన అన్నారు. మండల గ్రామాల్లో వైసీపీ సర్పంచ్‌లు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించడం లేదని అలాంటి గ్రామంల్లో ఎస్‌డీఎఫ్ నిధు లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దొనకొండ మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు నిర్మించడం జరిగిందన్నారు. ఎన్‌ఆర్‌ఇజీఎస్ పథకం క్రింద గ్రామాల్లో స్మశాన భూములు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. మండలంలో త్రాగు నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా త్రాగు నీరు సరఫరా చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దొనకొండ మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు దొనకొండ అభివృద్ధికి సహకరించాలన్నారు.



ఈ కార్యక్రమంలో దర్శి మార్కెట్ యార్డ్ కమిటీ అధ్యక్షులు సూరే చిన్న సుబ్బారావు, దర్శి నియోజకవర్గ ప్రత్యేక అధికారి బి రవి, దొనకొండ మండల పార్టీ అధ్యక్షుడు మోడే వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షులు గాలే శివ కోటేశ్వర రావు, ఎంపీడీ రాజేంద్ర, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బుల్లిరామయ్యకు నివాలర్పించిన సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు

- నేడు అంత్యక్రియలు

ఏలూరు, సూర్య బ్యూరో /తణుకు : కేంద్ర మాజీ మంత్రి, ఆంధ్రా షుగర్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ బోళ్ల బుల్లి రామయ్య(92) పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలోని స్వగృహంలో బుధవారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుల్లిరామయ్య 1926, జులై 9న తూర్పుగోదావరి జిల్లా తాటిపాక గ్రామంలో జన్మించారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. 1953 సంవత్సరంలో ఆంధ్రా షుగర్స్ లో చేరిన ఆయన వివిధ హోదాలలో పనిచేసి ఛైర్మన్, మేనేజింగు డైరక్టరు స్థాయికి ఎదిగారు. ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో ఆరువందల టన్నుల గానుగాట స్థాయి నుంచి ఆరు వేల టన్నుల గానుగాట స్థాయి కి సాంకేతికంగా అభివృద్ధిపరచటంలో కీలకపాత్ర వహించారు. 1984లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయ రంగప్రవేశం చేశారు. రాజకీయాల్లో ప్రవేశించిన వెంటనే 1984లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా పోటీచేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి వి.వి.ఆర్.పార్థశారథిపై 1,11,652 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 1989లో ప్రముఖ సినీ నటుడు, అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి ఘట్టమనేని కృష్ణపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 1991లో మరో సారి ఘట్టమనేని కృష్ణపై పోటీ చేసి 47655 ఓట్ల తేడాతో బిల్లిరామయ్య విజయం సాధించారు. 1984, 1991, 1996, 1999 ఎన్నికల్లో ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశంపార్టీ తరవున పోటీచేసి గెలుపొందారు. 1996-98 మధ్య కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. ఏలూరు పార్లమెంటరీ స్థానంలో నుండి మొత్తం 7సార్లు పోటీ చేసి నాలుగు సార్లు విజయం సాధిం చారు. బోళ్ళ బుల్లిరామయ్య జిల్లా రాజకీయాలలో రెండు దశాబ్దాల పాటు కీలకపాత్ర వహించిన బోళ్ల బుల్లి రామయ్య వివాద రహితుడిగా, సౌమ్యుడిగా, స్నేహ శీలిగా గుర్తింపు పొందారు. పారిశ్రామిక వేత్తగా, రాజ కీయ వేత్తగా ఆయన అం దించిన సేవలు చిరస్మరణీ యం. ఆయన మృతి వార్త తెలియగానే ఆంధ్రా షుగర్స్ కుటుంబసభ్యులు, టిడిపి శ్రేణులు తీవ్ర దిగ్భ్రాం తికి గురయ్యారు. పలువురు ప్రముఖులు ఆయన మ తదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



సీఎం చంద్రబాబు సంతాపం

కాగా బుల్లి రామయ్య మృతిపట్ల తెదేపా జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం సాయత్రం ఆయన హుటా హుటిన తణుకు చేరుకుని, బోళ్ళబుల్లిరామయ్య భౌతిక కాయానికి నివాళులర్పించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఆయన వెంటమస్త్రులు కె.ఎస్. జవహర్, కామినేని శ్రీనివాస్, శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, జడ్పి ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, మాజి ఎమ్మెల్యే వై.టి రాజ, ఎమ్ఎల్‌సి అంగర రామమోహనరావు, ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్ఎల్‌సి కరణం బలరాం, తదితరులు ఉన్నారు. ఆయన మ తి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. మస్త్రులు నారా లోకేశ్, కామినేని శ్రీనివాస్, కళా వెంకట్రావు తదితరులు ఆయన మ తిపట్ల సంతాపం ప్రకటించారు. గురువారం తణుకులో బోళ్ళబుల్లిరామయ్య అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆంధ్ర షుగర్స్ ప్రతినిధులు తెలిపారు.

మార్చిలో అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ త్రాగునీరు

- పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- మిషన్ భగీరథ పథకంలో నిధులకు కొరత లేదు
- దసరా లోపు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి
- రాష్ట్ర ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటెల రాజేందర్

కరీంనగర్-సూర్యప్రతినిధి : వచ్చే మార్చి మొదటి వారంలో జిల్లాలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ బల్క్ వాటర్ అందిస్తామని రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాలశాఖ మంత్రి ఈటెల రాజేంధర్ అన్నారు. బుధవారం కలెక్టరేటు సమావేశం మందిరంలో మిషన్ భగీరథ, డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ ప్రగతి భూ రికార్డుల శుద్ధికరణపై సంబంధిత అధికారులతో సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు ఇంటింటికి నల్లా ద్వారా త్రాగునీరు అందించుటకు మిషన్ భగీరథ పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేకంగా మిషన్ భగీరథ పనుల అమలు పై ప్రతి 15 రోజుల కొసారి రాష్ట్ర స్థాయిలో సమిక్షిస్తున్నారని తెలిపారు. కరీంనగ్ జిల్లాలో జనవరి13లోగా అన్ని గ్రామాలకు బల్క్ వాటర్ సరఫరా చేయాలని నిర్ణయించామని అయినను ఇంత వరకు ఎందుకు గ్రామాలకు నీరు సరఫా చేయుటలేదని మంత్రి ఇంజనీర్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇంకా 160 కిలోమీటర్ల పైపు లైన్లు వెయ్యాల్సి ఉందని ఎప్పటిలోగా పూర్తి చేస్తారని మంత్రి ఎస్.ఇ.ని అడిగి తెలుసుకున్నారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయ్యలని, ఎక్కువ మంది కూలీలను పెట్టి మిషన్లను ఏర్పాటు చేసి 24 గంటలు పనులు చేయించాలని నిర్ణిత గడువులోగా పనులు పూర్తి చేయించాలని మంత్రి ఇంజనీర్లను ఆదేశించారు. పైపులైన్లు వేయుటకు తగినన్ని సిద్దంగా ఉన్నయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సిలు పనులు వేగవంతంగా చెయ్యకుంటే వెంటనే తమకు తెలుపాలని మంత్రి సూచించారు. సంబంధిత ఏజెన్సిలతో మాట్లాడి పనులలో వేగం పెంచుటకు తగిన ఆదేశాలు ఇస్తామని లేని పక్షంలో వారిపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని మంత్రి అన్నారు. మిషన్ భగీరథ పథకంలో నిధులకు కొరత లేదని బిల్లులు రాగానే వెంటనే పేమెంట్ చేస్తున్నామని ప్రభుత్వం తపన తీవ్రతను అర్ధం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఇక నుండి నియోజకవర్గ స్థాయిలో శాసన సభ్యులు సంబంధిత డిఈలతో ఏజెన్సిలతో సమీక్షలు నిర్వహిం చాలని మంత్రి ఆదేశించారు. ప్రతి 15రోజులకు ఒకసారి జిల్లా కలెక్టర్ మిషన్ భగీరథ పనులను సమీక్షించాలని వారం వారం పనులను పర్యవేక్షించాలని సూచించారు. మిషన్ భగీరథ పనుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఏజెన్సిలను ఆదేశించారు.



దసరాలోపు డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

జిల్లాకు మంజురైన రెండుపడక గదుల ఇండ్ల నిర్మాణాలన్నింటిన వచ్చే దసరా పండుగలోపు పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాలశాఖ మంత్రి ఈటెల రాజేంధర్ అన్నారు. జిల్లాకు 6,454 మంజురు కాగా అన్ని ఇండ్లకు మండలాల వారిగా మంజురు ఉత్తర్వులు జారీ అయినాయని మంత్రి తెలిపారు. ఇంత వరకు 6,191 ఇండ్లకు టెండర్లు పూర్తి అయినాయని మంత్రి అన్నారు. మండలాలలో, గ్రామాలలో ఇండ్ల స్థలాలు అప్పగించిన ఇండ్లను వెంటనే పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తిచెయ్యాలని మంత్రి ఆదేశించారు. ఒక గ్రామంలో ఒకే చోట కాకుండా భూమి లభ్యత ప్రకారం కాలనీల వారిగా 5,10 ఇండ్లు ఉన్న మంజురు చేయాలని మంత్రి ఆదేశించారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్దిదారులకు ఇంత వరకు లేని నిరుపేద లైన అర్హులైనవారినే ఎంపిక చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రానికి చుట్టు పక్కాల గ్రామాల లబ్దిదారులు మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు కావాలంటే మంజురు చేయాలని మంత్రి సూచించారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన సిమెంటు, ఐరన్ తక్కువ ధరకు ఇప్పించే ఏర్పాటు చేస్తామని మంత్రి హామి ఇచ్చారు.

పట్టాదారుపాసు పుస్తకాల పంపినికి ఏర్పాటు చెయాలి

భూరికార్డుల శుద్ధికరణలో భాగంగా మార్చి 11న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణికి తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆర్‌డివోలను, తహసిల్దార్లను ఆదేశించారు. పట్టాదారు పాసుపుస్తకాలలో ఎలాంటి తప్పులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లాలో మార్చి 11న పట్దారు పాసు పుస్తకాల పంపిణి కార్యక్రమం అందరు శాసన సభ్యులను ప్రజాప్రతినిధులను భాగస్వాములను చెయ్యాలని గ్రామస్థాయిలో పండుగ వాతావరణంలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణి చేయాలని మంత్రి ఆదేశించారు. అలాగే జిల్లాలో వివిధ పాఠశాలలకు, కాలేజిలకు మంజురైన ప్రహారిగోడలు, టాయిలెట్ బ్లాక్‌ల మరమ్మత్తులు, అందనపు తరగతి గధుల భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఇఇ షఫిమియాను మంత్రి ఆదేశించారు.

భవన నిర్మాణాలకు ఏమైన భూ సమస్య ఉంటే సంబంధిత తహసిల్దారు పరిష్కరించి, హద్దులు నిర్ణయించాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ, జిల్లా కలెక్టర్ సర్ఫరాజు ఆహ్మద్, రాష్ట్ర సాంస్కృ తిక సారధి రసమయి బాలకిషన్, ఐడిసి చైర్మెన్ ఈద శంకర్‌రెడ్డి, శాసన మండలి సభ్యులు నారదాసు లక్ష్మణ్‌రావు, చొప్పదండి, హుస్నాబాద్ శాసన సభ్యులు బొడిగె శోభ, వొడితెల సతీష్‌కుమార్, మైనార్టి కార్పోరేషను చైర్మేన్ అక్బర్‌హుస్సెన్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రావీణ్య, మిషన్ భగీరథ, ఎస్ఇ అమరేంద్ర, ఆర్ ఆండ్ బి, ఇఇ రాఘవచారి, ఆర్‌డివోలు రాజాగౌడ్, చెన్నయ్య తదితరులు పాల్గోన్నారు.

పురుషామృగ వాహనంపై పరమేశ్వరుడి అభయం




తిరుపతి, సూర్యప్రతినిధి : తిరుపతి లోని కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీ కామాక్షి సమేత కపిలేశ్వరస్వామి వారు పురుషామృగ వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. వాహనసేవ ఆలయం నుండి మొదలై కపిలతీర్థం రోడ్, అన్నారావు సర్కిల్, వినాయకనగర్ ఎల్ టైప్ క్వార్టర్స్, హరేరామ హరేకృష్ణ ఆలయం, ఎన్‌జిఓ కాలనీ, అలిపిరి బైపాస్ రోడ్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. భక్తజన బ ందాల చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. తెల్లవారుజామున 12 నుండి ఉదయం 4 గంటల వరకు లింగోద్భవకాల అభిషేకం నిర్వహించారు. వాహనసేవ తరువాత స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసువు పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల కల్యాణమహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి స్థానిక ఆలయాల ఉపకార్య నిర్వహణా ధికారి సుబ్రమణ్యం, సహాయ కార్యనిర్వహణాధికారి శంకరరాజు, ప్రధానార్చకులు మణిస్వామి, ఎవిఎస్‌వో గంగరాజు, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నారాయణ, సి.మురలీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన ఫిబ్రవరి 15వ తేదీన త్రిశూలస్నానం వైభవంగా జరగనుంది. శ్రీ నటరాజ స్వామివారు సూర్యప్రభ వాహనంపై దర్శనమివ్వనున్నారు.

కేంద్రంపై టీఆర్ఎస్ నేతల మాటలు సరికాదు

- రాష్ట్రంలో మంత్రులకు తెలియకుండానే కేసీఆర్ కుటుంబ పాలన
- 2016-17లో రైతులకు చేసిన ఖర్చులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి
- టీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించిన బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ నేతల మాటలకు హద్దు లేకుండా పోయిందని బీజేపీ అధికార ప్రతినిధ కృష్ణసాగర్ రావు విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటే చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం..కేంద్ర ప్రభుత్వంపై బట్ట కాల్చి మీద వేస్తుందన్నారు. రాష్ట్రంలో మంత్రులు ఎవరో కూడా తెలియకుండా కేసీఆర్ కుటుంబం ప్రభుత్వాన్ని నడుపుతోందన్నారు. ప్రతీదీ కేంద్రానిదే భాద్యత అని అంటున్నారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం 2016-17లో రైతులకు ఏం ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మొదట మీరేం చేశారో చెప్పిన తరువాతే కేంద్రం గురించి మంత్రి హరీష్ రావు మాట్లాడుతే బాగుంటుందని చెప్పారు. కేంద్రం రైతులకు వెన్నుదన్నుగా నిలిచే విధంగా బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. కేంద్రం చూపిన విధంగా రైతులకు నేరుగా మార్కెట్లో అమ్ముకునే విధంగా మంత్రి హరీష్ ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పై టీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్న వాదనలు ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పాత బస్తీ అభివృద్ధి గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.




ఎక్కడ బడితే అక్క కేసీఆర్ గొప్పతనం చెప్పుకునే అసదుద్దీన్ నియోజకవర్గం ఎందుకు అభివృద్ధి కావడం లేదని ప్రశ్నించారు. భారత్ సైనికులకు మతం ఉండదనే విషయం అసదుద్దీన్‌కు తెలియదా అని ప్రశ్నించారు. అసద్ విభజన రాజకీయాలు చేస్తున్నారని, ఇలాంటి మాటలను మరోసారి వ్యాఖ్యానిస్తే బీజేపీ హెచ్చరిస్తోందని చెప్పారు. ఇకపై ఎంఐఎం హఠావో.. హైదరాబాద్ బచావో అనే నినాదంతో బీజేపీ పనిచేస్తుందని ఆయన చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అసదుద్దీన్ ఓటమి చవిచూసే విధంగా పార్టీ కొత్త నేతలను ప్రోత్సహిస్తోందని కృష్ణ సాగర్ వివరించారు.

'ప్రత్యేక హోదా కోసమే జగన్ కీలక నిర్ణయం'




విజయవాడ, మేజర్‌న్యూస్ : ప్రత్యేక హోదా కోసం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు పేర్కొన్నారు. ప్రత్యేక హోదా పోరాటం మరింత ఉధృతం చేయడం, పార్టీ ఎంపీల రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారని ఆయన అన్నా రు. అంబటి రాంబాబు బుధవారం విజయవాడ లోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. "జగన్ నిర్ణయాన్ని అనేకమంది స్వాగతించారు. కానీ టీడీపీ నేతలకు మింగుడు పడటం లేదు. ఎంపీలు తమ పదవులు తృణప్రాయంగా వదులుకుంటుంటే, వారిని కించపరచడం ప్రత్యేక హోదాను అవమానించడమే. బీజేపీ-టీడీపీ కలిసి ప్రత్యేక హోదాను భూస్థాపితం చేస్తుంటే, రాష్ట్రాభివృద్ధి కోసం మా ఎంపీలు రాజీనామాలకు సిద్ధపడ్డారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకే ఈ నిర్ణయం. ప్రధాని ప్రసంగం సమయంలో మా ఎంపీలు నిరసన తెలిపితే టీడీపీ ఎంపీలు మాత్రం మౌనంగా కుర్చీల్లో కూర్చున్నారు. పదవులు త్యజించడం డ్రామానా, మీరు మాత్రం మంత్రి పదవులు మాత్రం వదులుకోరు. డ్రామాలు మావి కావు మీవి. పార్లమెంట్ బయట మీ ఎంపీలు డ్రామాలు, లోపల ఎంపీ గల్లా జయదేవ్ డ్రామా, అది నాటకం కాదా. ఒక్క క్షణం కూడా పదవులు వదులుకోలేని మనస్థత్వం చంద్రబాబుది. విబజన హామీలపై కోర్టుకెళ్తామంటూ చంద్రబాబు లీకులు ఇస్తున్నారు. కేంద్రంలో ఉండి కోర్టుకెళ్తామని డ్రామలెందుకు, మీ డ్రామాలు ఆరుకోట్ల మంది ప్రజలు గమనిస్తున్నారు. కేంద్రం అన్యాయం చేస్తే మరి అదే కేంద్రంలో ఎందుకు మంత్రులుగా కొనసాగుతున్నారు. చంద్రబాబు చౌకబారు విమర్శలు మానుకో. మీకు దమ్ము, ధైర్యం ఉంటే మీరు కూడా మంత్రి పదవులకు రాజీనామాలు చేయండి. ప్రత్యేక హోదా కోసం అందరం పిడికిలి బిగిద్దాం. టీడీపీ ఎన్ని కుట్రలు చేసినా హోదాపై మా పోరు కొనసాగుతుంది. హోదా సాధించేవరకూ రాజీలేని పోరాటం చేస్తాం." అని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

త్వరలో కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటు : నాయిని



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రాష్ట్రంలో మరిన్ని కొత్త పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో పోలీస్ శాఖ బాగా పనిచేయడం వల్లే గడిచిన మూడున్నరేళ్లలో ఒక్క అవాంఛనీయ ఘటన చోటు చేసుకోలేదని చెప్పారు. దేశంలోనే తెలంగాణ పోలీసింగ్ నంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు. అలాగే జహీరాబాద్‌తో పాటు మరికొన్ని ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తామని నాయిని వివరించారు.

ఏపీకి ప్రత్యేక హోదా రాదు




తిరుపతి, మేజర్‌న్యూస్ : ప్రత్యేక హోదాపై కేంద్రం స్పందించకపోతే వైసీపీ ఎంపీలు రాజీనామా చేస్తారన్న జగన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ చింతా మోహన్ స్పందించారు. వైసీపీ ఎంపీలు రాజీనామా చేసినా 2019లోపు ఏపీకి ప్రత్యేక హోదా రాదని అన్నారు. డబ్బులు ఇచ్చి జగన్ పాదయాత్రకు జనాలను రప్పించు కుంటున్నారన్నారు. కేసులనుంచి తప్పించుకునేందుకే జగన్ పాదయాత్ర చేస్తున్నారని చింతామోహన్ ఆరోపించారు.

ముగియనున్న నుమాయిష్ ఎగ్జిబిషన్



హైదరాబాద్, సూర్యప్రతినిధి : మంచి తరుణం మించినా దొరకదు.. ఆలసించినా ఆశాభంగం అంటూ ఆఫర్ల మీద ఆఫర్లు ఊదర కొడుతుంటే మగువల మనసు ఊరుకుంటుందా... ఒక్కసారైనా అటు వెళ్లి కావల్సిన ఐటెమ్స్ కొనుక్కుని తెచ్చుకునే వరకూ తెగ ఆరాటపడిపోతారు. నుమాయిష్ అంటే అతితక్కువ ధరకు దొరికే వస్తువులే అందరికీ గుర్తుకువస్తాయి. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ దొరికే బట్టలు, ఆర్నమెంట్స్, ఫర్నిచర్ ఒక్కటేమిటి అన్నీ దొరుకుతాయి. అంతెందుకు ఇక్కడకు వచ్చి కావలసిన వస్తువు కనిపించకుండా వెనుతిరగని వాళ్లు ఇప్పటి వరకూ లేరంటే అతిశయోక్తి కాదు. అంతలా భాగ్యనగరవాసులతో బంధాన్ని పెనవేసుకుంది నుమాయిష్ ఎగ్జిబిషన్. భాగ్యనగరంలో జరిగే అతిపెద్దదైన పారిశ్రామిక ప్రదర్శనగా పేరొందిన నుమాయిష్ సందడికి ఇంకా కొద్ది రోజులే మిగిలింది. కనీసం ఒకసారైనా వెళ్లకపోతే జీవితంలో ఏదో వెలితిగా అనిపించేలా నుమాయిష్ నగర జీవితంతో భాగంగా మారిపోయింది. అయితే మరికొద్ది రోజులలో నుమాయిష్ ముగుస్తున్న సందర్భంగా అనేకమంది ఎగ్జిబిషన్ సందర్శిస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడ తమ విక్రయాలు సాగిస్తుంటారు. ఆటపాటలాడుకునే పిల్లల కోసం గేమింగ్ జోన్లు, మహిళలు, పెద్దల కోసం షాపింగ్ సౌకర్యాలతో నగరవాసులను కనువిందు చేస్తుంది నుమాయిష్. పంజాబ్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్నాటక, ఒడిశా, కేరళ, తమిళనాడు, పశ్చిబెంగాల్లకు చెందిన సాంస్కృతిక సంస్థలు, అసోసి యేషన్లు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి స్వయం సహాయక సంఘాలు, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, లక్నో, జమ్మూకశ్మీర్ నుంచి మహిళా పారిశ్రామిక వేత్తలు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శనకు ఉంచుతుంటారు. మొత్తం 2500 స్టాళ్లు అందుబాటులో ఉండటంతో ప్రజలు తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేసుకుంటున్నారు. ఇక్కడ చీప్ అండ్ బెస్ట్‌గా ఇంటోకి.. అలంకరణకు అన్ని ఐటెమ్స్ కొనుగోలు చేసుకుంటున్నారు. మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి కొత్త షాపింగ్ అనుభూతిని పొందుతున్నారు.

ప్రజా సంకల్ప యాత్రలో అపశ్రుతి



నెల్లూరు, మేజర్‌న్యూస్ : ప్రజాసంకల్ప యాత్ర పేరిట విపక్ష నేత వైఎస్ జగన్ నిర్వహి స్తున్న పాదయాత్రలో బుధవారం చిన్న అపశ్రుతి దొర్లింది. జగన్ పాదయాత్ర కలిగిరి మండలం తెల్లపాడు క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగానే వైసీపీ కార్యకర్తలు తమ అభిమాన నేతకు స్వాగతం పలుకుతూ పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. అయితే ఆ బాణాసంచా కాస్త రోడ్డుపక్కన ఉన్న చెట్లు, ఎండుగడ్డిపై పడడంతో పెద్దఎత్తున మంటలతోపాటు పొగ మొత్తం దట్టంగా అలుముకుంది. దీంతో ఆ మంటలను దాటి జగన్ పాదయాత్ర ముందుకు పోవడానికి కొంత ఇబ్బంది కలగగా సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు జగన్‌ను సురక్షితంగా మంటలు వ్యాపించిన ప్రదేశం నుంచి దాటించారు. అనంతరం మంటలను వైసీపీ కార్యకర్తలు ఆర్పివేశారు

టిటిడి ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల



తిరుపతి, మేజర్‌న్యూస్ : రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు ఏప్రిల్ నెల కోటా ఫిబ్రవరి 15న ఉదయం 11 గంలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తుల సౌకర్యార్థం రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల ఏప్రిల్ నెల ఆన్‌లైన్ కోటాను ఫిబ్రవరి 15వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు టిటిడి విడుదల చేయనుంది. తిరుమల జెఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు ఆదేశాల మేరకు ఐటి అధికారులు ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్‌లో ముం దస్తుగా రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను బుక్ చేసుకోవాలని టిటిడి కోరుతోంది.







ప్రకృతి అందాలసోన తలకోన

చుట్టూ ఎత్తయిన కొండలు... దట్టమైన అరణ్యం, పక్షుల కిలకిల రావాలు, గలగల పారేసెలయేరు మధ్యలో ఓజలపాతం ఉంటే ఎంత బాగుంటుందో కదా. అంత అందమైన ప్రకృతి ఎక్కడుందా అనుకుంటున్నారా? మరెక్కడో కాదు... చిత్తూరు జిల్లాలో. ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తిరుపతికి 58 కిలోమీటర్ల దూరంలోనే ఈ రమణీయ ప్రదేశం ఉంది. అదే తల కోన జలపాతం. ఈ ప్రాంతం నిత్యం పర్యాటకులతో కళకళలాడు తుంటుంది. సాక్షాత్తూ ఆదిశేషుడే పర్వత రూపం దాల్చాడని పురాణ గాథ. కుబేరుని అప్పు తీర్చేందుకు శ్రీనివాసుడు ధనాన్ని కొలిచి అలసిపోయి నిద్ర పోయాడని చెబుతారు. అలా పడుకోవడంలో తల భాగం ఇక్కడ ఉన్న కొండ (కోన) శిఖరం మీద ఆనించాడని అందుకే ఈ ప్రదేశానికి తలకోన అనే పేరు వచ్చిందని స్థల పురాణం. మన రాష్ట్రంలో ఎత్తయిన జలపాతం కూడా ఇదే మరి!!. దీన్ని శిరో ద్రోణం అని కూడా పిలుస్తారు. తలకోనలో దాగిఉన్న అందాలను ఒకసారి చూసినట్లయితే...

శిరోద్రోణి తీర్థం : తలకోన శేషాచల పర్వతంలో ఉంది. శ్రీశైలం వద్ద పర్వత చివరి భాగం ఉండగా, తలకోన, తిరుమల గిరిలు శేషాచల పర్వతాల తల భాగంగా ఇతిహాసాల్లో పేర్కొన్నారు. ఎడమవైపు భాగంగా శిరోద్రోణి తీర్థంగా (ఝరి), కుడివైపు తిరు మల వద్ద పాపవినాశంగాను ఈ తీర్థంలో భక్తులు తరిస్తుంటారు. శిరోద్రో ణి తీర్థానికి వెళ్లే దారిలో అటవీశాఖ స్నాన ఘట్టాన్ని ఏర్పాటు చేసింది. శిరోద్రోణి కి వెళ్లలేని పెద్దలు, చిన్నారులు ద్రోణితీర్థం నుంచి పారే గంగాజలంలో స్నాన మాచరించి శివుని దర్శించుకుంటారు.

తలకోన జలపాతం: నల్లమల పర్వతశ్రేణుల్లో ఈజలపాతం ఉండడం విశేషం. కొండ అంచుల్లో దట్టమైన అడవిగుండా దాదావు 2కిలోమీటర్లు ముందుకు వెళ్తే అక్కడ జాలు వారే జలపాతాన్ని చూడొచ్చు. చుట్టూ దట్టమైన అడవి, ఎత్తన కొండలు, మధ్య లో జలపాతాన్ని చూసిన పర్యాటకులకు చిత్రమైన అనుభూతి కల్గు తుంది. జలపాత దృశ్యం నయనా నందకరంగా, చాలా అకర్షణీయంగా వుంటుంది.

జలపాతం కింద తడుస్తూ.. దాదావు అరవై మీటర్ల ఎత్తునుంచి జాలువారే జలపాతం కింద నిలబడితే శరీరమంతా చిత్రమైన జలదరింపుకు లోనవుతుంది. ఇక అక్కడినుండి కదలాలని ఎవరికైనా అనిపిస్తుందా చెప్పండి? అలాగే జలపాతం కింద పడడం వల్ల ఆ ప్రాంతంలో ఓ పెద్ద గుంటలా ఏర్పడింది. అక్కడ పర్యాటకులు హాయిగా ఈత కొడుతుంటారు.

తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయం
తలకోన జలపాతం ఉన్న ప్రాంతంలోనే ఓ శివాలయం ఉంది. ఇక్కడి శివుడు సిద్ధేశ్వరుని రూపాన కొలువై ఉన్నాడు.

తలకోన.. రాయలసీమలోనే అతి సుందర పర్వత, పర్యాటక ప్రాంతం. దట్టమైన అడవి. 270 అడుగుల ఎత్తు నుంచి జాలువారే జలపాతం. చల్లని గాలికి గలగల శబ్దం చేస్తూ తలలూపే వృక్ష సమూహాలు.. పక్షుల కిలకిలరావాలతో నిండి ప్రకృతిలో మమేకమైన అందాల హరివిల్లు. కమనీయ దృశ్యాలే కాదు.. ఇదో వనమూలికల ఔషధాలయం. ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించే సిద్ధేశ్వరుడు సంతాన ప్రదాతగా విరాజిల్లుతున్నాడు. ఈ మలయమారుతాల్ని ఆస్వాదించి సేదతీరాలంటే నేత్రమనోహరమైన ప్రకృతి పొదరిల్లును సందర్శించాల్సిందే.

సిద్ధ యోగులు, మును లు తపస్సు చేసి కైలాస అధిపతి శంకరుని అనుగ్రహం పొందారని ప్రతీతి. దీంతో సిద్ధ యోగు లు శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయం నిర్మాణానికి సంకల్పించారు. తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయాన్ని క్రీ.శ.16వశతాబ్దంలో వన్నం అప్ప స్వామి దీక్షితులు (సిద్ధ యోగి) నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఇక్కడ శివుడితో పాటు అమ్మవారు [illegible] పర్యాటకులు తీసుకెళ్లే వాహనాలను ఈ దేవాలయ ప్రాంతం వరకు మాత్రమే అనుమతిస్తారు. అక్కడ్నుండి జలపాతం దగ్గరికి చేరుకోవాలంటే పాదయాత్ర చేయాల్సిందే. ఈ ఆలయానికి అతిసమీపంలో వాగు ప్రవహిస్తుంటుంది. ఇందులోని [illegible] దినాన ఉత్సవాలు జరుగుతాయి. తలకోన అటవీ ప్రాంతంలో తలకోన నెలకోన అనే పేర్లున్న రెండు జలపాతాలు ఉన్నాయి. వీటిని జంట జలపాతాలని పిలుస్తారు.

నెలకోన : నెలకోన అన్నది దట్టమైన కొండల మధ్య ఉంది. ఇక్కడి రెండు కొండల నడుమ ఒక నీటి ప్రవాహము వచ్చి ఒక కొలనులో దూకుతూ ఉంటుంది. ఎంత ఎత్తు నుంచి నీళ్లు జాలువారుతాయో కనిపించవు. రెండు కొండల నడుమ ఉండే పెద్ద గుండు ఎప్పుడు మీద పడుతందో అని భయపడక మానరు. ఔషధ లక్షణాలు కల మొక్కలు అనేకం ఉన్నాయి. ప్రకృతిని పక్షులను జంతువులను చూడడానికి అటవీ శాఖవారు వాచ్ టవర్లను నిర్మించారు. వాటి పైకెక్కి చూడవచ్చు.

[illegible] ప్రదేశం. వృక్ష సంపదకు, వనమూలికలకు పుట్టినిల్లు. ఈ అడవుల్లో వృక్షాలు చాలా ఎత్తుగా ఉంటాయి. సూర్యరశ్మి నేలమీద పడనంత దట్టమైన అడవి కావడంతో చెట్లు సూర్యరశ్మిని అందుకోవడానికి పైకి పైపైకి పెరుగుతాయి. ఎక్కువగా [illegible] ప్రధానంగా అడవికోళ్లు, ముళ్లపందులు, దేవాంగుపిల్లి, బెట్లుడత, ఎలుగుబంట్లు, మచ్చకోతి, దుప్పులు, కణితులు, విష్ణుగులు ఉన్నాయి.

రామలక్ష్మణుల వృక్షాలు...
తలకోన శిరోద్రోణి తీర్థం (వాటర్ పాల్స్, ఝరి)కి వెళ్లే దారిలో రామలక్ష్మణుల మామిడి వృక్షాలు ఉన్నాయి. ఒకే పొడవుతో ఉన్న ఈ వృక్షాలను భక్తులు రామలక్ష్మణ వృక్షాలుగా పిలుస్తారు. వారు ఈ పర్వతాలపై సంచరించారనడానికి గుర్తుగా ఈ వృక్షాలు ఉన్నట్లు భక్తుల నమ్మకం.

బోటింగ్, చిల్డ్రన్స్ పార్క్....
తలకోనకు వచ్చే పర్యాటకులకు కొత్త అనుభూతిని కల్పించాలనే సంకల్పంతో అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపంలో బోటింగ్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా తలకోన ఏటిలో బోటింగ్‌కు అనువుగా కొలనులు ఏర్పాటు చేశారు. అలాగే చిన్నపిల్లల ఆటవిడువు కోసం చిల్డ్రన్స్ పార్క్ ఉంది. అటవీ అందాలను వీక్షించే పర్యాటకుల కోసం ప్రత్యేక వాహనాన్ని అందుబాటులో ఉంది.

కెనఫీవాక్
పర్యాటకులు చెట్లపై నడవడానికి అటవీ శాఖ వినూత్న ప్రయోగం చేసింది. అదే కెనఫీవాక్. అత్యంత ప్రతిష్టాత్మకంగా అటవీ అధికారులు దీనిని నిర్మించిన. కెనపీ వాక్ అత్యంత పొడవైన జాలరి చెట్లను ఆధారంగా చేసుకున్నారు. 240 మీటర్లు పొడవునా భూమికి 40 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన కెనపీ వాక్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేది. అయితే కెనపీ వాక్ వల్ల జాలరి చెట్లు శిథిలమయ్యే ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ నిపుణుల హెచ్చరికలతో దీన్ని మూసివేసారు.

నెమళ్లు, లేడిలు, జింకల సందడి...
పర్యాటకులను ఆకర్షించేందుకు అటవీ శాఖ నెమళ్లను కూడా పెంచుతోంది. తలకోనలోని జలపాతాన్ని సందర్శించే పర్యాటకులకు జింకలు, చెంగున దూకే లేళ్లు కనిపిస్తాయి. సాయంత్రం వరకు జలపాతం వద్ద గడిపి పొద్దుపోయే సమయానికి గుడిదగ్గరికి చేరుకుంటారు.

సినిమా వాళ్ల సందడి...
తలకోనలో నిత్యం అనేక సినిమా షూటింగులు జరుగుతూనే వుండటం విశేషం. దక్షిణాది చిత్రాలలో ఫారెస్టు సీన్ ఏది తీయాలన్నా ముందుగా నిర్మాతలకు గుర్తు వచ్చేది తలకోనే కావటంతో పాటు ఇక్కడి వాతావరణ ఆహ్లాదకరంగా ఉండటంతో పరిశ్రమలోని వారంతా దీనికే ప్రాధాన్యత ఇస్తారు.

విడిది కోసం
తలకోన జలపాతానికి దగ్గర్లోని ఆలయ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ నిర్మించిన ఓ అతిథి గృహం ఉంది. అలాగే వచ్చి విడిది చేసే వారి కోసం ఫారెస్టు శాఖ గెస్ట్ హౌస్ తిరువుల తిరుపతి దేవస్థానం గదులు ఉన్నాయి. ఆలయానికి తలకోనకు వెళ్లే పర్యాటకులు తినే పదార్థాలను వెంట తీసుకెళ్లాలి. ఏమీ తీసుకెళ్లనివారు ఆలయం దగ్గరున్న హోటల్లో ముందుగా చెపితే భోజనం ఏర్పాటు చేస్తారు.

– సత్య గోపాల్, హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి దగ్గరలో, విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో పారుతున్న
కృష్ణానదిలో [illegible] 133 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భవానీ ద్వీపం [illegible]
ఇక్కడికి పర్యాటకుల తాకిడి రోజురోజుకీ పెరుగుతుండటంతో సరికొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నారు అధికారులు.
రాజధానిలో కీలక ప్రాంతం కావడంతో ఈ ద్వీపం అభివృద్ధిపై టూరిజం కార్పొరేషన్ (బిఐటిసి) దృష్టిసారించింది.
ఇప్పటికే నౌకాయానంతోపాటు [illegible] పర్యాటకులను ఎంతగానో
ఆకట్టుకుంటున్నాయి. తెలుగువాళ్లు తప్పక చూడాల్సిన ప్రదేశం ఈ భవానీ ద్వీపం అనడంలో సందేహమే లేదు.
మరికేం... ఈ సారి టూర్‌లో ఈ ద్వీపానికి మీ చిన్నారులతో కలసి వెళ్లండి










ఇలా వెళ్లాలి!

విమానాశ్రయం తలకోన జలపాతానికి సుమారుగా 45 కిలోమీటర్ల దూరంలో ఉన్నది తిరుపతి విమానాశ్రయం. ఈ తిరుపతి విమానాశ్రయానికి దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, చెన్నై, ముంబై, కలకత్తా, హైదరాబాద్, బెంగళూరు మొదలగు ప్రాంతాలనుంచి విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే స్టేషన్ తలకోనకి చేరువలో ఉన్న రైల్వే స్టేషన్ తిరుపతి. ఈ స్టేషన్‌కి దేశంలోని అన్ని ప్రధాన నగరాలనుంచి రైళ్లు వస్తుంటాయి. తలకోనకి ఈకాక్డి నుంచి రావాలంటే బస్సు ద్వారా కానీ, ట్యాక్సీల ద్వారా కానీ లేకుంటే స్టేషన్ బయటికి వస్తే ఆటోలు దర్శనమిస్తాయి. అవి ఎక్కి కూడా రావచ్చు. రోడ్డు మార్గం ఒకవేళ మీరు రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించాలనుకుంటే, చిత్తూరు జిల్లా ఎర్రావారి పాళెం, వైఎస్ఆర్ జిల్లా సరిహద్దుకు దగ్గరగా ఉంది తలకోన. ఇక్కడికి చేరుకోవాలంటే తిరుపతి గుండా ప్రయాణించాలి. తిరుపతి, పీలేరుల నుంచి తలకోనకు ప్రతి గంటకు ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. తిరుపతి – మదనపల్లె జాతీయ రహదారి మార్గంలోని భాకరాపేట చేరుకుంటే అక్కడ నుంచి ఆటోలు, జీపులు ఉంటాయి.



తమ్ముడి మనసుకి నచ్చింది



మహేష్ బాబు సోదరి మంజుల దర్శకురాలిగా మారి రూపొందిస్తున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. జెమిని కిరణ్‌తో కలిసి మంజుల భర్త సంజయ్ స్వరూప్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం ఈనెల 16న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కి మహేష్ హాజరై చిత్ర యూనిట్‌కి ఆల్ ద బెస్ట్ చెప్పారు!

అన్నీ అద్భుతంగా అమరడం వల్లే!




ఛాయాగ్రహణం, సంగీతం, ఆర్ట్ వర్క్, హీరో–హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ వంటి అంశాలన్నీ అనుకోకుండా అలా అమరాయి. అందుకే 'తొలిప్రేమ' అంత పెద్ద విజయం సాధిస్తోంది' అంటోంది ఆ చిత్ర బృందం.

ఈ చిత్రం సాధిస్తున్న అనూహ్య విజయాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన 'థ్యాంక్యూ మీట్'లో చిత్ర నిర్మాతలు ప్రసాద్, బాపినీడు, హీరో వరుణ్‌తేజ్, హీరోయిన్ రాశీఖన్నా, దర్శకుడు వెంకీ అట్లూరి, ఈ చిత్రాన్ని అవుట్‌రైట్‌గా కొలుగోలు చేసిన దిల్ రాజు, ఛాయాగ్రాహకుడు జార్జ్, సంగీత దర్శకుడు తమన్, ఈ చిత్రంలో 'అక్క' పాత్ర పోషించిన విద్యుల్లేఖ తదితర చిత్ర బృందం పాల్గొని ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్ర విజయంలో మేజర్ క్రెడిట్ హీరో వరుణ్‌తేజ్‌కి వెళ్తుందని, వెంకీ చెప్పిన కథను అతను పూర్తిగా నమ్మడం వల్లే ఈ విజయం సాధ్యమయ్యిందని నిర్మాతలు ప్రకటించారు. 'తొలిప్రేమ' వంటి గొప్ప సినిమాలో భాగమైనందుకు గర్వపడుతున్నామని మిగతా వారంతా చెప్పారు.

మహేష్‌బాబు–అల్లు అర్జున్ మధ్యలో రజనీకాంత్







ఏ మాటకా మాటే చెప్పుకోవాలి. ఏప్రిల్ 27న వస్తున్నామని ముందుగా ప్రకటించింది అల్లు అర్జున్ నిర్మాతలే. వక్కంతం వంశీని దర్శకుడిగా పరిచయం చేస్తూ నాగబాబు సమర్పణలో లగడపాటి శ్రీధర్ నిర్మిస్తున్న 'నా పేరు సూర్య–నా ఇల్లు ఇండియా' చిత్రాన్ని ఏప్రిల్ 27న విడుదల చేస్తున్నామనే ప్రకటన తొలుత వెలువడింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ సరసన అను ఇమ్మాన్యుయేల్ నటిస్తోంది.

అయితే కొరటాల శివ దర్శకత్వంలో మహేష్‌బాబు రెండోసారి నటిస్తున్న 'భరత్ అనే నేను' చిత్రాన్ని కూడా అదే రోజు విడుదల చేస్తున్నట్లు ఆ తర్వాత ప్రకటించారు. ముందు మేము ప్రకటించాం కదా? అదే రోజు మీరెలా వస్తారు? అంటూ 'నా పేరు సూర్య' సహ నిర్మాత, అల్లు అర్జున్‌కి అత్యంత ఆప్తుడయిన బన్నీ వాస్ ప్రశ్నించారు. ఇరు వర్గాల నడుమ చర్చలు జరిగి ఎవరో ఒకరు ఒక వారం ముందుకు కానీ, వెనక్కి కానీ వెళ్తార్లే అనుకున్నారు అందరూ. కానీ ఇద్దరూ తగ్గలేదు. ఎప్పటికప్పుడు 'ఏప్రిల్ 27 విడుదల' అన్న విషయాన్ని ప్రకటిస్తూనే ఉన్నారు.

అయితే ఇంతలో.. అదే రోజు రజనీకాంత్ '2.0' వస్తోందనే వార్త వచ్చింది. తెలుగులో ఇద్దరు టాప్ స్టార్స్ సినిమాలు విడుదలవుతున్న రోజు.. పరాయి భాషకు చెందిన హీరో సినిమా ఎలా విడుదల చేస్తారు? అనే వాదన తెర మీదకొచ్చింది.

అయితే.. నందమూరి బాలకృష్ణ సినిమా విడుదలైన రోజున తమిళ హీరో సూర్య 'గ్యాంగ్' సినిమాను రిలీజ్ చేసుకునేందుకు ఎలా అనుమతించారు? అనే కౌంటర్ మొదలైపోయింది.

ఇంతలో.. కొన్ని సాంకేతిక కారణాల వల్ల '2.0' వాయిదా పడింది' అన్న వార్త వచ్చింది. రజనీకాంత్‌కు తెలుగులో ఉన్న ఫాలోయింగ్‌కి తోడు.. 'శివాజీ, రోబో' చిత్రాల అనంతరం శంకర్ దర్శకత్వంలో రజనీ నటిస్తున్న చిత్రం కావడంతో ఉండే క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకొని.. '2.0' చిత్రం వాయిదా పడిందన్న వార్త అందరికీ సంతోషాన్ని కలిగించింది.

కానీ.. ఆ సంతోషం ఎక్కువ రోజులు నిలవలేదు. '2.0' కి బదులుగా అదే రోజు రజనీకాంత్ నటించిన మరో సినిమా 'కాలా' విడుదల కానుందనే ప్రచారం మొదలైంది.

ఇటీవలే ఎట్టకేలకు పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన రజనీ ప్రస్తుతం తన సొంత పార్టీకి సంబంధించిన ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. '2.0, కాలా' సినిమాల తర్వాత రజనీ ఇకపై సినిమాలు చేయరనే ఊహాగానాలు షికారు చేస్తున్న నేపథ్యంలో.. ఈ రెండు సినిమాలు చాలా బాగా వచ్చాయని.. ఆ ధీమాతోనే రజనీ రాజకీయంగానూ తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారనే అంచనాలు జోరుగా వినిపిస్తున్నాయి.

ఈ విషయం పక్కన పెడితే.. మహేష్‌బాబు, అల్లు అర్జున్ సినిమాలు రెండూ ఒక రోజు ముందుగా.. అంటే ఏప్రిల్ 26న విడుదల కానున్నాయంటూ అధికారిక ప్రకటనలు వెలువడడం తెలుగు సినిమా రంగంలో వేడి పుట్టిస్తోంది.

పెద్ద హీరోల సినిమాలైనా సరే.. ఇకపై సోలో రిలీజ్‌లు కష్టమే అని గత కొన్ని వారాలుగా విడుదలవుతున్న సినిమాలు నిరూపిస్తునే ఉన్నాయి. రెండు రోజుల తేడాతో 'అజ్ఞాతవాసి, జైసింహా' విడుదలైతే.. ఒకరోజు వ్యవధితో 'ఇంటిలిజెంట్, తొలిప్రేమ' రిలీజ్ అయ్యాయి. కాబట్టి.. 'నా పేరు సూర్య, భరత్ అనే నేను' ఒకే రోజు ప్రేక్షకుల ముందుకు రానుండడంలో పెద్ద ప్రత్యేకత లేకపోయినా.. విడుదల విషయంలో ఇద్దరూ పోటీ పడుతుండడం అందరి దృష్టినీ విశేషంగా ఆకర్షిస్తోంది.

హాట్ సమ్మర్‌లో కూల్ ఎంటర్‌టైనర్

ఇటీవలే భాగమతి లాంటి సూపర్ బ్లాక్‌బస్టర్‌ని సాధించిన యువి క్రియేషన్స్ పాకెట్ సినిమాతో కలిసి లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో యంగ్ హీరో సుమంత్ అశ్విన్, మెగా ప్రిన్సెస్ నిహారిక కొణిదెల జంటగా నిర్మిస్తున్న సినిమా "హ్యాపి వెడ్డింగ్". యువి క్రియేషన్స్ బ్యానర్‌లో తొలిసారిగా సుమంత్ అశ్విన్ నటిస్తున్నారు. ఈ కథ చెప్పగానే చాలా ఎక్సైట్ అయిన హీరోయిన్ నిహారిక మొట్టమెదటిసారి సుమంత్ అశ్విన్‌తో నటిస్తుండడం విశేషం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి ఫిదా సంగీత దర్శకుడు శక్తికాంత్ కార్తీక్ మ్యూజిక్ అందిస్తున్నారు. త్వరలోనే టీజర్ రిలీజ్ చేయనున్నారు. సమ్మర్‌లో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తారు.



సామిరంగా అనిపిస్తోందా?



నితిన్, మేఘా ఆకాష్ జంటగా శ్రేష్ట్ మూవీస్, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ నిర్మిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. ఇది కథానాయకుడు నితిన్‌కు 25 వ చిత్రం. మాటల మాంత్రికుడు, దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా విడుదల చేసి చిత్రం యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'ఛల్ మోహన్ రంగ' టీజర్‌కు లభిస్తున్న స్పందన ఎంతో సంతోషంగా ఉందని హీరో నితిన్ తన స్పందనను సోషల్ మీడియా వేదికగా తెలిపారు. శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో ప్రముఖ నిర్మాత ఎన్. సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని కృష్ణ చైతన్య దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. హైదరాబాద్, ఊటీ, అమెరికాలలో ఇప్పటివరకు షూటింగ్ జరుపుకుందీ ఈ చిత్రం. 'ఛల్ మోహన్ రంగ' ఆఖరి పాట చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభమయింది.

నువ్వంటే నాకు చచ్చేంత ప్రేమని

చెప్పడానికి నీకు ఏ సాక్ష్యం కావాలి?



లక్ష్యం, శౌర్యం, లౌక్యం వంటి సూపర్‌హిట్ చిత్రాలను అందించిన శ్రీవాస్ తాజాగా రూపొందిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. బెల్లంకొండ శ్రీనివాస్–పూజా హెగ్డే జంటగా నటిస్తున్న ఈ చిత్రంలోని ఓ స్టిల్‌ను ప్రేమికుల దినోత్సవ కానుకగా విడుదల చేశారు. యాక్షన్ ప్యాక్‌డ్ లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నామా అభిషేక్ నిర్మిస్తున్నారు. వేసవిలో ఈ చిత్రం విడుదల కానుంది!

భాగమతి స్థాయిలో మరో భారీ విజయం అందించే

కథ కోసం కసరత్తు చేస్తున్న అశోక్



అంతకుముందు కూడా ఒకటి రెండు చిత్రాలకు దర్శకత్వం వహించి తన ప్రతిభను ప్రకటించుకొని ఉన్నా.. దర్శకుడిగా అశోక్ పేరు మారుమ్రోగేలా చేసిన సినిమా 'పిల్ల జమీందార్'. నాని–హరిప్రియ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత డి.ఎస్.రావు నిర్మించారు. 'పిల్ల జమీందార్' తర్వాత కూడా అశోక్‌ని మళ్ళీ ఓ రెండు పరాజయాలు పలకరించాయి. అయితే సినిమాలు ఫెయిల్ అయినా దర్శకుడిగా మాత్రం అశోక్ ఫెయిల్ కాలేదు. అందుకే అనుష్కతో 'భాగమతి' వంటి సినిమా తీసే బంగారం లాంటి అవకాశం అశోక్‌ని వరించింది. అశోక్ ఈసారి పడలేదు. తనకు దొరికిన గోల్డెన్ ఛాన్స్‌ని గోల్డెన్ హిట్‌గా మలిచి తన సత్తా చాటుకున్నాడు. 2018లో ఫస్ట్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచిన అశోక్ దర్శకత్వంలో నటించేందుకు పలువురు అగ్ర హీరోలు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఒక సినిమా విజయాన్ని శాసించేది కథ, కథనాలే కాబట్టి.. వాటిపై కసరత్తు చేస్తున్నారు. 'భాగమతి' అశోక్‌గా మారిన అశోక్ దర్శకత్వం వహించే తదుపరి చిత్రం వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. ఈరోజు అశోక్ జన్మదినం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'భాగమతి' చిత్రం విజయం కోసం నెలల తరబడి కష్టపడ్డాం. అందుకే ఈ చిత్రం సాధిస్తున్న అసాధారణ విజయాన్ని మనసారా ఆస్వాదిస్తున్నాను. త్వరలోనే నా తదుపరి చిత్రం వివరాలు ప్రకటిస్తాను. ఆ చిత్రం కూడా 'భాగమతి'కి దీటైన విజయం సాధించేలా జాగ్రత్తలు తీసుకుంటాను. 'భాగమతి'ని ఇంత పెద్ద బ్లాక్ బస్టర్ చేసిన ప్రేక్షకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు' అన్నారు!

ఎ.పి. ఫిలిం ఛాంబర్ ఆధ్వర్యంలో షార్ట్ ఫిలిం కాంటెస్ట్



గతేడాది ఉగాది సినిమా పురస్కారాలు ఆరంభించిన ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈ ఏడాది కూడా మార్చ్ 17న పురస్కారాల ప్రదానం చేస్తోంది. ఈ సందరేంగా షార్ట్ ఫిలిం కాంటెస్ట్ నిర్వహిస్తోంది. ఇందుకు సంబంధిన బ్రోచర్‌ను ఏపీఎఫ్‌డిసి చైర్మన్ అంబికా కృష్ణ విడుదల చేశారు. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో షార్ట్ ఫిలిం కంటెస్ట్ నిర్వహిస్తున్నామని, ప్రథమ బహుమతిగా 50 వేలు, రెండో బహుమతిగా 30 వేలు, మూడో బహుమతిగా 20 వేలు ఇవ్వడంతో పాటు జ్ఞాపికను కూడా ఇవ్వనున్నామని ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ జె.వి.మోహన్ గౌడ్ అన్నారు. షార్ట్ ఫిలిం కంటెస్ట్‌కి ఏర్పాటు చేసిన జ్యూరీలో తమ్మారెడ్డి భరద్వాజ, ఎస్.వి కృష్ణారెడ్డి, ఎం.వి.రఘు, ఆర్.పి పట్నాయక్, గీత రచయిత్రి శ్రేష్ట ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఆర్.వి.భూపాల్ ప్రసాద్, ట్రెజరర్ పాలేవు రామారావు, జాయింట్ సెక్రటరీ జి.గోపాలకృష్ణ, మోడల్ ఫిలింస్ శివ తదితరులు పాల్గొన్నారు.

వినోదాల కథాకళి మసక్కలి



కొన్ని కథలు విని నమ్ముతాం.. కొన్ని కథలు చూసి నమ్ముతాం.. మరికొన్ని కథలు చూసినా నమ్మలేని విధంగా ఉంటాయి.. అలాంటిదే నా ఈ కథ అంటూ ఓ కుర్రాడి యాంగిల్‌లో చెప్పబోతోన్న సినిమా 'మసక్కలి'. ప్రేమికుల రోజు సందర్భంగా దర్శకనిర్మాతలు తమ్మారెడ్డి భరద్వాజ, మధుర శ్రీధర్ చేతుల మీదుగా మసక్కలి ట్రైలర్ విడుదలైంది. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ – "కొత్తగా వస్తున్న దర్శకులు మంచి కథలు తెస్తున్నారు. అలాగే ఈ ట్రైలర్ సరికొత్తగా అనిపిస్తోంది. మసక్కలి దర్శకుడిలో మంచి ప్రతిభ ఉంది. అతను ట్రైలరే కాదు సినిమా కూడా అద్భుతంగా తీసి ఉంటాడని నమ్ముతున్నాను" అన్నారు. మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ – "ఈ ట్రైలర్ నాకు బాగా నచ్చింది. అందుకే పాటలను మా మధుర ఆడియో ద్వారా విడుదల చేయబోతున్నాను. ఎంటైర్ టీమ్‌కు ఆల్ ది బెస్ట్" అని చెప్పారు. దర్శకుడు నబి యేనుగుబాల మాట్లాడుతూ – "మసక్కలి సైకలాజికల్ గేమ్‌గా ఉంటుంది. అందమైన ప్రేమకథగా ఉంటూనే సైకలాజికల్‌గా ఓ కొత్త అనుభూతినిచ్చే కథనం ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది సైకలాజికల్ ఎలిమెంట్స్ మిక్స్ అయిన ఓ న్యూఏజ్ లవ్ స్టోరీ. అందరకీ నచ్చుతుందనే అనుకుంటున్నాను. అలాగే పాటలు కూడా చాలా బావున్నాయి. మా పాటలు విడుదల చేస్తోన్న శ్రీధర్ గారికి, అలాగే నన్ను ప్రోత్సహిస్తోన్న అందరికీ కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. మసక్కలి ఖచ్చితంగా మీ అందరికీ కొత్త అనుభూతినిస్తుందనే గ్యారెంటీ నాది" అన్నారు. మేమొక కొత్త ప్రయత్నం చేశాం. ప్రేక్షకులకు ఖచ్చితంగా నచ్చుతుందనే అనుకుంటున్నాం. ఇలాంటి కథ ఇంతకు ముందు తెలుగులో చూడలేదు అని నిర్మాత సుమిత్ సింగ్ అన్నారు. డూ గుడ్ ఫాలో రైట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న మసక్కలిలో.. సాయి రోనక్, శ్రావ్య, శిరీషా వంకా, కాశీ విశ్వనాథ్, నవీన్, రవివర్మ, రామ్ జగన్, దేవదాస్ కనకాల, నరసింహ రాజు, చమ్మక్ చంద్ర తదితరులు నటిస్తున్నారు.



విమానం ఇంజన్ కవచం ఎగిరిపోయింది

శాన్ ఫ్రాన్సిస్కో : విమానం గాలిలో ఎగురుతున్నప్పుడు ఓ ప్రమాదకర దృశ్యాన్ని చూసి ప్రయాణికులు హడలెత్తిపోయారు. విమానం ఇంజన్ల లో ఒకదాన్ని కప్పి ఉంచే కవచం గాలికి ఎగిరిపోయింది. వెంటనే పైలట్ల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన అమెరికాలో చోటు చేసుకుంది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం శాన్ ఫ్రాన్సిస్కో నుంచి హోనోలులుకు వెళుతోంది. విమానం పసిఫిక్ మహా సముద్రంపై వెళుతున్నప్పుడు అకస్మాత్తుగా విమానం కుడి ఇంజన్‌ను కప్పి ఉంచే కవచం ఊడి ఎగిరిపోయింది. ప్రమాదకరంగా కనిపిస్తున్న ఇంజన్ భాగాన్ని విమానంలోని ప్రయాణికులు చూసి ఆందోళనకు గుర య్యారు. ఆ సమయంలో విమానంలో సిబ్బందితో కలిపి దాదావు 370 మంది ఉన్నారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు ఎమర్జెన్సీ ప్రకటించి వి షయాన్ని ఏటీసీకి తెలియజేశారు. అనంతరం సురక్షితంగా విమానాన్ని హోనోలులు ఎయిర్‌పోర్ట్‌లో దించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి నట్లు ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది. ఈ ఘటన అనంత రం పలువురు ప్రయాణికులు తమకు ఎదురైన అనుభవాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. 'నా జీవితంలో అత్యంత భయానకమైన విమాన ప్రయాణం ఇది' అని మార్కెటింగ్ కన్సల్టెంట్ అయిన మారియా పేర్కొంటూ ఇంజన్‌కు చెందిన ఓ ఫోటోను ట్విటర్‌లో పెట్టింది.

'మోడీజీ! పకోడా బిజినెస్‌కు లోన్ ఇవ్వండి'



అమేథీ : పకోడా వ్యాపారం చేసుకునేందుకు తనకు సహకరించాలని అమేథికి చెందిన ఓ నిరుద్యోగ యువకుడు అశ్విన్ మిశ్రా కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీకి లేఖ రాశారు. తాను పకోడా బిజినెస్‌ను చేపట్టేందుకు ముద్రా రుణం మంజూరయ్యేలా తన తరఫున ప్రధానిని కోరాలని ఆ యువకుడు కోరారు. పకోడా యూనిట్ ఏర్పాటు గురించి ప్రధాని ఓ న్యూస్ చానెల్ ఇంటర్వ్యూలో చెప్పినప్పటి నుంచి తాను ఉద్యోగ ప్రయత్నాలు విరమించానని, పకోడా జాయింట్ ప్రారంభించాలని నిర్ణయించుకున్నానని అశ్విన్ మిశ్రా లేఖలో పేర్కొన్నారు. పకోడీలు అమ్ముకోవడంపై ప్రధాని సూచన తనను అమితంగా ఆకట్టుకుందని, ఇది తాను బతకడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించేందుకు ఉపయోగపడుతుందని భావించానని చెప్పారు. అయితే, పకోడీ వ్యాపారాన్ని ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నించగా నిధుల కొరతతో ముందుకు వెళ్లలేకపోయానన్నారు. దీనితో లోన్ కోసం బ్యాంకులను ఆశ్రయించగా తనకు రుణం లభించలేదని చెప్పారు.

ముద్రా యోజన ద్వారా పది కోట్ల మంది లబ్ధి పొందారని ప్రధాని చెబుతున్నా తనకు రుణం ఇచ్చేందుకు బ్యాంకులు తిరస్కరించాయని అమేథి బీజేపీ సోషల్ మీడియా మాజీ చీఫ్‌గా వ్యవహరించిన అశ్విన్ మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మాటలు అవాస్తవాలని తాను భావించడం లేదని, బ్యాంకుల తీరుతోనే తాను ఈ లేఖ రాస్తున్నానని తన తరఫున ప్రధానికి విజ్ఞప్తి చేసి పకోడా వ్యాపారం ప్రారంభించేలా తనకు రుణం మంజూరయ్యేలా చూడాలని మంత్రిని కోరారు.

మరో వైపుఈ లేఖ బీజేపీ ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోసేందుకు ప్రతిపక్షానికి అవకాశం ఇచ్చినట్లైంది. బీజేపీ ప్రభుత్వ నిర్వాకాలు రోజూ వెలుగు చూస్తున్నాయని, ఇది కేవలం వాటికి ఓ ఉదాహరణేనని స్థానిక కాంగ్రెస్ నేత అచ్చే లాల్ వ్యాఖ్యానించారు.

కొత్త తరహా అణ్వాయుధాల తయారీలో పాకిస్తాన్



వాషింగ్టన్ : పాకిస్తాన్ కొత్త తరహా అణ్వాయుధాలను తయారు చేస్తోందని అమెరికా ఇంటలిజెన్స్ చీఫ్ హెచ్చరిం చారు. నేషనల్ ఇంటలిజెన్స్ డైరెక్టర్ డాన్ కోట్ ఇంటలిజెన్స్‌పై జరిగిన ఓ సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడిం చారు. పాకిస్తాన్ అణ్వాయుధాల అభి వృద్ధిని కొనసాగిస్తూనే ఉంది. 'కొత్త తరహా అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తోం ది. వీటిలో టాక్టికల్ వెపన్స్, సముద్రంపై ప్రయోగించే క్రూజ్ మిసైల్స్, వాయు మార్గంలో వినియోగించే క్రూయిజ్ మిసైల్స్, దూరశ్రేణి బాలిస్టిక్ మిసైల్స్ ఉన్నా యి' అని ఆయన హెచ్చరించారు. ఈ కొత్త తరహా ఆయుధాల తయారీ ఆ ప్రాం తంలో రక్షణ సంబంధిత సమస్యలకు దారి తీస్తుందని ఆయన అన్నారు. కొత్త తరహా అణ్వాయుధాలను అభివృద్ధి చేయడం ద్వారా అమెరికా ప్రయోజనాలకు పాకిస్తాన్ ముప్పుగా మారుతోందని ఆయన అన్నారు. పాకిస్తాన్ మద్దతు కలి గిన ఉగ్రవాద గ్రూపులు భారత్‌లో తమ దాడులు కొనసాగిస్తున్నాయని, రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయని డాన్ కోట్ పేర్కొన్నారు.

అగ్గిపెట్టె ఇవ్వలేదని మాజీ సైనికాధికారి హత్య



పుణె : మహారాష్ట్రలోని పుణె నగరంలో దారుణం చోటు చేసుకుంది. అగ్గిపెట్టె ఇవ్వలేదన్న కారణంగా ఆర్మీ మాజీ అధికారిని దారుణంగా కొట్టి చంపాడో దుండగీడు. ఈ నెల 1న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి 21 ఏళ్ల నిందితుడిని పుణె పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. 67 ఏళ్ల కెప్టెన్ రవీంద్ర కుమార్ బాలి డాక్టర్ కొయాజి రోడ్‌లో తన క్యాంపు ఏరియాకు సమీపంలో టెంట్ వేసుకొని ఒంటరిగా నివసిస్తున్నాడు. రాబిన్‌సన్ ఆంటోనీ అనే 21 ఏళ్ల యువకుడు ఈ నెల 1న తన స్నేహితుడితో కలసి నగర శివారులో మద్యం సేవించి రాత్రి ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. అయితే, కొయాజి రోడ్‌లో వీరి వాహనం పెట్రోల్ అయిపోవడంతో ఆగిపోయింది. ఈ సమయంలో అతని స్నేహితుడు బండి తోస్తుండగా రాబిన్‌సన్ సిగరెట్ కోసం అక్కడ రోడ్డు పక్కనే టెంట్‌లో ఉన్న బాలిని లేపి అగ్గిపెట్టె అడిగాడు. అగ్గిపెట్టే లేదని చెప్పడంతో మద్యం మత్తులో కోపంతో పక్కనే ఉన్న సిమెంట్ ఇటుకతో బాలి తలపై మోదాడు. రాబిన్‌సన్ స్నేహితుడు అతన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించినప్పటికీ నిందితుడు ఆగలేదు. తలపై తీవ్రంగా కొట్టడంతో బాలి మృతి చెందాడు. అనంతరం రాబిన్‌సన్ ఈ ఘటన గురించి తన స్నేహితులకు ఫోన్‌లో చెప్పి వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని పుణె నుంచి ముంబయికి పారిపోయాడు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పారిపోయిన రాబిన్‌సన్‌ను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఓ బీపీవో కంపెనీలో పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాలెంటైన్స్ డే నిరసనలు : గాడిద, కుక్కకు పెళ్లి తంతు



న్యూఢిల్లీ : వాలెంటైన్స్ డే వేడుకల ను వ్యతిరేకిస్తూ భారత్ హిందూ ఫ్రంట్ కార్యకర్తలు బుధవారం వినూత్న నిరసన చేపట్టారు. కుక్క, గాడిదకు పెళ్లి తంతు నిర్వహించా రు. నిరసనకారులను అనంతరం చెన్నై పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. నగరంలోని చురై ప్రాం తంలో నిరసనకారులు కుక్క, గాడిదలను పూల దండలతో అలంకరించి వాటి నుదుటిపై పసుపు రాశారు. వాలెంటైన్స్ డేకు వ్యతిరేకంగా వారు పెద్ద పెట్టున ని నాదాలు చేస్తుండగా హిందూ వివాహాల్లో ఉపయోగించే పెళ్లి సామా గ్రిని మహిళలు ప్లేట్లలో ప్రదర్శించారు. మరో వైపు హైదరాబాద్‌లో వాలెంటెన్స్ డేను వ్యతిరేకిస్తూ భజరంగ్ దళ్ కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అహ్మదాబాద్‌లోని సబర్మతీ నదీ తీరాన పలు జంటలను భజరంగ్ దళ్ సభ్యులు తరిమికొట్టారు.



చిక్కుల్లో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

జెరూసలెం : ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చిక్కుల్లో పడ్డట్లు కనిపిస్తోంది. ఆయనపై అవినీతికి సంబంధించి రెండు కేసులు నమోదు చేయాలని ఇజ్రాయెల్ పోలీసులు సిఫార్సు చేశారు. రెండు కేసుల్లో ఆయన పేరు నిందితుడిగా చేర్చాలని సూచించినట్లు తెలుస్తోంది. సుదీర్ఘ విచారణ అనంతరం రెండు అవినీతి కేసుల్లో పోలీసులు ఆయనను నిందితుడిగా ధ్రువీకరించారు. నెతన్యాహు, ఆయన భార్య ప్రముఖ వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల నుంచి చాలా ఖరీదైన బహుమానాలు అందుకున్నారనే ఆరోపణలపై పోలీసులు విచారణ చేపట్టారు. అయితే, పోలీసులు ప్రధానిని నిందితుడిగా చేర్చాలని సిఫార్సు మాత్రమే చేయగలరు. దీనిపై ఇజ్రాయెల్ అటార్నీ జనరల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ అంశం అటార్నీ జనరల్ అవించి మాండెల్‌బ్లిట్ చేతిలో ఉంది. దీనిపై ఏ విధంగా విచారణ చేపట్టాలో నిర్ణయించడానికి కొన్ని వారాలు లేదా నెలల సమయం పట్టవచ్చు. నాలుగు సార్లు ప్రధానిగా పని చేసిన 67 ఏళ్ల నెతన్యాహుకు దేశీయంగా, అంతర్జాతీయంగా మంచి పేరు ఉంది. ఈ కేసుల విషయంలో తాను ఎలాంటి తప్పూ చేయలేదని, తనకు కేసులతో ఎలాంటి సంబంధమూ లేదని నెతన్యాహు తరచూ చెబుతూనే ఉన్నారు. ఆయన రాజీనామా చేసే అవకాశం కూడా లేదు. ఇలాంటి పోలీసుల సిఫార్సులను బట్టి నిబంధనల ప్రకారం దేశ ప్రధాని రాజీనామా చేయాల్సిన అవసరం లేదు. రెండు అవినీతి కేసుల్లో నెతన్యాహును నిందితుడిగా చేర్చాలని సిఫార్సులు చేశామని పోలీసులు నెతన్యాహు న్యాయవాదులకు వెల్లడించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు ప్రచురించింది. దీనిపై నెతన్యాహు ఇంకా స్పందించలేదు. త్వరలో స్పందించే అవకాశం ఉంది. పోలీసులు కూడా స్పందించడానికి నిరాకరించారు.

కాలుష్యం తగ్గింపునకు జర్మనీ వినూత్న ఆలోచన



బెర్లిన్ : పెరిగిపోతున్న కాలుష్యం మహమ్మారికి బ్రేక్ వేసేందుకు జర్మనీ ఓ వినూత్నమైన ఆలోచన చేసింది. ప్రజలందరికీ ప్రభుత్వ రవాణా వ్యవ స్థలో ఉచిత ప్రయాణం కల్పించాల న్నది ప్రతిపాదన. దీని వల్ల వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గిపోతుం దన్నది ఆలోచన. 20 ప్రముఖ పట్టణాల్లో నైట్రోజన్ ఆక్సైడ్ స్థాయి యూరోపి యన్ ప్రమాణాలను మించిపోవడం అక్కడి ప్రభుత్వాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. 2020 వరకు ఈ కాలుష్యాన్ని నిరోధించలేని పరిస్థితి కూడా ఉంది. పట్టణ వాయు నాణ్యత నియంత్రణలో విఫమవుతున్నందుకు జర్మనీపై యూరో పియన్ యూనియన్ చర్యలు తీసుకునే అవకాశం ఉండడంతో, దీనికి నిరోధం గానే జర్మనీ సర్కారు తాజా ప్రతిపాదన చేసింది. ఉచిత రవాణా సౌకర్యం వల్ల అయ్యే వ్యయాలపై ఇప్పటికైతే స్పష్టత లేదు. అవసరమైతే మునిసిపాలిటీలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక భారాన్ని పంచుకుంటాయని అక్కడి ప్రభుత్వ ప్రకటన స్పష్టం చేసింది. నైట్రోజన్ ఆక్సైడ్ స్థాయిలు పెరిగిపోయిన పట్టణాల్లో డీజెల్ వాహనాలను నిషేధించే ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తోంది.

తన జీతాన్ని విరాళంగా ఇచ్చేసిన ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన జీతాన్ని విరాళంగా ఇచ్చారు. 2017 సంవత్సరం నాలుగో త్రైమాసిక వేతనం లక్ష డాలర్లను అమెరికా రవాణా విభాగానికి అందజేశారు. దేశంలో మౌలిక వసతుల అభివృద్ధికి సహకరించేందుకు ట్రంప్ ఈ మొత్తాన్ని ఇచ్చారు. ఈ మేరకు ట్రంప్ రవాణా విభాగం కార్యదర్శి ఎలైన్ చావోకు చెక్ పంపించారు. అధ్యక్ష నివాసం వైట్ హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇటీవల ట్రంప్ రోడ్లు, వంతెనలు, పోర్టులను పునర్నిర్మించాలని ప్రణాళికలు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఆయన రవాణా విభాగం అభివృద్ధి కోసం సహాయం అందించారు. కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టు కోసం ట్రంప్ అందజేసిన డబ్బు ఉపయోగపడనుందని రవాణా విభాగం అధికారులు తెలిపారు. గతంలో కూడా ట్రంప్ తన జీతాన్ని ఆరోగ్యం, మానవ సేవలు, జాతీయ పార్కు సేవలు, విద్యా రంగాలకు విరాళంగా ఇచ్చారు. అధ్యక్షుడిగా తాను జీతం తీసుకోకుండా పని చేస్తానని ట్రంప్ గతంలోనే చెప్పారు. అక్కడ అధ్యక్షుడి జీతం ఏడాదికి 4 లక్షల డాలర్లు. అయితే, నిబంధనల ప్రకారం అధ్యక్షుడు కచ్చితంగా వేతనం తీసుకోవాల్సిందే. అందుకని ట్రంప్ తన జీతం డబ్బును ఇలా విరాళాలుగా ఇస్తున్నారు.

అక్కడ ఆర్మీనే దోచుకుంటుంది!



ప్యాంగ్‌యాంగ్ : సైనికులంటే దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడేవారు. చాలా దేశాల్లో ఇదే నిజం కూడా. కానీ ఉత్తర కొరియా పరిస్థితి ఇందుకు విరుద్ధం. సైన్యం అనే మాట వింటే అక్కడి ప్రజలు భయంతో వణికిపోతారు. అసలే కరవు కాటకాలు, ప్రభుత్వ ఆంక్షలు, పన్నుల బెడద అక్కడి రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ బాధలే భరించలేకపోతుంటే నోటి కాడ ముద్దను లాక్కోవడంతో పాటూ ఊళ్ల మీద పడి దోచుకుంటున్నారు అక్కడి సైనికులు. ఆ దేశంలో రాజ్యమేలుతున్న నిరంకుశ పరిపాలనే దీనంతటికీ కారణం. కిమ్ జోంగ్ ఉన్ ప్రభుత్వం అక్కడి సైన్యంతో పని చేయించుకుంటోంది కానీ సరైన ఆహారం సరఫరా చేయడం లేదు. దాంతో సైనికులు రైతుల పంట పొలాల మీద పడి దోచుకోవడం మొదలు పెట్టారు. ఎవరి ఇంటిలో పండిన పంట దోచుకోవాలి, ఎవరి దగ్గర లంచాలు తీసుకోవాలి అనే విషయాలను అధికారులు సర్వే చేసి మరీ చెబుతారు. తదనుగుణంగా దోపిడీ ఉంటుంది. ఉత్తర కొరియా ఖజానాకు జమ అయిన ఆదాయంలో అధికభాగం అమెరికాపై పగ తీర్చుకోవడానికే అయిపోతోంది. దీంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండని పరిస్థితి. కరవుతో అల్లాడే రైతులకు ప్రభుత్వం నుంచి ఏ సాయం అందకపోగా పండిన ఆ కాస్త పంటనూ పన్నుల రూపంలో లాక్కుంటారు. గత సంవత్సరం కరవు కాటకాలతో ఆ ప్రాంతంలో పంటలు సరిగా పండలేదు. అయినా అక్కడి ప్రభుత్వం పన్నుల విషయంలో ఏమాత్రం జాలి చూపించలేదు. నిర్దాక్షిణ్యంగా వసూలు చేసింది. ఏటా సైనికుల అవసరాలు తీర్చడం ప్రజలకు కొత్త ఏమీ కాదు. కానీ ఇలా పొలాల మీద పడి దోచుకుపోవడం మాత్రం వారికి వింత పోకడే. వీటికి అమెరికా విధిస్తున్న ఆంక్షలు కూడా తోడయ్యాయి. కిమ్ ప్రభుత్వాన్ని ఏమీ అనలేక బతికి ఉండగానే మమ్మల్ని కాల్చుకు తినండి అంటూ అమెరికా మీద తమ బాధను వెళ్లగక్కుతున్నారు అక్కడి ప్రజలు.

ప్రియా ప్రకాశ్ వీడియో హిట్ కావడం ప్రేమికుల రోజును నిరసించే వారికి ఒక సమాధానం: జిగ్నేష్ మేవానీ



అహ్మదాబాద్ : "ఒరు అదార్ లవ్' మూవీలోని ఓ సాంగ్‌లో కనపడి కన్ను గీటుతూ, అందంగా హావభావాలు కనబరుస్తూ మలయాళ కుట్టి ప్రియా ప్రకాశ్ వారియర్ అందరి దృష్టిని తన వైపునకు తిప్పుకున్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఆమె ఫోటోలను ఉపయో గిస్తూ విపరీతంగా జోక్స్, సెటైర్లు వేస్తూ పోస్టులు పెడుతున్నారు. చివరికి ఆమె వైరల్ వీడియోను గుజరాత్ దళిత నేత, ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ కూడా తన ప్రత్యర్థులను విమ ర్శించేందుకు ఉపయోగించుకున్నారు. ఈ వీడియో హిట్ కావడం ప్రేమికుల రోజును నిరసించే ఆరెస్సెస్‌కు ఒక సమాధానమని తెలిపారు. ఒకరిని ద్వేషిం చడం కన్నా ప్రేమించడాన్ని అధికంగా ఇష్టపడతామని భారతీయులు మరోసారి రుజువు చేశారని ట్విట్టర్ లో పేర్కొన్నారు. బుధవారం ప్రేమ జంటలు కనపడితే బలవంతంగా పెళ్లిళ్లు చేస్తామని హిందూ సంఘాలు హెచ్చరించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

సుష్మా స్వరాజ్ నాయకత్వాన్ని మెచ్చుకున్న ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ తన కేబినెట్ సహచర మంత్రి సుష్మా స్వరాజ్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం శుభాకాంక్షలు తెలియజే శారు. ఆమె సేవలను ప్రశంసిస్తూ ట్విట్టర్లో ట్వీట్ చేశారు. 'సుష్మా స్వరాజ్‌కు పుట్టిన రోజు శుభాకాం క్షలు. ఆమె తనను తాను ఓ అసాధారణ నేతగా తీర్చిదిద్దుకున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా భారతదేశ విదేశాంగ విధానాన్ని రూపొందించ డంలో ఆమెది కీలక పాత్ర. చురుకైన, పరోపకార స్వభావంతో అంతర్జాతీ యంగా భారతీయులకు సన్నిహితంగా మారారు. దీర్ఘ కాలం ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నాను' అని ప్రధాని ట్వీట్ చేశారు. దీనికి సుష్మా సైతం ట్విట్టర్ వేదికపైనే స్పందించారు. 'మీరు మెచ్చుకున్న తీరుకు ధన్య వాదాలు' అని సుష్మా పేర్కొన్నారు.

పాక్ ఉగ్రవాది సయీద్‌కు మరో దెబ్బ



ఇస్లామాబాద్ : ముంబయి పేలుళ్ల ప్రధాన సూత్రధారి, జమాత్ ఉల్ దవా అధినేత హఫీజ్ సయీద్ ఉగ్రవాది కాదని కొంత కాలంగా వాదించిన పాకిస్తాన్ ఎట్టకేలకు అతడిని ఉగ్రవాదిగా గుర్తించింది. ఇప్పుడు అతడి ఆస్తులను స్వాధీనం చేసుకునే పనిలో పడింది. సయీద్ సంస్థలు జేయూడీ, ఎఫ్ఐఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులు, ఆరోగ్య సదుపాయాలను వెంటనే నిలిపివేస్తున్నట్లు పంజాబ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు అక్కడి మీడియా వర్గాలు వెల్లడించాయి. సయీద్ ఆధ్వర్యంలో నడిచే సంస్థలను ప్రభుత్వ ఆధీనంలోని అకాఫ్ డిపార్ట్‌మెంట్ స్వాధీనం చేసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో సూచించినట్లు సంబంధిత సీనియర్ అధికారి తెలిపారు. జేయూడీ నిర్వహించే సదస్సుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను తెలుసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఎఫ్ఐఎఫ్ ఆధ్వర్యంలో పలు ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యులు, పారా మెడికల్ స్టాఫ్ వివరాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించాల్సిందిగా అధికారులు కోరారు. జిల్లా అధికారులు, పోలీసులు, అకాఫ్ అధికారులు ఈ వివరాలను పరిశీలించనున్నారు. జేయుడీ, ఎఫ్ఐఎఫ్ నడుపుతున్న నాలుగు ఆసుపత్రులను తమ ఆధీనంలోకి తెచ్చుకున్న విష యాన్ని డిప్యూటీ కమిషనర్ తలాట్ మొహమూద్ గొండాల్ ధ్రువీకరిం చారు. సయీద్‌ను ఉగ్రవాదిగా గుర్తిస్తున్నట్లు పాక్ ప్రకటించిన మరుసటి రోజే అతడి సంస్థలపై చర్యలు తీసుకోవడం గమనార్హం. అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతుం డడంతో సయీద్‌ను ఉగ్రవాదిగా గుర్తిస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

చడీ చప్పుడూ లేకుండా రాజకీయాల్లోకి ప్రవేశించే ప్రక్రియ ప్రారంభించిన సినీ నటుడు విజయ్



చెన్నై : తమిళనాడులో పెద్ద ఎత్తున సినీన టులు రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్న విషయం తెలిసిందే. అక్కడి అగ్ర నటుల్లో ఒకరైన విజయ్ కూడా రాజకీయాల్లోకి ప్రవేశించే క్రమంలో ప్రయత్నాలు మొదలుపెట్టేశారు. ఆయన రాజకీ యాల్లోకి వస్తున్నానని అధికారికంగా ప్రకటించ లేదు. కానీ, చడీ చప్పుడూ లేకుండా ప్రజా సంఘాలతో చర్చలు జరుపుతున్నారు. ఈ విష యాన్ని విజయ్ ప్రజా సంఘం నిర్వాహకులు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఇప్పటికే రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించిన రజనీకాంత్ సభ్యులను చేర్చడానికి గత నెల వెబ్‌సైట్ ప్రారంభించారని గుర్తు చేసిన విజయ్ ప్రజా సంఘం తమ నాయకుడు విజయ్ గత ఏడాది సెప్టెంబర్‌లోనే సభ్యులను చేర్చ డానికి మొబైల్ యాప్ ప్రారంభించారని తెలిపింది. అంతే కాదు. బూత్ కమి టీల ఏర్పాటు పనులు కూడా జరుగుతున్నాయని చెప్పింది. బూత్ కమిటీ ఏర్పా ట్లు చేయాల్సిన బాధ్యతలను అఖిల భారత విజయ్ ప్రజా సంఘం అధ్యక్షుడు బుస్సీ ఆనంద్‌కు విజయ్ అప్పగించినట్లు తెలిసింది. మొదట ఏయే ప్రాంతాల్లో తిరగాలి? బూత్ కమిటీలను ఎలా ఏర్పాటు చేయాలనే విషయాలపై విజయ్ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సభ్యులను చేర్చే ప్రక్రియ ఇప్పటికే సగం పూర్తయినట్లు తెలిసింది.

యుద్ధానికి సన్నద్ధమంటే ఎవరి మీద?



న్యూఢిల్లీ : యుద్ధానికి సన్నద్ధం కావాలంటే భారత సైన్యానికి ఆరు నెలలు పడుతుందని, అదే తమ ఆరెస్సెస్ కార్యకర్తలకైతే మూడు రోజులు పడుతుందని ఆ సంస్థ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. మోహన్ భాగవత్ భారత సైన్యాన్ని అవమానించారని ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తిన విషయమూ విదితమే. అయితే, అసలు యుద్ధానికి సన్నద్ధం కావడానికి ఆరెస్సెస్ ఏమిటి? అది భారత సైన్యంలో భాగమా? అదో సాంస్కృతిక సంస్థ. అలాంటి సంస్థకు యుద్ధం చేయాల్సిన అవసరం ఎందుకు వస్తుంది ? ఎవరి మీద యుద్ధం చేస్తుంది? ఎవరూ మీదయినా యుద్ధం చేయాల్సింది భారత సైన్యమే. అందుకు అవసరమైతే ఆదేశాలు జారీ చేయాల్సింది కూడా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన భారత ప్రభుత్వమే. మోహన్ భాగవత్ తన మాటల ద్వారా పరోక్షంగా యుద్ధానికి ఆరెస్సెస్ కార్యకర్తలను సిద్ధం చేస్తున్నట్లుంది. అయితే, ఎవరి మీద ? పాకిస్తాన్ మీదా? పాకిస్తాన్ సైన్యానికి ఎదుర్కొనే శక్తి లేదు. పైగా అది భారత సైన్యానికి సంబంధించిన అంశం. ఇకపోతే దేశంలోని ముస్లింలపై యుద్ధమా? దేశంలోని ముస్లింలపై జరిపే దాడులను యుద్ధం అనలేం. హింస అని అంటాం. ఇప్పటికే ఆరెస్సెస్ కార్యకర్తల్లో కావాల్సినంత హింస దాగి ఉంది. అలాంటి హింసను మరీ రెచ్చగొట్టడం ఏమిటి? ఇప్పటికే దేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో తమకు తాము సైన్యంగా చెప్పుకునే దళాలు పెరిగిపోయాయి. భజరంగ్ దళ్ సైనిక శిబిరాల వంటివి ఏర్పాటు చేసుకొని వాటిలో ఆయుధ శిక్షణ తీసుకుంటుండగా, గో రక్ష దళాలు లైసెన్స్‌లేని తుపాకులను పట్టుకొని దేశంలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. కొన్ని చోట్ల దాడులకు కూడా దిగుతున్నాయి. శివసేన ఆర్మీ ఆఫ్ శివాజీ అని చెప్పుకుంటోంది. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏర్పాటు చేసిన హిందూ యువ వాహిని ఇప్పుడు హిందూ యూత్ ఆర్మీ అని చెప్పుకుంటోంది. తమపై జరుగుతున్న దాడులను దృష్టిలో పెట్టుకొని ఉత్తర ప్రదేశ్‌లోని దళితులు భీమ్ ఆర్మీని ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యుద్ధానికి సన్నద్ధం అంటే వివిధ మితవాద సంస్థల్లో పేరుకుపోయిన హింసాత్మక ధోరణులను రెచ్చగొట్టడమే. ఈ ఏడాది ఎనిమిది రాష్ట్రాల్లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓ పార్టీకి లబ్ధి చేకూర్చడం కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నట్లు స్పష్టం అవుతోంది.

మహిళలపై ఫిలిప్పీన్స్ అధ్యక్షుడి క్రూర వ్యాఖ్యలు



మనీలా : మాదక ద్రవ్యాలతో పట్టుబడ్డవారిని కాల్చి పారేయాలని గతంలో వివాదాస్పద ఆదే శాలు జారీ చేసిన ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టె ఈసారి మహిళలపై ప్రపంచం విస్తుపో యేలా క్రూరమైన వ్యాఖ్యలు చేశారు. కమ్యూ నిస్ట్ రెబల్స్ మహిళల మర్మాంగాల్లో కాల్చుతా మని ఆయన చేసిన వ్యాఖ్యలతో ప్రపంచం నివ్వె రపోయింది. ఆయన అక్కడితో ఆగకుండా ఈ విషయంలో సైన్యానికి ఆదేశాలు కూడా జారీ చేశారు. 'మీరున్నా, లేకున్నా ఒక్కటే. మిమ్మల్ని మేం చంపబోం. కానీ మీ మర్మాంగాల్లో కాల్చుతాం' అని కమ్యూనిస్ట్ రెబల్స్ మహిళలను ఉద్దేశించి అధ్యక్షుడు హెచ్చరించారు. ఇటీవల జరిగిన మాజీ తిరుగుబాటుదారుల సమావేశంలో ఆయనీ హెచ్చరికలు చేశారు. జైళ్లలో ఉన్న రెబల్స్ మహిళలను సిబ్బందితో అత్యాచారాలు చేయించి చంపేస్తున్నారని ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న డ్యుటెర్టె తాజా వ్యాఖ్యలు మరింత కలకలం రేపుతున్నాయి.

సూర్య స్పోర్ట్స్

భార్యకు రోహిత్ శర్మ వాలెంటైన్స్ డే కానుక



న్యూఢిల్లీ : భారత క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ రోహిత్ శర్మకు భార్య రితిక అంటే ఎంతో ఇష్టం. అలాంటి రోహిత్ ఈ రోజు ఫిబ్రవరి 14.. ప్రేమికుల దినోత్సవం నాడు రితికకు కానుక ఇవ్వకుండా ఉంటాడా చెప్పండి. ఏదో ఒకటి ఇచ్చే ఉంటాడు అనే కదా మీరు అనుకుంటున్నారు. మీ అంచనా నిజమే. మరి ఏం కానుక ఇచ్చాడో ఇప్పుడు చూద్దాం. పోర్ట్‌ఎలిజబెత్‌లో మంగళవారం భారత్–దక్షిణాఫ్రికా మధ్య ఐదో వన్డే జరిగింది. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ రోహిత్ శర్మ శతకం సాధించాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఈ పర్యటనలో రోహిత్‌కు ఇదే తొలి శతకం. ఈ శతకాన్నే రోహిత్ తన భార్య రితికకు వాలెంటైన్స్ డే కానుకగా అందజేశాడు. ఈ మేరకు రోహిత్ తన ఇన్‌స్టాగ్రాంలో హ్యాపీ వాలెంటైన్స్ డే రిట్స్ అని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీతో ఉన్న ఫొటో జత చేశాడు. మొన్న బర్తడే.. నిన్న మ్యారేజ్‌డే.. నేడు వాలెంటైన్స్‌డేకి రితికకు మరిచిపోలేని కానుకలు అందజేస్తున్నావు అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

చిక్కుల్లో లీ చాంగ్!

- సోషల్ మీడియాలో ప్రచారం విషయంపై పోలీసులకు ఫిర్యాదు
- ఆ వీడియోలో ఉంది నేను కాదని స్పష్టం



కౌలాలంపూర్ : మలేషియా బ్యాడ్మింటన్ ఆటగాళ్లు వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. తాజాగా మూడుసార్లు ఒలింపిక్ పతక విజేత లీ చాంగ్ వైకు సంబంధించిన ఓ సెక్స్ వీడియో ప్రస్తుతం నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. ఈ వీడియో తీవ్ర దుమారం లేపింది. దీనిపై లీ చాంగ్ పోలీసులను ఆశ్రయించాడు. అనంతరం మీడియాకు ఆ వీడియోలో ఉంది తాను కాదని స్పష్టం చేశాడు. గత కొద్ది రోజులుగా ఓ సెక్స్ వీడియో నెట్టింట్లో వైరల్‌గా మారింది. అందులో ఉన్న వ్యక్తి లీ చాంగ్‌ను పోలి ఉన్నాడు. దీంతో అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అప్రమత్తమైన లీ చాంగ్ మంగళవారం పోలీసులను ఆశ్రయించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరో ఇదంతా కావాలనే చేశారని, వారిని అదుపులోకి తీసుకుని శిక్షించాలని చాంగ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం చాంగ్ మీడియాతో మాట్లాడాడు. ఆ వీడియోలో ఉంది నేను కాదు. అందులో ఉన్న వాయిస్ కూడా నాది కాదు. నేనంటే ఎవరో గిట్టని వారు ఇదంతా చేశారు. నా పేరు ప్రతిష్ఠలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. వీడియోను జాగ్రత్తగా పరిశీలిస్తే అందులో ఉన్నది నేను కాదని మీకు తెలుస్తోంది. ఈ వీడియో చూసి చాలా మంది నాకు ఫోన్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాను కాబట్టి ఇక దీని గురించి ఆలోచించను. నా సమయం వృాఎథా చేసుకోను అని చెప్పాడు. అలాగే తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా తనకు ఆ వీడియోకు ఎలాంటి సంబంధం లేదని చాంగ్ అభిమానులకు తెలిపాడు. ఇద్దరు మలేషియా ఆటగాళ్లు గత ఏడాది మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డారని వారిపై జీవితకాల నిషేధం విధించాలని ఇప్పటికే బీడబ్ల్యూఎఫ్(బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్) బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ మలేషియాకు లేఖ రాసింది.

ఈ విజయం గొప్పది



- మనవాళ్లు అదరగొట్టారు..
- బీసీసీఐ తాత్కలిక అధ్యక్షుడు సీకే ఖన్నా
- సామాజిక మాధ్యమాల్లోనూ...
- కోహ్లీ సేనపై ప్రశంసల జల్లు

న్యూఢిల్లీ : టీమిండియా ఆరు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 4–1తో సొంతం చేసుకుంది. పోర్ట్‌ఎలిజబెత్‌లో మంగళవారం ఇండియా– దక్షిణాఫ్రికా మధ్య జరిగిన ఐదో వన్డేలో భారత్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయంపై బీసీసీఐ తాత్కలిక అధ్యక్షుడు సీకే ఖన్నా మన క్రికెటర్లను పొగడ్తలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విజయం చాలా గొప్పది అని అన్నారు. ఇండియా సారథి విరాట్ కోహ్లీ, మిగతా ఆటగాళ్లు అసాధారణమైన ప్రదర్శన కనబర్చారు. ఏ జట్టునైనా వారి స్వదేశలంలో ఓడించే సామర్థ్యం ఇండియా జట్టుకు ఉందని ఈ విజయంతో నిరూపించారు. 25 సంవత్సరాల తర్వాత వారు భారత్‌కు సిరీస్ సాధిం చండం దేశానికి గర్వకారణం అని సీకే ఖన్నా ఇండియా క్రికెటర్లను కొనియాడారు. దక్షిణాఫ్రికా టాస్ గెలిచి టీమిండియాను బ్యాటింగ్‌కు ఆహ్వా నించింది. భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 274 పరుగులు చేసింది. మొదట నుంచి విఫలం చెందిన రోహిత్ ఐదో వన్డేలో సెంచరీతో మెరిశాడు. రోహిత్‌ను(126 బంతుల్లో; 115 పరుగులు) మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు వరించింది. వన్డే కెరీర్‌లో రోహిత్‌కు 17వ సెంచరీ. సౌతాఫ్రికా బౌలర్లలో ఇన్‌గిడి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం దక్షిణాఫ్రికా 42.2 ఓవర్లలో 201 పరుగులకే ఆలౌటైంది. హాషీం ఆమ్లా(71పరుగులు) ఒక్కడే పోరాడాడు. జట్టును విజయం వైపు నడిపిస్తున్న ఆమ్లాను పాండ్యా అద్భుత ఫీల్డింగ్‌తో రన్ అవుట్ చేశాడు. ఇండియా బౌలర్లలో కుల్దీప్ యాదవ్‌కు 4 వికెట్లు, హర్దిక్ పాండ్యాకు 2 వికెట్లు, చాహల్‌కు 2 వికెట్లు, బుమ్రాకు ఒక వికెట్ దక్కాయి. ఈ విజయంతో సిరీస్ సొంతం చేసుకున్న భారత్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని పటిష్టం చేసుకుంది.

★ సిరీస్ టీమిండియా వశమైంది. మణికట్టు స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, చాహల్ ఆకట్టుకున్నారు. రోహిత్ శర్మ నుంచి మరో గొప్ప ఇన్నింగ్స్ : సచిన్.

★ సఫారీ గడ్డపై తొలి ద్వైపాక్షిక సిరీస్‌ను సొంతం చేసుకున్న భారత క్రికెట్ జట్టుకు అభినందనలు. ఈ పర్యటనలో భారత జట్టు ఎంతో నిలకడగా ఆడుతూ విజయాలను సొంతం చేసుకుంది. ఈ జట్టు ఎంతో ప్రత్యేకమైనది : సెహ్వాగ్

★ విరాట్ కోహ్లీ, భారత జట్టుకు అభినందనలు. మరో అద్భుత ప్రదర్శనతో టీమిండియా సిరీస్ కైవసం చేసుకుంది. కోహ్లీ సేన అంటే ఇదే. ఇది ప్రత్యేకమైన జట్టు. గొప్ప ఫలితం : మహమ్మద్ కైఫ్

★ చరిత్ర సృాఎష్టించిన భారత జట్టుకు అభినందనలు. మణికట్టు స్పిన్నర్లు అద్భుతంగా రాణించారు. ఈ విజయం విరాట్ కోహ్లీతో పాటు సహచర ఆటగాళ్లకు ఎంతో తియ్యనిది. సఫారీగడ్డపై బాగా ఆడుతున్నారు: వీవీఎస్ లక్ష్మణ్

★ కోహ్లీ సేనకు ఇది మరిచిపోలేని సమయం. సఫారీ గడ్డపై గతంలో ఏ భారత జట్టు సాధించలేని ఘనతను ఈ జట్టు సాధించింది : హర్ష భోగ్లే?

ఫ్రెంచ్ ఓపెన్ నాటికి రెడీ అవుతా : సానియా



న్యూఢిల్లీ : కుడి మోకాలి గాయం వల్ల గత అక్టోబర్ నుంచి ఆటకు దూరమైన భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మరో మూడు నెలల్లో రాకెట్ పట్టుకునే అవకాశం ఉంది. మే నెలాఖర్లో జరిగే ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకల్లా కోలుకుంటానని ఈ హైదరాబాద్ క్రీడాకారిణి ఆశాభావంతో ఉంది. మహిళల టెన్నిస్‌ను సెరెనా సహా ఏ ఒక్కరూ ఎక్కువ కాలం శాసించలేరని చెప్పింది. యువ ప్రతిభావంతులు టాప్ ర్యాంకర్లను కంగుతినిపిస్తున్న సంగతి మరవొద్దని సూచించింది. ఫెడ్ కప్ టీమ్ టోర్నమెంట్‌లో భారత యువతార అంకితా రైనా ప్రదర్శన అద్భుతంగా ఉందని సానియా కితాబిచ్చింది. ఫెడ్ కప్‌లో ఈసారి యువ క్రీడాకారిణుల పోరాటపటిమ ఆకట్టుకుంది. కానీ తదుపరి దశకు చేరకపోవడమే నిరాశను కలిగిస్తోంది. ఆ వెలితి ఇంకా కొనసాగుతోంది అని హైదరాబాదీ స్టార్ చెప్పింది. ఫెడ్ కప్‌లో అంకిత ఆటతీరు సాధారణమని పేర్కొంది. తనకన్నా ఎంతో మెరుగైనా, టాప్ 100 ర్యాంకర్లను ఆమె కంగుతినిపించిన తీరు గొప్ప పురోగతి అని ప్రశంసించింది. అంకితను తదుపరి భావి సానియాగా భావించవచ్చా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ... చాన్నాళ్లుగా ఎంతో మంది ఈ ప్రశ్న అడుగుతున్నారు. అయితే వీళ్లందరికీ చెబుతున్నా... ఎందుకు మనం సానియా దగ్గరే ఆగిపోవాలి. నన్ను మించి మేటి క్రీడాకారిణిగా ఎదగాలని ఆశిద్దాం అని తెలిపింది.

మూడింట్లో ఆడలేకపోతే

- ఫామ్ కోల్పోయినట్లే అవుతుందా..?
- మీడియాపై చిందులేసిన రోహిత్ శర్మ
- ఐదో వన్డే విజయం తరువాత మీడియా సమావేశంలో ఆగ్రహం



పోర్ట్‌ఎలిజబెత్ : ఆతిథ్య దక్షిణాఫ్రికాతో ఆడిన మొదటి నాలుగు వన్డేల్లో రోహిత్ శర్మ స్కోరు 40. పోర్ట్‌ఎలిజబెత్‌లో మంగళవారం జరిగిన వన్డేలో 115 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ కైవసం చేసుకున్నాడు. మ్యాచ్ అనంతరం రోహిత్ మీడియాతో మాట్లాడుతూ..మూడు మ్యాచుల్లో నేను సరిగా ఆడలేదు. దీన్ని బట్టే నేను ఫామ్ కోల్పోయానని ఎలా అంచనాకు వచ్చేస్తారు?. ఏ ఆటగాడైనా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైతే ఫామ్‌లో లేడని ఎలా అంటారు? అని విలేకరులపై రోహిత్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. మొదటి మూడు మ్యాచ్‌ల్లో రాణించలేకపోయా. ఈ విషయాన్ని నేను అంగీకరిస్తా. నెట్స్‌లో బాగానే బ్యాటింగ్ చేసేవాడిని. ప్రతి క్రీడాకారుడు ఏదో ఒక సమయంలో ఇలాంటి సమస్య ఎదుర్కొంటాడు. ఆటలో ఇలాంటివన్ని సహజం. ఇలాంటి సవాళ్లు ఎదురైతేనే మనం ఇంకా ఎక్కువ కష్టపడ తాం. నేను కూడా అంతే. ఏ రోజూ కుమిలిపోలేదు. ఒక్క అడుగు వెనక్కి వేసి.. ఇలా ఎందుకు జరుగుతోందని ఆలోచించా. తర్వాతి గేమ్‌లో అలా జరగకుండా జాగ్రత్తగా ఆడాలని నాకు నేనే సర్దిచెప్పుకున్నా అని రోహిత్ తెలిపాడు. అనంతరం తాను సాధిం చిన శతకం గురించి మాట్లాడుతూ..ఇప్పుడు నా శతకం పాతదైపోయింది. తదుపరి మ్యాచ్‌పైనే దృష్టి అంతా. వీలైనన్ని ఎక్కువ పరుగులు సాధించి జట్టు స్కోరు పెంచాలి. ఇప్పటికే 4–1తో సిరీస్‌ను కైవసం చేసుకున్నాం. 5–1 తేడాతో సిరీస్‌ను దక్కించుకు నేందుకు ప్రయత్నిస్తాం అని రోహిత్ వివరించాడు.

సిరీస్ విజయం ప్రతి ఒక్కరి శ్రమ ఉంది

- లసెల్ఫీ ఇంటర్వ్యూ సందర్భంగా రోహిత్ శర్మతో కెప్టెన్ కోహ్లీ
- దక్షిణాఫ్రికాలో తొలిసారి వన్డే సిరీస్ నెగ్గిన ఘనత సొంతం
- విజయానంతరం కోహ్లీని సెల్ఫీ ఇంటర్వ్యూ చేసిన రోహిత్



పోర్ట్ ఎలిజబెత్ : వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా తమ స్థాయికి తగ్గట్లు ఆడి చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ఇక్కడ జరిగిన ఐదో వన్డేలో 73 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై నెగ్గడంతో పాటు మరో వన్డే మిగిలుండగానే 4–1తో భారత క్రికెట్ జట్టు తొలిసారి వన్డే సిరీస్ కైవసం చేసుకుని 25 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. మ్యాచ్ అనంతరం భారత కెప్టెన్ విరాట్ కోహ్లీని, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ వినూత్నంగా సెల్ఫీ ఇంట ర్వ్యూ చేశాడు. బీసీసీఐ కోరిక మేరకు చేసిన ఇంటర్వ్యూలో విజయంపై కోహ్లీ పలు అంశాలను ప్రస్తావించాడు. బీసీసీఐ చేసిన ట్వీట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.

ఇంటర్వ్యూ వివారలు ఇలా ఉన్నాయి

రోహిత్ : దక్షిణాఫ్రికాలో టీమిండియాకు గతంలో సాధ్యం కాని వన్డే సిరీస్ విజయాన్ని సాధించడంపై కెప్టెన్‌గా, ఆటగాడిగా ఎలా ఫీలవుతున్నావ్?

కోహ్లీ : చాలా ఆనందంగా ఉంది. గతంలో ఆరు సార్లు భారత్ ఇక్కడ పర్యటించినా లాభం లేకపోయింది. 25 ఏళ్ల తర్వాత సఫారీల గడ్డపై భారత్ తొలిసారిగా సిరీస్ విజయం జట్టులో ప్రతి ఒక్కరి శ్రమవల్లే సాధ్యమైంది. రోహిత్ ఈ మ్యాచ్‌లో బాగా ఆడటం కలిసొచ్చింది. అరుదైన సిరీస్ విజయంతో టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. భారత ఆటగాళ్లు ఈ చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని ఎంజాయ్ చేస్తూ ఉద్వేగానికి లోనయ్యారు.

రోహిత్ : టీమిండియా సిరీస్ విజయానికి కారణాలేమిటి ?

కోహ్లీ : ప్రతి మ్యాచ్‌లో ఎవరో ఒకరు కీలక ప్రదర్శనతో రాణించారు. ముఖ్యంగా బౌలర్లు సులువుగా వికెట్లు తీయడం వల్లే విజయాలు సాధ్యమయ్యాయి. మణికట్టు స్పిన్నర్లు యుజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్‌లు కీలక సమయంలో వికెట్లు పడగొట్టారు. వీరికి తోడు సీమర్లు జస్ప్రిత్ బూమ్రా, భువనేశ్వర్‌లు నిలకడగా బౌలింగ్ చేసి ప్రత్యర్థి ఆటగాళ్లను కట్టడి చేశారు.

రెండేళ్ల క్రితం సొంతగడ్డపై ఎదురైన వన్డే సిరీస్ పరాజయానికి కూడా సరైన రీతిలో ప్రతీకారం తీర్చుకోవడంతో పాటు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. కాగా, ఇరు జట్ల మధ్య చివరి వన్డే శుక్రవారం (ఫిబ్రవరి 16న) సెంచూరియన్‌లో జరుగనుంది.

అలవాటులో పొరపాటు

బుధవారానికి బదులు గురువారంగా ప్రింట్

కాన్‌బెర్రా : ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ఏప్రిల్ 4న కామన్వెల్త్ క్రీడల ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు మొదలయ్యాయి. అంతేకాదండోయ్ ఆ ఏర్పాట్లలో తప్పిదాలు కూడా జరిగిపోయాయి. ప్రారంభోత్సవ వేడుకకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు అభిమానుల కోసం పెద్ద సంఖ్యలో టిక్కెట్ల ప్రింటింగ్ మొదలుపెట్టారు. సుమారు 14వేల టిక్కెట్లు కూడా ప్రింట్ అయ్యాయి. సరిగ్గా గుర్తించారు టిక్కెట్లో బుధవారానికి బదులు గురువారం అని ప్రింట్ అయ్యిందని. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే మాత్రం లాభం ఉంటుందా చెప్పండి. అసలే క్రీడల నిర్వహణ భారీ ఖర్చుతో కూడుకున్నది. ఇప్పుడు ఈ తప్పిదంతో టిక్కెట్లను మరోసారి ప్రింట్ చేయాలంటే ఆ భారం ఎక్కువవుతుంది. దీంతో వారు ఆ టిక్కెట్లను అలాగే అమ్మాలని సూచించారట. ఈ తప్పిదం ఎవరూ కావాలని చేయలేదు. అనకోకుండా జరిగింది అని ఆస్ట్రేలియా నిర్వాహకులు తెలిపారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం ఏప్రిల్ 4న అందుబాటులో ఉన్న టిక్కెట్లతో పాటు వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, ట్రయల్‌థాన్‌కు సంబంధించిన టిక్కెట్లలో మ్యాచ్ వేళలను తప్పుగా ప్రచురించినట్లు సమాచారం. ఏప్రిల్ 4 నుంచి 15 వరకు ఆస్ట్రేలియాలో కామన్వెల్త్ క్రీడలు జరగనున్నాయి. దేశ విదేశాల నుంచి వేలాది మంది అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.

ధావన్‌తో ప్రవర్తించిన తీరుకు రబాడకు జరిమానా



దుబాయ్ : వీడ్కోలు చెబితే జరిమానా విధించడం ఏంటి మరీ విడ్డూరం కాకపోతేనూ అని అనుకుంటున్నారా. సాధారణంగా వీడ్కోలు చెబితే ఎవరూ జరిమానా విధించరు. కానీ, ఓ అంతర్జాతీయ మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ ఔటైనప్పుడు వెటకారంగా చెబితే.. అలా అయితే జరిమానా విధించడంలో తప్పేమి లేదు కదా. ఐసీసీ కూడా అదే చేసింది. పోర్ట్‌ఎలిజబెత్‌లో భారత్–దక్షిణాఫ్రికా మధ్య ఐదో వన్డే జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో భారత్ మొదట బ్యాటింగ్‌కు దిగింది. 8వ ఓవర్లో రబాడ వేసిన రెండో బంతిని ఎదుర్కొన్న భారత ఓపెనర్ శిఖర్ ధావన్ (34).. ఫెలుక్వాయోకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ధావన్ పెవిలియన్‌కు వెళ్తుండగా రబాడ టాటా, బై బై అంటూ వీడ్కోలు చెప్పాడు. ఇలా చేయడం ఐసీసీ నిబంధనలకు విరుద్ధం. దీన్ని పరిశీలించిన ఐసీసీ నిబంధనలు ఉల్లంఘించినట్లు ప్రకటించింది. అంతేకాదండోయ్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించి.. ఒక డీమెరిట్ పాయింట్‌ను రబాడ ఖాతాలో వేసింది. మ్యాచ్ అనంతరం దీనిపై ఐసీసీ ప్రశ్నించగా రబాడ తన తప్పును ఒప్పుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటి వరకు రబాడ ఖాతాలో ఐదు డీమెరిట్ పాయింట్లు వచ్చి చేరాయి. గత ఏడాది ఫిబ్రవరిలో శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో మూడు పాయింట్లను తన ఖాతాలో వేసుకున్న రబాడ ఆ తర్వాత అదే ఏడాది జులైలో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టులో మరో పాయింట్‌ను జత చేసుకున్నాడు. నాలుగు డీమెరిట్ పాయింట్లతో రబాడ ఒక టెస్టు మ్యాచ్ నిషేధాన్ని ఎదుర్కొన్నాడు. ఒకవేళ 24 నెలల వ్యవధిలో రబాడ ఎనిమిది డీమెరిట్ పాయింట్లను చేరుకుంటే రెండు టెస్టులు లేదా ఒక టెస్టు రెండు వన్డే/టీ20లు లేదా నాలుగు వన్డే/టీ20ల నిషేధం ఎదుర్కోవాల్సి ఉంటుంది.

'రోహిత్ శర్మ.. స్వార్థపరుడు'

న్యూఢిల్లీ : ఆతిథ్య దక్షిణాఫ్రికాతో పోర్ట్‌ఎలిజబెత్‌లో జరిగిన ఐదో వన్డేలో భారత ఆటగాడు రోహిత్ శర్మ(115) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అయినప్పటికీ అతనిపై అభిమానులు ఆగ్రహంతో ఉన్నారు. ఎందుకో తెలుసా విరాట్ కోహ్లీ, రహానె రనౌట్‌కు కారణం రోహిత్ శర్మ. దీంతో సామాజిక మాధ్యమాల ద్వారా రోహిత్‌కు చురకలు అంటిస్తున్నారు. ఆటగాళ్ల ఫిట్‌నెస్ స్థాయి తెలుసుకునేందుకు బీసీసీఐ యో యో పరీక్ష నిర్వహిస్తుంది కదా.. ఇందులో రోహిత్ శర్మ పాసయ్యాడా.. రెండు రనౌట్లకు కారణమయ్యాడు; రోహిత్ శర్మ ఇంకా ఎన్ని రనౌట్లు చేస్తావు?, రోహిత్.. స్వార్థపరుడు; జట్టులో స్థానం కోసం రోహిత్ ఇద్దర్ని రనౌట్ చేశాడు; ఇద్దర్ని అనవసరంగా రనౌట్ చేసిన తర్వాత శతకం సాధించినప్పుడు బ్యాట్ ఎలా లేపాలనిపించింది అంటూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోర్కెల్ బౌలింగ్‌లో సింగిల్ కోసం పిలిచిన రోహిత్ కాస్త ముందుకెళ్లాడు. వెంటనే పరుగు రాదని భావించి, వద్దని చెప్పి ఆగిపోయాడు. కానీ అప్పటికే కోహ్లీ(36) చాలా దూరం వచ్చేశాడు. వెనుదిరిగినా క్రీజులోకి సురక్షితంగా చేరుకునే అవకాశం లేకపోయింది. డుమిని అండర్ ఆర్మ్ త్రోకు అతడు ఔటయ్యాడు. కాసేపటి తర్వాత రహానె కూడా దాదావుగా ఇలాగే రనౌటయ్యాడు.

సెప్టెంబరులో స్టీవ్‌స్మిత్ వివాహం



సిడ్నీ : ఈ ఏడాది సెప్టెంబరులో మరో క్రికెటర్ పెళ్లిపీటలెక్కబోతున్నాడు. పైన ఫొటో చూస్తే పెళ్లి పీటలెక్కుతున్న క్రికెటర్ ఎవరో తెలిసిపోయింది కదా. అతడే ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు సారథి స్టీవ్ స్మిత్. గత ఏడాది జూన్ 29న న్యూయార్క్‌లో ఓ ఎత్తన భవనంపై నుంచి తన గర్ల్‌ఫ్రెండ్ డేని విల్స్‌కు తన ప్రేమను వ్యక్తం చేసిన స్మిత్ ఈ ఏడాది పెళ్లితో ఒక్కటవ్వబోతున్నారు. ప్రేయసితో ఎంగేజ్‌మెంట్ అయినట్లు అప్పట్లో స్మిత్ తన ఇన్‌స్టాగ్రాం ద్వారా అభిమానులతో పంచుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈ జంట అడపదడపా కనిపిస్తూనే ఉంది. తాజాగా ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు అలెన్ బోర్డర్ పతకాల ప్రదానోత్సవ కార్యక్రమానికి వీరిద్దరూ హాజరయ్యారు. ఈ నేప థ్యంలో మీ పెళ్లి ఎప్పుడు అని విల్స్‌ను ప్రశ్నించగా.. సెప్టెంబరులో అని జవాబి చ్చింది. అంతర్జాతీయ మ్యాచ్‌లతో స్మిత్ బిజీగా ఉన్నాడు. సెప్టెంబరులో కాస్త విరామం దొరక డంతో అప్పుడే పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం అని విల్స్ తెలిపింది. 2011–12 బిగ్‌బాష్ లీగ్ సీజన్ జరిగే సమయంలో ఓ బార్‌లో స్మిత్ తొలిసారి విల్స్‌ను కలిశాడు.

చివరి వన్డేలో పాల్గొనే టీమిండియాలో మార్పులు

కొత్త వారికి ఛాన్స్ ఇవ్వడమే లక్ష్యంగా కోహ్లీ నిర్ణయం



పోర్ట్‌ఎలిజబెత్ : మరో మ్యాచ్ మిగిలి ఉండగానే వన్డే సిరీస్ కైవసం చేసుకున్న భారత్ సంబరాల్లో మునిగి తేలుతోంది. దక్షిణాఫ్రికా గడ్డపై తొలి సిరీస్ కైవసం చేసుకున్న కోహ్లీ సేన చివరి వన్డేలో మార్పులతో బరిలోకి దిగనుంది. నామమాత్రమైన చివరి వన్డే శుక్రవారం సెంచూరియన్‌లో జరగనుంది. ఇప్పటి వరకు బెంచ్‌కే పరిమితమైన ఆటగాళ్లను ఈ వన్డే ద్వారా అవకాశం కల్పించాలని కోహ్లీ భావిస్తున్నాడు. ఆరు వన్డేల సిరీస్ అనంతరం ఇరు జట్ల మధ్య మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకున్న కోహ్లీ ప్రస్తుత జట్టులోని పలువురు ఆటగాళ్లకు విశ్రాంతి కల్పించి ఇప్పటి వరకు బెంచ్‌కే పరిమితమైన మిగతా ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నాడు. సెంచూరియన్ వన్డేలో ఏ ఆటగాడి స్థానంలో ఎవరు తుది జట్టులో స్థానం దక్కించుకుంటారో తెలియాలంటే శుక్రవారం వరకు వేచి ఉండక తప్పదు. ఇరు జట్ల మధ్య మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఈ నెల 18న ప్రారంభంకానుంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·